
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 13.12.2025 | సంపుటి :12 సంచిక : 144 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ఆంధ్రా అక్రమ ప్రాజెక్టులపై
# తెలంగాణ అభ్యంతరం

- పోలవరం-నల్లమల్ల సాగర్ లింకుకు మేమొప్పుకోం
- సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని తెలంగాణ నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలవరం నల్లమల్ల సాగర్ పై ఏపీ ప్రాజెక్ట్ కు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టులో వాదనలకు సర్కార్ సిద్ధం అవుతోంది. సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. నేడు పోలవరం బనకచర్ల కేసుపై ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసింది. ఢిల్లీలో సంఘ్వీతో తెలంగాణ భారీ

మిగతా 2లో..

## జన,కుల గణనకు
# వేళాయే!

- దేశవ్యాప్తంగా రెండుదశల్లో నిర్వహణ
- డిజిటల్ రూపంలో వివరాల సేకరణ
- రూ.11,718 కోట్లు కేటాయింపు

- జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు
- పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా నామకరణం
- బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
- తెలంగాణ, ఏపీలకు నాలుగేసి కేంద్రీయ విద్యాలయాలు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** చారిత్రాత్మక జనగణన నిర్వహణ కోసం కేంద్ర మంత్రివర్గం ఏకంగా రూ. 11,718 కోట్లకు సంబంధించిన బ్జడెట్‌ను ఆమోదించింది. అలాగే మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథ కం పేరును కూడా మార్చింది. పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా పేరు మారుస్తూ శుక్రవారం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.

మిగతా 2లో..

# మెస్సీ-రేవంత్ జట్ల మధ్య నేడు ఫుట్‌బాల్ మ్యాచ్





హాజరుకానున్న రాహుల్

- నేటి మ్యాచ్‌కు భద్రత కట్టుదిట్టం
- టికెట్లు ఉన్నవాళ్లు మాత్రమే రావాలి: సీపీ

**హైదరాబాద్(జనంసాక్షి):** 'మెస్సీ గోట్ ఇండియా టూర్' కోసం పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 13న రాత్రి 7గంటలకు ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యం లో ఫుట్‌బాల్ మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మ్యాచ్‌కు టికెట్లు ఉన్నవాళ్లు మాత్రమే రావాలని సూచించారు. 34 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు మెస్సీ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో, తర్వాత ఉప్పల్

మిగతా 2లో..

# యాదవుల హృదయంలో రేవంత్ ఎప్పటికీ నిలిచిపోతారు

- సదర్‌ను తెలంగాణ ప్రభుత్వ పండుగగా గుర్తించడంపై అఖిలేష్ యాదవ్ హర్షం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి భేటి

వార్త 2 లో



## సిట్ ఎదుట ప్రభాకర్‌రావు
# లొంగుబాటు

ఫోన్ ట్యాపింగ్, హార్డ్‌డిస్క్‌ల ధ్వంసంపై విచారణ

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ ముందు లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి ఏసీపీ వెంకటగిరి ముందు ప్రభాకర్‌రావు సరెండర్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఆరు సార్లు విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే సిట్ విచారణకు ప్రభాకర్

మిగతా 2లో..



# తెలంగాణలో చలి పంజా..

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ వ్యాప్తంగా చలి పులి పంజా విసురుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు వాతావరణ శాఖ అధికారిణి శ్రావణి తెలిపారు. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. శుక్రవారం, శనివారం శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు

మిగతా 2లో..

## అల్లూరి జిల్లాలో
# ఘోర విషాదం



## లోయలో పడ్డ బస్సు.. 9మంది దుర్మరణం

- ప్రమాదంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**అల్లూరిజిల్లా(జనంసాక్షి):** అల్లూరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో పదిమంది వరకు మృతి చెందినట్లు సమాచారం. చింతూరు నుంచి మారేడుమిల్లి వెళుతున్న బస్సు ఘాట్‌రోడ్డు వద్ద అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఘటనాస్థలి వద్ద ప్రయాణికులు హాహాకారాలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో నిండుగా ప్రయాణికులున్నారు. భద్రాచలంలో ఆలయ దర్శనం చేసుకొని అన్నవరానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాలను బస్సు నుంచి వెలికితీశారు. గాయపడిన వారిని వెంటనే చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. 3 అంబులెన్సులు, 5 పోలీసు వాహనాలతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ బస్సు ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనేక వాహనాలు ఘాట్ రోడ్డులో నిలిచిపోయినట్లు సమాచారం. ప్రమాదానికి గురైన వారందరు చిత్తూరు జిల్లావాసులని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో దాదాపు అందరు వృద్ధులు అని వివరించారు. ఘటనపై పోలీసులు కేసు

మిగతా 2లో..

## 2047 విజన్ డాక్యుమెంట్
# అద్భుతం

లక్ష్యాలపై తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉంది
ప్రశంసించిన జర్మనీ పార్లమెంట్ బృందం

- జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం
- ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో కలిసి పనిచేద్దాం : డిప్యూటీ సీఎం భట్టి
- సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత : శ్రీధర్ బాబు
- ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశం
- ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవం, వ్యవసాయాధారిత రంగాలపై చర్చ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది. ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను ఈ విజన్ డాక్యుమెంట్ లో స్పష్టంగా పేర్కొనడం అభినందనీయమని, రాష్ట్ర ప్రగతి పట్ల మీ నిబద్ధత ఈ డాక్యుమెంట్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందని జర్మనీ పార్లమెంట్ బృందం డిప్యూటీ సీఎం, మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కోరుకుంటున్నామని జర్మన్ పార్లమెంట్ బృందం వివరించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలామంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారత దేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం వివరించింది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్డ్ లేబర్ కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవ లేదని అన్నారు. జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా


మిగతా 2లో..

# పంచాయతీ పోరులో ప్రజాపాలనవైపే ప్రజలు

- ఈశ్వరాచారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం..
- ఆత్మహత్యలు చేసుకోవద్దు.. బీసీ రిజర్వేషన్లు సాధించి తీరుతాం
- రూ.5లక్షల నష్టపరిహారం చెక్‌ను కుటుంబానికి అందజేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం

**హైదరాబాద్(జనంసాక్షి):** బిసి రిజర్వేషన్లు కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ఎవ్వరు అధైర్యపడొద్దని, బిసి రిజర్వేషన్లు సాదించుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్టలోని ఈశ్వరచారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్ ను అందజేశారు. దీనితోపాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని చెప్పారు. బిసి సమాజం రిజర్వేషన్లు సాధన కోసం కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఆయన కోరారు.

మిగతా 2లో..



# పుష్కరకాలానికి నిద్రలేచిన అన్నా హజారే..

- మళ్లీ దీక్ష చేస్తాడట!
- లోకాయుక్త చట్టం అమలులో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలంపై నిరసన



**పుణె(జనంసాక్షి):** మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జనవరి 30న నిరాహార దీక్ష చేపట్టను న్నట్లు ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే వెల్లడిం చారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని ఆయన ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి ఈ చట్టం చాలా కీలకమని.. అయితే పదే పదే హామీలు ఇచ్చినప్పటికీ దానిని విస్మరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ తీరు కు నిరసనగా తాను నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు 88 ఏళ్ల హజారే తెలిపారు. ఇప్పుడు తాను చేపట్టే నిరాహార దీక్షయే తన ఆఖరి నిరసన అవుతుందేమోనన్నారు. లోకాయుక్త

మిగతా 9లో..

# ఇథనాల్‌పై తిరగబడ్డ రాజస్థాన్ రైతు



- దుర్వాసన.. దుర్గంధం.. భూ, జల కాలుష్యం భరించలేం..
- రెండేళ్లుగా దండాలూ, దరఖాస్తులు.. సహనం కోల్పోయిన అన్నదాతలు
- హనుమాన్‌గఢ్ జిల్లా రథీఖేడాకు తరలొచ్చిన రాజస్థాన్, పంజాబ్, హర్యానా రైతులు
- ఫ్యాక్టరీ రక్షణ గోడ ధ్వంసం.. జేసీబీలు, కార్లు, పోలీసు వాహనాలకు నిప్పు





- రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం.. లాఠీచార్జీతో విరుచుకుపడ్డ పోలీసులు
- ఇంటర్నెట్ సేవల బంద్.. 107 మందిపై కేసులు, 40 మంది అరెస్ట్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేతో పాటు పలువురికి గాయాలు
- రైతుల బృందంతో జిల్లా యంత్రాంగం చర్చలు.. ప్రభుత్వానికి రిపోర్ట్

ప్రజలకు పెనుముప్పుగా పరిణమిస్తున్న ఇథనాల్ కంపెనీలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణతో పాటు పలుచోట్ల ప్రజా ఉద్యమాలు తీవ్రతరమై ఫ్యాక్టరీలు వెనక్కి వెళ్లిపోగా.. తాజాగా రాజస్థాన్‌లోని రైతాంగం ఇథనాల్‌కు వ్యతిరేకంగా ఉద్యమం తీవ్రతరం చేసింది. కాలుష్య పరిశ్రమలొస్తే తమ జీవనోపాధితో పాటు ఇక్కడ జీవించడమూ కష్టమేనన్న ఆందోళనతో ఏడాదికాలంగా పోరాడుతున్నారు. ఎంత మొరపెట్టుకున్నా ప్రభుత్వ స్పందన లేకపోవడంతో గురువారం రోజున రైతులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు టియర్ గ్యాస్, లాఠీచార్జీలతో విరుచుకుపడ్డప్పటికీ.. వేలాది మంది రైతులు, ప్రజలు తరలొచ్చి ఫ్యాక్టరీ వద్ద ప్రహరీ గోడను ధ్వంసం చేశారు. పోలీసు వాహనాలు సహా జేసీబీలు, నిర్వాహకుల కార్లను పగులగొట్టారు. నిరసనను అణిచివేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేయగా రైతులు రాళ్లదాడులతో ఎదురుతిరగడం సంచలనంగా మారింది.

- జైపూర్ (జనంసాక్షి) :

వివరాలు 2లో

# నేను సీఎం ఐతే నీ భరతం పడతా..!

- తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు
- బీఆర్ఎస్ అక్రమాలపై విచారణ చేయిస్తా
- పార్టీ నుంచి బయటకు పంపినా వారి కళ్లు చల్లారలేదా?
- నాపై ప్రచారం చేయిస్తున్న హరీశ్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావులకు
- నోటీసులు
- వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్

2 లో..



## 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం

ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రజాభవన్ లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది, కలిసి పని చేద్దామని డిప్యూటీ సీఎం తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది దీంతోపాటు మూసి పునరుజ్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగం పైన ఆసక్తిగా ఉంది, హైదరాబాద్ ఐటీ రంగానికి హబ్ గా వెలుగొందుతుందని ఈ రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీలో జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని తద్వారా తెలంగాణ విద్యార్థులు జర్మనీ భాష నేర్చుకొని జర్మనీ దేశంలో పని చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ కేంద్రం ఏర్పాటు చేశామని ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని జర్మనీ పార్లమెంట్ బృందానికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. జిల్లాల్లో కూడా సైబర్ సెక్యూరిటీ బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు..

## అమెరికా వచ్చి పిల్లల్ని కంటే వీసా రద్దే..

**భారత టూరిస్ట్‌లకు ట్రంప్ హెచ్చరికలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** వీసాల విషయంలో అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో పర్యాటక వీసాలపై కొత్తగా హెచ్చరికలు జారీ చేసింది.ఎవరైనా అమెరికాలో ప్రసవించి.. తమ పిల్లలకు పౌరసత్వం పొందాలనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకుంటే వీసాలు తిరస్కరించనున్నట్లు తాజాగా ఓ ప్రకటనలో అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.కాగా, డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత అమెరికాలో వలసదారులకు చుక్కలు చూపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పర్యటక వీసా జారీ విషయంలోనూ ట్రంప్ సర్కార్ అనేక జాగ్రత్తలు తీసుకుంటుంది. తాజాగా అమెరికా గడ్డపై బిడ్డకు జన్మనిచ్చి, తద్వారా జన్మతః పౌరసత్వం పొందాలనే ఉద్దేశంతో పర్యాటక వీసా దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తులను తిరస్కరిస్తామని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ట్విట్టర్ వేదికగా..'పుట్టబోయే చిన్నారులకు అమెరికా పౌరసత్వం పొందడం పర్యాటకుల ప్రధాన ఉద్దేశంగా ఉంటే.. అటువంటి వారి వీసా దరఖాస్తులను తిరస్కరిస్తాం. ఇటువంటి వాటిని అనుమతించం' అని పేర్కొంది. మరోవైపు తమ దేశంలోకి వచ్చే పర్యాటకుల్లో కొందరు దరఖాస్తు సమయంలో తప్పనిసరిగా తమ సోషల్ మీడియా హిస్టరీని అందించకుండా తప్పిదం చేసే యోచనలో ట్రంప్ సర్కార్ ఉన్నట్లు విషయం తెలిసింది. దీంతో, హెచ్-1బీ వీసాదారుల సోషల్ మీడియా కార్యకలాపాల సమీక్షను కూడా విస్తరించారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.అంతేకాకుండా.. అమెరికా రాయబార కార్యాలయం ప్రతినిధి ఒక ప్రకటనలో, విదేశాంగ శాఖ ఇప్పటికే విద్యార్థి, సందర్శకుల వీసా వర్గాలకు సోషల్ మీడియా ఖాతాల తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వీసా దరఖాస్తుదారులందరికీ సోషల్ మీడియా స్క్రీనింగ్‌ను తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. ఇది వేలాది మంది హెచ్-1బీ వీసాదారులు, వారి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, ప్రతి కేసును క్షుణ్ణంగా భద్రతా సమీక్ష చేస్తామని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది.

## అంత సంతోషంగా ఉంటే వాణిజ్య ఒప్పందంపై సంతకం చెయ్యండి

**అమెరికా వాణిజ్య ప్రతినిధి వ్యాఖ్యలపై పీయూష్ గోయల్ స్పందన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్- అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్చల్లో తమకు భారత్ నుంచి అత్యుత్తమమైన ట్రేడ్ ఆఫర్స్ అందాయంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. మా ఆఫర్లతో సంతోషంగా ఉంటే ట్రేడ్ డీల్‌పై సంతకం చేయాలని వ్యాఖ్యానించారు. గురువారం గ్రీర్ వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు గోయల్ ఇలా స్పందించారు. 'ఆయన ఆనందాన్ని స్వాగతిస్తున్నాం. ఆయన చెప్పినట్లు భారత ఆఫర్స్‌తో నిజంగా సంతోషంగా ఉంటే.. వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయాలని కోరుతున్నా' అని అన్నారు. ఇక, అమెరికాతో అయిదు రౌండ్ల వాణిజ్య చర్చలు జరిగాయని గోయల్ తెలిపారు. ఆ దేశ డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ భారత పర్యటనకు, ఈ చర్చలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. స్విట్జర్ పదవి చేపట్టిన తర్వాత తొలి భారత పర్యటన ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఇక, యూఎస్‌తో వాణిజ్య చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఇక, వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లు ఫోన్‌లో మాట్లాడుకున్న సంగతి తెలిసిందే. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని సమీక్షించడంతో పాటు అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నట్లు మోదీ తెలిపారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు.

## పంచాయితీ ఫలితాలు బీఆర్ఎస్‌కు బూస్ట్: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** పంచాయితీ ఎన్నికల్ల కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత స్పష్టమయ్యి ందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ దాటకపోవడం.. ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శమన్నారు. ఈ మేరకు తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగిందని తెలిపారు. కానీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా రుజువైందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.తొలి విడత పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు హోరాహోరీగా పోరాడి.. సర్పంచులు, వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచక పర్వాన్ని ఎదుర్కొన్నారంటూ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా గులాబీ సైనికులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## యాదవుల హృదయంలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ నిలిచిపోతారు



**హైదరాబాద్(జనంసాక్షి):** యాదవ్‌లకు ఎంతో ఇష్టమైన సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశంలోని యాదవ సమాజం రేవంత్ రెడ్డిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఆయన అన్నారు. యాదవుల హృదయంలో రేవంత్ రెడ్డి ఉండిపోతారని అఖిలేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.తెలంగాణ లో ని యాదవ వర్గానికి రాజకీయంగా మంచి గుర్తింపు ఇస్తున్నందుకు ఆయన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిఎం రేవంత్‌తో ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ ఆర్థికవేత్త, భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సమాచారం. అయితే వీరి భేటీలో ఇటీవలి ఫ్యూచర్ సిటీ, పెట్టుబడులు తదితర అంశాలు చర్చకు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

## ఆంధ్రా అక్రమ ప్రాజెక్టులపై తెలంగాణ అభ్యంతరం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం కానున్నారు.నేడు పోలవరం-బనకచర్ల సుప్రీంకోర్టు కేసుపై ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో మధ్యాహ్నం 12 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అభిషేక్ మను సింఘ్వితో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమవుతారు. ఏపీ సర్కార్ తలపెట్టిన ప్రాజెక్ట్ పై లోతుగా చర్చించనున్నారు. ఆపై న్యాయపోరాటానికి దిగే అవకాశం ఉంది.ఇక ఇటీవలనే పోలవరం - నలమల సాగర్ డీపీఆర్ రూపకల్పన కోసం టెండర్లను పిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నల్లమలసాగర్ లింక్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అన్ని ఆధారాలతో సుప్రీంకోర్టులో పోరాటం చేయాలని తెలంగాణ సర్కార్ చూస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను త్వరలోనే మొదలు పెట్టాలని ఇటీవలే సీఎం చంద్రబాబు కూడా అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి వరద జలాలను బొల్లాపల్లి, నల్లమల సాగర్‌లకు, అలాగే, నాగార్జున సాగర్ నుంచి 50 టీఎంసీల కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించే యోచన చేయాలని సూచించారు. ముందుగా ప్రతిపాదించిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్ ను మొత్తం రూ.80,112 కోట్లతో ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం జల హారతి కార్పొరేషన్ ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్ట్ ను మొత్తం 3 దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి%%. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్‌లోకి తీసుకోనుంది. అక్కడ్నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించాలనేది ఏపీ సర్కార్ ప్లాన్. వీటి కోసమే టెండర్లను ఆహ్వానించింది. కానీ పలువైపుల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వెనక్కి తగ్గింది. పోలవరం నుంచి వరద జలాల తరలింపును బనకచర్ల వరకు కాకుండా మధ్యలో నల్లమల సాగర్ వరకే పరిమితం చేయాలని ఏపీ సర్కార్ నిర్ణయించింది. గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టుతో పోల్చితే ఈ కొత్త అనుసంధానంతో భారీగా వ్యయం తగ్గే అవకాశం ఉంది.

## నేను సీఎం ఐతే నీ భరతం పడతా..!

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్‌లకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు. తనపై, తన భర్త అనిల్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ నోటీసులో తెలిపారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి హరీష్ రావు, బీఎర్ఎస్ టార్గెట్‌గా జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్‌ను ఒక్క సహాయం కూడా అడగలేదని తెలిపారు. ఉద్యమంలో ఎవరు ఏమి చేశారనేది తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావుతో హరీష్, బీఆర్ఎస్ తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలు తన దృష్టికి వస్తున్నాయని... అసలు కథ ముందుంది అంటూ కామెంట్స్ చేశారు. నేను మంచి దాన్ని కాదు. కాళ్ళు విరగొడతానంటూ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో తాను, తన భర్త ఒక్క పని అయినా అడిగామా అని ప్రశ్నించారు. తాను ఏ తప్పు చేయలేదని.. బీఆర్ఎస్‌లో 10 ఏళ్లలో ఒక్క రూపాయి సంపాదించలేదని స్పష్టం చేశారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని.. లేదంటే కోర్టుకి ఈడుస్తామని వార్నింగ్ ఇచ్చారు. తనను పార్టీ నుంచి పంపించారని.. అయినా వాళ్ల కళ్ళు చల్లబడలేదా అని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిచిందని.. కాంగ్రెస్ డోర్స్ ఓపెన్ చేసిందన్నారు. తనపై ఎవ్వరు ఎలాంటి ఆరోపణలు చేసినా జవాబు చెబుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో చాలా తప్పిదాలు జరిగాయని... అవి తన దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్ళు తప్పు చేశారనే.. రేవంత్ అధికారంలోకి వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన లావాదేవీలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఉందని ఆరోపించారు. 'నేను ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతా. హరీష్ రావు.. విజ్ఞత అని తప్పించుకుంటున్నారు. లైన్‌లు నేను దాట లేదు. నేను ఇంకా ఊరుకోను ' అంటూ కవిత సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మెస్సీ-రేవంత్ జట్ల మధ్య నేడు ఫుట్‌బాల్ మ్యాచ్

స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో పాల్గొంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్, ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలు ఇప్పటికే ఖరారయ్యాయి. 13వ తేదీ రాత్రి కూడా ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే మెస్సీ బస చేయనున్నారు.

## సిట్ ఎదుట ప్రభాకర్ రావు లొంగుబాటు

సహకరించకపోవడంతో కస్టోడియల్ విచారణకు ఇవ్వాలని సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణకు సుప్రీం ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సిట్ ముందు సరెండర్ అయ్యారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రభాకర్ రావు విచారణ కొనసాగుతోంది. ఏడాది మే 29 నుంచి ఇప్పటి వరకు సుప్రీం కోర్టు కల్పించిన మధ్యంతర రక్షణలోనే ప్రభాకర్ రావు ఉన్నారు.

## రసకందాయంలో కర్నాటకం

- రాష్ట్రంలో విందు రాజకీయం
- ఎమ్మెల్యేలతో డికె డిన్నర్ మీటింగ్

**బెంగళూరు(జనంసాక్షి):** కర్ణాటక రాజకీయాలు కొన్ని నెలలుగా చర్చనీయాంశమవుతున్నాయి. సిఎం పదవి కోరుకుంటున్న డికె శివకుమార్ ఎత్తులు వేస్తున్నారు. అంతకు మించి అన్నట్లు సిద్దరామయ్య కూడా పావులు కదుపుతున్నారు. దీంతో ఇప్పుడు ఈ ఇద్దరి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఇప్పుడు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భాజపా నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. ఇవన్నీ సాధారణ కార్యక్రమాలేనని నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్నాం. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. అదొక స్నేహపూర్వక సమావేశం'అని డీకే అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్ని రోజులుగా ఊహాగానాలు వినిపిస్తోన్న తరుణంలో ఈ బల ప్రదర్శనలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## తెలంగాణలో చలి పంజా..

చెప్పారు. ఎల్లుండి నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులు, పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పంచాయతీ పోరులో ప్రజాపాలనవైపే ప్రజలు

ఈశ్వరచారి ఆత్మహత్య అత్యంత దురదృష్టకరమని, ఏ ఒక్కరు ఆత్మహత్య చేసుకోవద్దని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని అన్నారు. కార్యక్రమంలో బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా.వినయ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి, బిసి సంఘం నాయకులు గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో ఘోర విషాదం

నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 30 మంది బస్సులో ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో చోటుచేసుకున్న బస్సు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భద్రాచలం నుంచి అన్నవరం వెళుతున్న ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో మాట్లాడారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణీకులు ఉన్నారని, పలువురు మృతి చెందగా గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు ముఖ్యమంత్రి తెలియజేశారు.ద్రాచలం సమీపంలో తులసిపాక వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భాంరతి వ్యక్తం చేశారు. మరణించినవారికి తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధితులకు అండగా సిపిఎం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని స్థానిక నాయకత్వాన్ని, కార్యకర్తలను కోరారు. ప్రభుత్వం తక్షణం సహాయం అందించి క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 'ఇథనాల్'పై తిరగబడ్డ రాజస్థాన్ రైతు





రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ జిల్లా, తిబ్బీ ప్రాంతంలోని రథీఖేడా గ్రామంలో డ్యూన్ ఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 450 కోట్ల రూపాయలతో గ్రెయిన్ ఆధారిత 40 మెగావాట్ ఇథనాల్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (ఈబీపీ) కార్యక్రమానికి మద్దతు ఇస్తుందని కంపెనీ చెబుతోంది. అయితే రెండేళ్లుగా స్థానిక రైతులు, గ్రామీణులు ఈ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిరసన చేస్తున్నారు. పీల్చే గాలి, తాగే నీరు కూడా కలుషితమై ఇక్కడ ఉండలేని పరిస్థితి ఉంటుందని, వ్యవసాయ పంటలు నాశనమై జీవనమే లేకుండా పోతుందని వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం తిబ్బీలో 'మహాపంచాయత్' (పెద్ద గ్రామ సభ) నిర్వహించారు. వేలాది మంది రైతులు (రాజస్థాన్, పంజాబ్, హర్యానా నుంచి) ట్రాక్టర్లతో ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ గోడలను కూల్చి, అక్కడ ఏర్పాటుచేసిన కార్యాలయానికి నిప్పంటించారు. జేసీబీలు సహా పలు పోలీసు వాహనాలకు, ఫ్యాక్టరీ నిర్వాహకుల కార్లకు కూడా నిప్పంటించారు. దీంతో లాఠీచార్జి చేసిన పోలీసులు.. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోగా.. వేలాది మంది గుమిగూడటం, భారీగా పోలీసు బలగాలు రావడంతో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రూపిందర్ సింగ్ కున్నర్‌తో పాటు 40 మందిని అరెస్ట్ చేశారు. మొత్తం 107 మందిపై కేసులు నమోదు. తిబ్బీ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు బంద్ చేశారు. మార్కెట్లు మూసివేశారు. ఫ్యాక్టరీ సమీపంలో 30 కుటుంబాలు భయంతో ఇళ్లు వదిలి వెళ్లాయి. సంగరియా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభిమన్యు పునియా తలకు తీవ్ర గాయాలు కాగా ఆయనను ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్, సీపీఎం పార్టీలు సహా పలు ప్రజాసంఘాలు, రైతు సంఘాలు ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి మద్దతుగా నిలిచాయి.

### మాయమాటలతో ఫ్యాక్టరీ

హనుమాన్‌గఢ్ జిల్లాలోని సంగరియా నియోజకవర్గ పరిధిలోని తిబ్బి సమీపంలో "జీరో పొల్యూషన్" అనే మాయమాటలతో రైతులను మోసం చేసి ఒక పెద్ద ఇథనాల్ (గ్రెయిన్-బేస్డ్ డిస్టిలరీ) ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి రోజూ వెలువడుతున్న దుర్వాసన, నల్లటి పొగ, దూషిత నీటిని పొలాల్లోకి వదిలివేవిధంగా విడుదల చేయడంతో గాలి, నీరు, నేల అన్నీ తీవ్రంగా కలుషితమయ్యాయి. పంటలు ఎండిపోతున్నాయి, పశువులు చనిపోతున్నాయి, పిల్లలు పెద్దలు శ్వాస, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారు. గత రెండేళ్లుగా గ్రామస్తులు, రైతులు శాంతియుతంగా ధర్నాలు చేసి ప్రభుత్వంతో పాటు పర్యావరణ బోర్డుకు ఫిర్యాదులు చేశారు. కానీ ఎవరూ స్పందించలేదు. ఉన్నతాధికారులు సైతం కంపెనీకే వత్తాసు పలికారు. దీంతో గతేడాది నుంచి రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. ఫ్యాక్టరీని ముట్టడిరచేందుకు వేలాది మంది తరలిరావడంతో పోలీసులతో ఘర్షణ జరిగింది.

### ప్రజల అనుమతి వద్దా..?

ఫ్యాక్టరీ ద్వారా వెయ్యి మంది వరకు ఉపాధి దొరుకుతుందని చెబుతున్న జిల్లా అధికారులు.. ఫ్యాక్టరీకి అన్ని అనుమతులున్నాయని అంటున్నారు. అయితే పర్యావరణ క్లియరెన్స్ పత్రాలు, స్థానికుల అనుమతి లేకుండా ఫ్యాక్టరీని నడపడం కుదరదని అఖిల భారత కిసాన్ సభ నేత మాంగేజ్ చౌదరి చెప్పారు. ఈ కర్మాగార నిర్మాణాన్ని ఏడాదికిపైగా వ్యతిరేకిస్తున్న రైతులు, ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం, నీటి విషప్రభావం ఏర్పడుతుందని, దీనివలన పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు బంజరుగా మారుతాయని ఆరోపించారు. ఇది స్థానిక రైతులకు జీవనోపాధి సంక్షోభాన్ని సృష్టిస్తుందని హెచ్చరించారు. 'బిజెపి ప్రభుత్వ అహంకారం పరాకాష్టకు చేరుకుంది. రైతుల మాట వినడానికి బదులుగా, ప్రభుత్వం నియంతృత్వాన్ని నడుపుతోంది' అని కాంగ్రెస్ నేత గెహ్లాట్ పేర్కొన్నారు.

### రైతుల బృందంతో చర్చలు

రైతుల ఆందోళన నేపథ్యంలో గురువారం 11 మంది రైతుల బృందం జిల్లా యంత్రాంగంతో చర్చలు జరిపింది. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని, హింసపై న్యాయ విచారణ జరపాలని, నిరసనకారులపై నమోద్కెన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హనుమాన్‌గఢ్ కలెక్టర్ ఖుషాల్ యాదవ్ మాట్లాడుతూ డిమాండ్ల చార్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. అయితే టిబ్బిలోని సింగ్ సభ గురుద్వారాలో రైతులు, ప్రతిపక్ష పార్టీల స్థానిక నాయకులు గుమిగూడడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కరణ్‌పూర్ ఎమ్మెల్యే రూపిందర్ సింగ్ కూనర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కరణ్ సహారన్, మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బింజ్‌బ్కెలా మండి బస్ స్టాండ్ వద్ద సమావేశానికి వెళుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఎందరిని అరెస్ట్ చేసినా ఈ పోరాటం కొనసాగుతుందని రైతులు భీష్మిస్తున్నారు. ఈరోజు రాజస్థాన్‌లో.. రేపు దేశంలో ఎక్కడ్కెనా పెట్టుబడిదారులు 'జీరో పొల్యూషన్', 'గ్రీన్ ఎనర్జీ', 'రైతుల మేలు' అనే మాయమాటలతో లాభాలు కొల్లగొడుతారని, కానీ ఆ లాభాల వెనుక స్థానిక ప్రజలు, రైతులు, భవిష్యత్ తరాలు శాశ్వతంగా బాధపడాల్సి వస్తుందని రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మోసాలను సమైక్య పోరాటాలతో అడ్డుకోవాలని సూచిస్తున్నారు.

## జన,కుల గణనకు వేళాయే..!

ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినేట్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జనగణలో కులగణను చేర్చడంతో పాటు రెండు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్ని రెండు దశల్లో నిర్వహిస్తామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాలను జాబితా చేసి, లెక్కిస్తామని చెప్పారు. 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కల సేకరణపై దృష్టిపెడతామని చెప్పారు. ఇదే తొలి డిజిటల్ జనగణన అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ జనాభా లెక్కల్లోనే కులగణన చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ కోసం రూ.11,718 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. రాబోయే జనగణన దేశ చరిత్రలోనే మొట్టమొదటి డిజిటల్ జనగణన కానుంది. ఈ జనగణన ప్రక్రియకు సంబంధించి మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా నిర్ణయించడం జరిగింది. ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనగణన మొదటి దశ ఏప్రిల్ 2026 నుండి సెప్టెంబర్ 2026 వరకు కొనసాగుతుంది, రెండవ దశ ఫిబ్రవరి 2027లో పూర్తవుతుంది. ఇకపోతే పల్లెప్రాంత నిరుపేదలకు ఏడాదిలో వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' పథకాన్ని 2006లో ప్రారంభించింది. తర్వాత దానిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా పేరు మార్చారు. ఇప్పుడు మరోసారి ఆ పేరు మార్పునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సాధారణ, జీవిత, ఆరోగ్య బీమాలో 74శాతం వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. ఈ రంగంలోకి ఎఫ్‌డీఐలకు పూర్తిగా అనుమతి నిస్తే, దేశీయ పెట్టుబడులూ పెరిగే అవకాశం ఉందని కేంద్రం అంచనావేస్తోంది. 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతిస్తే, విదేశీ సంస్థలు భారతీయ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా పనిచేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని, దీనివల్ల ఈ రంగానికి మేలు జరిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఆమోదం లభించింది.కేబినెట్ తీసుకున్న ఆర్థికపరమైన నిర్ణయాల గురించి మంత్రి వైష్ణవ్ మాట్లాడుతూ.. దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుదలను కూడా ప్రస్తావించారు. దేశంలో దేశీయంగా ఉత్పత్తి పెరగడం వలన, ఆర్థికపరమైన నిర్ణయాల సానుకూల ఫలితంగా దేశానికి సుమారు రూ.60,000 కోట్ల విదేశీ కరెన్సీ ఆదా అవుతోందని మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది. నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం అందించనున్నారు. పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు ఇవ్వనున్నారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ పాలసీకి ఆమోదం తెలిపింది.

# బీసీల భావోద్వేగంతో చెలగాటమాడితే మనుగడ ఉండదు

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ అధికార సింహాసనమును దక్కించుకుందని, ఆ డిక్లరేషన్ను అమలు చేయనందున అధికార గద్దెల నుంచి దిగక తప్పదన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ హెచ్చరించారు. బీసీల అస్తిత్వంతో చెలగాటమాడిన ఏ ప్రభుత్వానికి మనుగడ ఉండదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల భావోద్వేగంతో ఆటలాడుకుంటుందని అది ఎప్పటికైనా బాస్వరంలా భగ్గుమంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయి ఈశ్వరాచారి బలిదానంతో బీసీ భావోద్వేగాలు ప్రజ్వరిల్లుతున్నాయని, ఆ జ్వాలలు ప్రతి బీసీ గుండెను తాకుతున్నాయని చెప్పారు. ఎన్ని వాగ్దానాల ఫైర్ ఇంజన్లు పెట్టినా బీసీ భావోద్వేగాల మంటలను ఆర్పలేవని చెప్పారు. శుక్రవారం బషీర్‌భాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జూలూరు మాట్లాడుతూ తనలాంటి వాళ్లు పేదరికం నుంచి బయటపడాలంటే బీసీ సమాజమే పేదరికం నుంచి బయటపడాలని, బీసీలకు ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయాలు జరగాలని సాయి ఈశ్వర చారి ఆత్మహృతికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లభిస్తే బీసీల జీవితాల్లో మార్పు వస్తుందని ఈశ్వర చారి ఆత్మ బలిదానానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఈశ్వర చారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి కోటి రూపాయలు ఇవ్వాలని, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, వారి బిడ్డల చదువును బాధ్యతగా చూడాలనిడిమాండ్ చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై పెదవి తెరవకపోవడం బాధాకరమని బీసీ సమాజం ఆవేదన వ్యక్తం చేస్తుందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ చూసి బీసీలు కాంగ్రెస్‌ను గెలిపించాలని, తీరా గెలిచాక వారి ఆశలను అడియాశలు చేశారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో తమకు 42 శాతం రిజర్వేషన్లు వస్తాయని, అన్ని రకాల ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో 42 శాతం బీసీలకు ఇస్తారని ఎదురు చూసిన బీసీలకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. బీసీల ఆశలను అడియాశలు చేసి పాత రిజర్వేషన్ల కంటే తక్కువ రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపడం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో బీసీలకు మొండి చేయి చూపిన ప్రభుత్వం ఇక విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇస్తారా అని ప్రతి బీసీ నిరసన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈశ్వర చారి మరణం ప్రభుత్వ హత్యే అవుతుందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసి తాము గద్దెనెక్కేందుకు మోసపూరిత వాగ్దానాలు చేసారని ప్రతి బీసీ మదనపడుతున్నారని చెప్పారు. బీసీల గొంతులను నులిమేసి ఇంకెంత కాలమైన ఏలుకుంటూ వస్తామని విర్రవీగే వారి ఆధిపత్య రాజకీయాలకు చరమగీతం పాడే సమయం దగ్గరికొచ్చిందన్నారు. బీసీ ఉద్యమం మలుపు తీసుకుంటున్న సమయంలో కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, మేధావులు, పౌరసమాజాలు చారిత్రక పాత్రను పోషించేందుకు ముందుకు రావాలని జూలూరు కోరారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం అధ్యక్షులు వేములవాడ మధన్ మోహన్ మాట్లాడుతూ ఈశ్వర చారి ఆత్మాహుతి ప్రభుత్వం చేసిన హత్యగా భావిస్తున్నామన్నారు. 33 సంవత్సరాల వయస్సులో ప్రాణత్యాగం చేసినందున ఆ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈశ్వర చారి రెండు కోట్లమంది బీసీల పేదరికాన్ని చూసి ఆత్మబలిదానం చేసుకున్నారని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వనందున ఈ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. బీసీల డిక్లరేషన్లు అమలుచేయకపోవడంతో ఈశ్వర చారి ఆత్మత్యాగం చేశారన్నారు. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ బీసీలను ఓటేసే యంత్రాలుగా బలిపశువులుగా వాడుకుంటున్నారని ఆధిపత్య రాజకీయాలను తిప్పికొట్టే సమయం దగ్గరికొచ్చిందన్నారు. ఈశ్వర చారి ఆత్మబలిదానం బీసీలను అట్టుడికిస్తుందని చెప్పారు. మన ఓటుతో మన వాట సాధించుకుందామన్న ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. వీరతెలంగాణ పోరులో దొడ్డి కొమరయ్య, తొలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రవీంద్రనాథ్, మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి, బీసీ ఉద్యమంలో సాయి ఈశ్వరాచార్యులు తొలి అమరవీరులన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ కవులు, రచయితలు, సామాజిక చింతనాపరులు బీసీల న్యాయబద్ధమైన ఉద్యమానికి మద్దతు ప్రకటించి సాహిత్య సృష్టి చేయాలని కోరారు. అన్ని ఉద్యమాలకు మద్దతు ప్రకటించిన కవులు, రచయితలు బీసీల సామాజిక ఉద్యమానికి కూడా తోడుగా ఉండాలన్నారు. బీసీ బిల్లును అసెంబ్లీలో కాకుండా పార్లమెంటులో ప్రవేశపెట్టి పాస్ చేయించాలని తెలిపారు. ప్రముఖ కవి లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో విషాదఘట్టాలు చూసి అలసిపోయామని చెప్పారు. ప్రాణ త్యాగాలు చేసుకోవద్దు, పోరాటాలు చేయాలన్నారు.యువత ఆత్మబలిదానాల దారి కాకుండా ఉద్యమదిశగా ఉద్భృతం కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన 1200 మందిని చూసామని, ఇక బీసీ బిడ్డలు ఆత్మబలిదానాలు చేసుకోవద్దని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కవి, రచయిత యం.డి.జలాలోద్దీన్, బైరోజు రవీంద్రాచారి, క్షీరసాగరం ప్రసాద్, బెజ్జారపు రామ్మోహన్, కందుకూరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసిసిసిలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభించిన డీజీపీ



హైదరాబాద్ (జనంసాక్షి) : డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి బంజారాహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌లో అత్యాధునిక ఫిట్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ పోలీస్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణా ఈగల్ ఫోర్స్ మరియు టిజిఐసిసి వంటి పనిచేసే యూనిట్లలోని సిబ్బంది శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం మెరుగుపరచడానికి ఈ కొత్త సెంటర్ను సిద్ధం చేశారు. 1900 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పబడిన ఈ ఫిట్‌నెస్ సెంటర్లో అత్యాధునిక కార్డియో, స్ట్రెంథ్-ట్రైనింగ్ మరియు కండిషనింగ్ పరికరాల సముదాయం ఉంది. ఇందులో ట్రెడ్‌మిల్స్, లాట్ పుల్-డౌన్ యంత్రాలు, మల్టీఫంక్షనల్ వి-షేప్ ట్రైనర్‌లు, వర్టికల్ చెస్ట్-ప్రెస్ యూనిట్లు, ఒలింపిక్ ఎఫ్ఐడి బెంచీలు, సూపర్ బెంచీలు మరియు ఇతర వృత్తిపరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. క్రమబద్ధమైన శిక్షణకు మద్దతుగా, సంపూర్ణ శారీరక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ కేంద్రంలో టేబుల్ టెన్నిస్ సౌకర్యంతో పాటు వర్కౌట్ జోన్‌లు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణా పోలీస్ శాఖలోని పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. డైరెక్టర్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్ , కమీషనర్ ఆఫ్ పోలీస్ వి సి సజ్జనార్ , డైరెక్టర్, టీజీఐసీసీ విబి కమలాసన్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీస్, సైబరాబాద్ అవినాష్ మహంతి, డీఐజీ, తెలంగాణా ఈగల్ ఫోర్స్ అభిషేక్ మహంతిబీ ఎస్పీ, టీజీఐసీసీ పుష్ప, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చిన టీజీఐసీసీ అధికారులను అభినందించారు. ఇటువంటి చర్యలు సిబ్బందిలో నైతిక స్థైర్యాన్ని బలోపేతం చేసి, పోలీసింగ్ విభాగంలో నిరంతర ఉత్తమ పనితీరుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# 14న ఢిల్లీలో జరిగే ఓట్ చోర్ వ్యతిరేక మహాధర్నాను విజయవంతం చేయండి


**టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి**



హైదరాబాద్ (జనంసాక్షి) : ఈనెల 14న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఏఐసిసి అధ్వర్యంలో ' ఓట్ చోర్ వ్యతిరేక మహా ధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్లలో అవకతవకలు చోటు చేసుకున్నందుకు రాజ్యాంగాన్ని రక్షించడానికి ఐక్యతను చాటి చెప్పేందుకు ఈనెల 14న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఓట్ చోర్ వ్యతిరేక మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి టిపిసిసి అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పాక్‌లో సంస్కృతం పట్ల మోజు

- లాహోర్ వర్సిటీలో బోధన



లాహోర్, డిసెంబర్12 (జనంసాక్షి) : పాక్‌లో ఆసక్తికర పరిణామం వెలుగులోకి వచ్చింది. దేశ విభజన తరువాత తొలిసారిగా లాహోర్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో సంస్కృతం కోర్సును ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు మహాభారతం, భగవద్గీతలోని సంస్కృత శ్లోకాలను నేర్చుకుంటున్నారు. ఈ కోర్సును ఫోర్మన్ క్రిస్టియన్ కాలేజ్ ప్రొఫెసర్ షహీద్ రషీద్ ముందుండి నడిపిస్తున్నారు.మొదట్లో సంస్కృతంపై మూడు నెలల పాటు నిర్వహించిన వర్క్‌షాపునకు మంచి స్పందన రావడంతో పూర్తిస్థాయి యూనివర్సిటీ కోర్సును ప్రారంభించామని తెలిపారు. 2027 నుంచి ఏడాది కాల వ్యవధి గల పూర్తిస్థాయి కోర్సును కూడా అందించే యోచనలో ఉన్నామని అన్నారు. దక్షిణాసియా ఉమ్మడి సాహిత్య చరిత్ర తెలుసుకునే దిశగా ఇది కీలక ముందడుగు అని వ్యాఖ్యానించారు. సంస్కృతం అంటే ఏదో ఒక మతానికి సంబంధించినది కాదని, ఈ ప్రాంత ఉమ్మడి సాంస్కృతిక చరిత్ర అని అన్నారు. విద్యార్థులు తొలుత సంస్కృతం నేర్చుకోవడంలో కాస్త ఇబ్బంది పడ్డారని ప్రొఫెసర్ చెప్పారు. కానీ భాష వ్యాకరణం ఒకసారి అర్థమయ్యాక వారిలో మక్కువ పెరిగిందని అన్నారు. ఉర్దూ భాషపై సంస్కృతం ప్రభావాన్ని తెలుసుకుని విద్యార్థులు ఆశ్చర్యపోయారని చెప్పారు. 'మేము సంస్కృతం ఎందుకు నేర్చుకోకూడదు. ఈ ప్రాంతాన్ని అంతటినీ ఒక్కటి చేసిన భాష ఇది. సంస్కృత వ్యాకరణాన్ని మొట్టమొదటి సారిగా గ్రంథస్థం చేసిన పాణిని గాంధార రాజ్యంలో ఉండేవారు. ఆయన నివసించిన ప్రాంతం ప్రస్తుతం ఖైబర్ పాఖ్‌తున్‌ఖ్వా ప్రాంతంలో ఉందని చెప్పారు. సంస్కృత దస్త్రాలు అనేకం తమ వద్ద ఉన్నాయని యూనివర్సిటీలోని గుర్మానీ సెంటర్ డైరెక్టర్ డా. ఉస్మాన్ ఖాస్మీ తెలిపారు. కానీ అధ్యయనకర్తలు వాటిపై ఇప్పటివరకూ దృష్టిసారించలేదని అన్నారు. ఇకపై పరిస్థితి మారుతుందని, రాబోయే 10-15 ఏళ్లల్లో భగవద్గీత, మహాభారతాల్లో తర్ఫీదు పొందిన స్కాలర్స్ పాక్‌లో ఉంటారని కూడా చెప్పారు.

# భార్యాభర్తల మధ్య గొడవలు

**మామను కత్తితో పొడిచి చంపిన అల్లుడు**

పటాన్‌చెరు, డిసెంబర్12 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మామను అల్లుడు కత్తితో పొడిచి చంపడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి బీరంగూడ కమాన్ సమీపంలో నివాసముండే చంద్రయ్య (58)ను అల్లుడు రామకృష్ణ కత్తితో పొడిచి హతమార్చాడు. రామకృష్ణకు భార్యకు మధ్య మనస్పర్ధలు రావడంతో గత మూడు నెలలుగా భార్య తల్లి గారి ఇంటి వద్ద ఉంటున్నది. గురువారం సాయంత్రం చంద్రయ్య ఇంటికి రామకృష్ణ వచ్చి భార్యతో గొడవ పడుతుండగా చంద్రయ్య వారిని వారించాడు. ఆగ్రహానికి గురైన రామకృష్ణ అంతు చూస్తానని ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి చంద్రయ్యను పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# గోవిందరావు పేట సర్పంచ్‌గా శ్రీలత ఎన్నిక

**ఫలించని మంత్రి సీతక్క ప్రచారం**

ములుగు, డిసెంబర్12 (జనంసాక్షి) : ములుగు జిల్లా మేజర్ గ్రామపంచాయితీ గోవిందరావు పేట సర్పంచ్‌గా బిఆర్ఎస్ బలపర్చిన శ్రీలత ఎన్నికయ్యారు. గురువారం ఓట్ల లెక్కింపులో ఆమె విజేతగా నిలిచారు. సీతక్క ఐదు సార్లు ప్రచారం నిర్వహించినా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి అపజయమే ఎదురైంది. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన కాకులమర్రి శ్రీలత భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఏటూరు నాగారం సర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సతీమణి శ్రీలత పోటీచేశారు. ఆమె 3230 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొత్తం 8,333 ఓట్లు పోలవ్వగా బీఆర్ఎస్‌కు 5,520, కాంగ్రెస్ అభ్యర్థికి 2,330, బీజేపీ అభ్యర్థికి 64 ఓట్లు వచ్చాయి. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటింది. ములుగు జిల్లాలో అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన ఏటూరు నాగారం సర్పంచ్ స్థానాన్ని మంత్రి సీతక్క సవాల్‌గా స్వీకరించినప్పటికీ ఓటమి తప్పలేదు.



# విపత్తులపై అప్రమత్తతే జీవరక్షణ

నిర్మల్ బ్యూరో,డిసెంబర్12(జనం సాక్షి) : ప్రకృతి విపత్తులు,పరిశ్రమల్లో ప్రమాదాలు వంటి పరిస్థితులకు ఏ క్షణమైనా స్పందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కేంద్ర విపత్తు నిర్వహణ అధికారులు సూచించారు.విపత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర అధికారులు మాట్లాడుతూ, వర్షాలు, వరదలు,అగ్ని ప్రమాదాలు,భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణనష్టం తగ్గించేందుకు విపత్తు దళాలు అత్యంత వేగంగా చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు.శిక్షణ కేంద్రాల్లో నిరంతరం పాల్గొని ప్రతిసమస్యను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

# గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డేకు భారీ స్పందన


- వేలసంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు
- సక్తికరంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ అంశం పై సదస్సు



హైదరాబాద్, డిసెంబర్12 (జనంసాక్షి) : ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు మూడవ రోజు శుక్రవారం నాడు వేలాది మందితో కిటకిటలాడింది. 'రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్' అనే అంశంపై ప్రారంభమైన సెషన్‌కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ యొక్క ప్రాముఖ్యత,వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, ఎఐ, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్-మైండ్‌సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో జి. సత్యనారాయణ, మాజీ చైర్మన్, మాజీ ఐఏఎస్, జితేంద్ర పుచ్చ, చీఫ్ డెలివరీ ఆఫీసర్, మాస్టెక్ డిజిటల్, శ్రీనివాస్ అత్రేయ, అవికా, కిషోర్ ఉప్పలపాటి,తదితరులు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ముఖ్యంగా ఆకర్షణీయమైన అంశం విద్యార్థుల అద్భుతమైన పాల్గొనడం. వేలాది మంది మధ్య జరిగిన ఈ చర్చలో విద్యార్థులు ఎంతో చురుకుగా ప్రశ్నలు అడిగారు, ప్యానెల్‌తో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్,,కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు చివరి రోజైన శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు అగ్రికల్చర్, రురల్ ట్రాన్స్ఫర్మేషన్ , ఫార్మర్స్ రైసింగ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. ఈ రోజు కార్యక్రమానికి దాదాపు ఆరువేలు పైగా హాజరు కాగా వీరిలో ఐదు వేళా మంది విద్యార్థులు,1000 ప్రజలు పాల్గొన్నారు. కారణంగా, ఈ ప్యానెల్ చర్చ మొత్తం సమ్మిట్‌లో అత్యుత్తమమైన, అత్యంత ఇంటరాక్టివ్ మరియు విద్యార్థులకు ఎంతో ప్రేరణ నిచ్చిన సెషన్‌గా నిలిచింది.

# ట్యూషన్ టీచర్ దాష్టీకం

**విద్యార్థికి అట్లకాడతో వాతలు**



హైదరాబాద్, డిసెంబర్12 (జనంసాక్షి) : ఓ చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకానికి పాల్పడింది. సరిగా చదవడం లేదన్న కారణంగా అట్లకాడతో వాతలు పెట్టడంతో చిన్నారికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేటలోని ఓయూ కాలనీకి చెందిన ఏడేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు గురువారం సాయంత్రం స్థానికంగా ఉన్న మానస అనే టీచర్ వద్దకు ట్యూషన్‌కు పంపించారు. అక్కడ సరిగా చదవడం లేదనే కారణంతో టీచర్ మానస ఆ బాలుడి చేతులు, కాళ్లు, ముఖంపై అట్లకాడతో వాతలు పెట్టింది. చిన్నారి శరీరంపై 8 చోట్ల కాలిన గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడిని వైద్య పరీక్షల కోసం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. గాయాల వల్ల బాలుడు నడవలేకపోతున్నాడు. తమ కుమారుడిపై దాష్టీకానికి పాల్పడిన మానసపై కఠిన చర్యలు తీసుకోవాలని అతడి తల్లిదండ్రులు కోరారు.


# హైదరాబాద్‌లో అఖిలేశ యాదవ్

**సిఎం రేవంత్, కెటిఆర్‌లతో వేర్వేరుగా భేటీ**



హైదరాబాద్, డిసెంబర్12 (జనంసాక్షి) : నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్ భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పర్యటిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నేతలను కలుస్తూ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన అఖిలేశ్.. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కాసేపటికి నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి అఖిలేశ్ యాదవ్ చేరుకోగా బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావుతో భేటీ అయ్యారు. తెలంగాణ తాజా రాజకీయ అంశాలపై నేతలంతా చర్చించారు. అనంతరం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు చేరుకున్న అఖిలేశ్.. యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు. సదర్ సమ్మేళనానికి గొప్పగా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూపీలో బీజేపీని వెనక్కి నెడుతున్నామని.. ఏపీ సపోర్ట్ లేకపోతే కేంద్రంలో బీజేపీ వచ్చేది కాదని అఖిలేష్ యాదవ్ తెలిపారు.

# ఈశ్వరాచారి కుటుంబానికి 5లక్షలచెక్కు అందజేత



హైదరాబాద్, డిసెంబర్ 12 (జనంసాక్షి) : బిసి రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాత్కాలికంగా అవరోధాలు ఎదురైనా దీనిని అధిగమిస్తామన్న విశ్వాసం ఉందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం.. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. జగద్గిరిగుట్టలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా.వినయ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి తదితరులు పరామర్శించారు. ఈశ్వర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మహేష్ గౌడ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

# అమెరికాతో భారత్ రక్షణ ఒప్పందాలు

## వ్యూహాత్మక తప్పిదం

భారత్–అమెరికా సంబంధాల దిశ , దాని స్వభావం గురించి సుదీర్ఘ చర్చ జరుగుతూనే ఉంది. ఒక వైపు దీనిని రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సహజమైన, వ్యూహాత్మకమైన రక్షణ ఒప్పందాలుగా చిత్రిస్తుంటే, మరో వైపు భారతదేశ సార్వభౌమాధికారానికి, స్వతంత్ర విదేశాంగ విధానానికి పెద్ద ఎత్తున నష్టం జరిగింది అన్న అభిప్రాయాలు, సందేహాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవలి అమెరికన్ జాతీయ భద్రతా వ్యూహ పత్రం (ఎన్.ఎస్.ఎస్. 2025 – నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ), మోదీ ప్రభుత్వం ఈ సంబంధాన్ని ప్రచారం చేసిన విధానానికి విరుద్ధంగా కొన్ని వాస్తవాలను స్పష్టం చేసింది. ఈ క్రింది విశ్లేషణ ఆ వ్యూహ పత్రం మరియు దాని నేపథ్యాన్ని పరిశీలిస్తుంది.



**వ్యూహాత్మక స్వాతంత్ర్యం: త్యాగమే? లాభమే?**

2014 తర్వాత భారత–అమెరికా సంబంధాలను 'విప్లవాత్మక' పరివర్తనగా ప్రదర్శించారు. జి.ఎస్.ఓ.ఎం.ఐ.ఏ. (జనరల్ సెక్యూరిటీ ఆఫ్ మిలిటరీ ఇన్ఫర్మేషన్ అగ్రిమెంట్), ఎల్.ఇ.ఎం.ఓ.ఏ. (లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్), సి.ఓ.ఎం.సి.ఏ.ఎస్.ఏ. (కమ్యూనికేషన్స్ కంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్), బి.ఇ.సి.ఏ. (బేసిక్ ఎక్ఛేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్) వంటి ఒప్పందాలు దీనికి ఆధారం. ఈ ఒప్పందాలు, ముఖ్యంగా రక్షణ రంగంలో, భారత దేశం సామర్థ్యాన్ని పెంచేవిగా పెద్ద ఎత్తున మన ప్రభుత్వం ప్రచారం చేసింది. అయితే, ఎన్.ఎస్.ఎస్. 2025 పత్రం ఈ సంబంధాల యొక్క మరో ముఖాన్ని (మేకప్ లేని అసలు రంగును బహిర్గతం చేసింది.)ఇది అమెరికా మిత్రరాజ్యాలను వారి రక్షణ ఖర్చును గణనీయంగా పెంచుకోవడానికి, అమెరికన్ ఆయుధ వ్యవస్థలనుండి కొనుగోలు చేయడానికి ప్రోత్సహించే విధానాన్ని స్పష్టంగా పేర్కొంటుంది. దీని సారాంశం ఏమిటంటే, ఇది అమెరికా యొక్క ఆయుధ పరిశ్రమ, వ్యూహాత్మక ప్రాబల్యానికి ఒక మార్కెట్ ను సృష్టించే ప్రయత్నం. భారతదేశం ఈ విధానంలో ఒక కీలకమైన, ఒక ఉపకరణ మైన పాత్రను పోషిస్తున్నదా అనే ముఖ్యమైన ప్రశ్నలు , సందేహాలు ఇక్కడ తలెత్తాయి. విదేశాంగ విధానంలో 'మల్టీ–ఎలైన్మెంట్' కు ప్రాధాన్యతనిచ్చిన భారత్, ఒకే దేశం (అమెరికా) పై అధికంగా ఆధారపడే విధానానికి మారుతుందా అన్న భయాన్ని ఇది కలిగిస్తుంది.

**ఆర్థిక వాస్తవాలు: చైనా అనుభవాన్ని పునరావృతం చేయగలమా?**

మోదీ ప్రభుత్వ సమర్థనలలో ఒకటి ఏమిటంటే, అమెరికా తన సరఫరా గొలుసులను చైనా నుండి మళ్లించడం (డీ–రిస్కింగ్ – ప్రమాదం తగ్గించడం) వలన భారతదేశానికి విపరీతమైన పెట్టుబడి,అధిక సంఖ్యలో ఉద్యోగాల అవకాశాలు లభిస్తాయని. కానీ ఎన్.ఎస్.ఎస్. 2025 పత్రం 'రీ–షేరింగ్' (దేశంలోనే తిరిగి ఉత్పత్తి) మరియు 'ఫ్రెండ్–ప్రొడెక్షన్' (మిత్ర దేశాలలో ఉత్పత్తి) పై దృష్టి సారించినా, దాని అంతర్గత లక్ష్యం అమెరికన్ ఆర్థిక భద్రత, ఆయుధాల ఉత్పత్తి స్వయం సమృద్ధి. ఇది 1990లలో చైనాకు లభించిన ఈ విధమైన సాంకేతిక బదలాయింపు లేదా మార్కెట్ యాక్సెస్ హామీని మాత్రం కలిగి ఉండదు. పైగా, భారతదేశం యొక్క స్వంత అవరోధాలు సంక్లిష్టమైన నియంత్రణలు, మౌలిక సదుపాయాల లోటు పాట్లు. అధిక వేగంతో పాలనా సంస్కరణలు, అమెరికన్ కంపెనీలకు ఇక్కడ పెట్టుబడి పెట్టడాన్ని ఇంకా కష్టతరం చేస్తున్నాయి. కాబట్టి, ఈ వ్యూహం నుండి ఆర్థిక ప్రయోజనాలు స్వయంచాలకంగా రాబడతాయనే భావన ఒక వరవడి కావచ్చు.

**చైనా సమీకరణ: వివేకం లేక విలువ?**

ఈ గత ఏడాదిలో, చైనాతో భారతదేశ సంబంధాలు గణనీయంగా సంక్లిష్టమయ్యాయి. సరిహద్దు వివాదాలు, ఆర్థిక అసమతుల్యతలు ఇందుకు కారణం. అయితే, అమెరికా యొక్క చైనా–వ్యతిరేక వ్యూహంతో పూర్తిగా ఏకీభవించడం భారతదేశానికి రెండు రకాల ధోరణులను కలిగించింది. మొదటిది, చైనా భారతదేశం యొక్క అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఈ సంబంధాన్ని నిర్వహించకుండా వదిలిపెట్టడం లేదా మరింత దెబ్బతీయడం, ఆర్థికంగా భారీ ధరకు దారి తీస్తుంది. ఆర్.సి.ఇ.పి. (రీజియనల్ కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్ట్నర్షిప్) నుండి వైదొలగడం అనేది, భవిష్యత్ ఆసియా–పసిఫిక్ ఆర్థిక వ్యవస్థలో భారత్ యొక్క భాగస్వామ్యాన్ని తీవ్రంగా పరిమితం చేసే నిర్ణయంగా చరిత్ర గుర్తిస్తుంది. రెండవది, క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్) వంటి వేదికలు, అమెరికా కోరిక ప్రకారం పూర్తిగా సైనిక రక్షణ సంఘాలుగా మారిపోతే, భారతదేశం ఈశాన్య, దక్షిణ ఆసియాలో తన స్వంత ప్రాంతీయ డిప్లొమసీ మరియు సంబంధాలను నిర్వహించే సామర్థ్యాన్ని కోల్పోవచ్చు. చైనాతో సంభాషణ మార్గాలను సంరక్షించుకోవడం వ్యూహాత్మక జ్ఞానం కాదా?

**ఆంతరిక ప్రభావాలు – రక్షణ ఖర్చు వర్సెస్ అభివృద్ధి ఖర్చులు:**

ఎన్.ఎస్.ఎస్. 2025 వలె, అమెరికా యొక్క వ్యూహ పత్రం మిత్రరాజ్యాలను వారి రక్షణ బడ్జెట్లను పెంచుకోవాలని పిలుపునిస్తే, దాని ప్రత్యక్ష ప్రభావం భారతదేశం యొక్క ఆర్థిక ప్రాధాన్యతలపై పడుతుంది. దేశం ఇప్పటికే ప్రపంచంలోని అగ్ర రక్షణ ఖర్చు దేశాలలో ఒకటిగా ఉంది. రక్షణ సామర్థ్యాలను ఆధునీకరించడం అవసరమైనప్పటికీ, సైనిక ఒప్పందాల క్రింద విపరీతమైన ఆయుధ కొనుగోళ్లు, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, సామాజిక రంగాల వంటి కీలక అభివృద్ధి ప్రాధాన్యతలకు ప్రత్యక్ష సవాళ్ళను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక దేశం యొక్క నిజమైన రక్షణ భద్రత దాని పౌరుల ఆరోగ్యం, విద్య, ఆర్థిక సుస్థిరతపై కూడా ఆధారపడి ఉంటుందనే సత్యాన్ని ఈ ప్రక్రియలో కనపడకుండా పోవచ్చు.

**సమతుల్య దృక్పథం అవసరం:**

మోదీ ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను మెరుగుపరచడంలో నిస్సందేహంగా విజయాలు సాధించింది. ముఖ్యంగా సాంకేతిక ,రక్షణ రంగాలలో. అయితే, ఎన్.ఎస్.ఎస్. 2025 వంటి పత్రాలు ఈ భాగస్వామ్యం యొక్క మరో ముఖాన్ని మన ముందు ఉంచాయి. ఇది ఒక సమతుల్య, స్వతంత్ర విదేశాంగ విధానం యొక్క అవసరాన్ని హైలైట్ చేస్తుంది. భారతదేశం యొక్క వ్యూహాత్మక ఎంపికలు దేశం యొక్క దీర్ఘకాలిక ప్రయోజనాలచే నడపబడాలి, ఏదైనా ఒక బాహ్య శక్తి యొక్క ప్రాధాన్యత లచే మాత్రం కాదు. అమెరికాతో రక్షణ సహకారం ప్రాధాన్యత కలిగి ఉండాలి. కానీ, అదే సమయంలో రష్యా, యూరప్, మధ్యప్రాచ్యం మరియు ఇతర ప్రాంతీయ ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలను నిర్లక్ష్యం చేయకూడదు. చైనాతో ఉన్న సవాళ్లను నిర్వహించడంలో వివేకాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో ఆర్థిక అవసరాల కోసం సంభాషణ మార్గాలను తెరిచి ఉంచుకోవడం అత్యవసరం. అమెరికాతో భాగస్వామ్యం ఒక 'వ్యూహాత్మక ఎత్తుగడ'గా ఉండిలే కానీ, దేశం యొక్క 'వ్యూహాత్మక స్వాతంత్ర్యానికి' భంగం కలిగించే 'వ్యూహాత్మకం దేశానికి ఆర్థిక బరువు'గా మారకూడదు. భారతదేశ విదేశాంగ విధానం యొక్క అంతిమ లక్ష్యం దేశ ప్రయోజనాల సమగ్ర రక్షణ మాత్రమే కాకుండా, ఒక బహుముఖ ప్రపంచంలో సార్వభౌమత్వ దేశంగా ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కాపాడుకోవడం కూడా అత్యవసరం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## జీవవైవిధ్యంపై పర్యావరణ ప్రభావం

# మానవ జీవనం!



జీవవైవిధ్యం పెంపొందించడంలో పర్యావరణం ప్రభావం నాగరికత ఆరంభ దశల నుంచి నేటి ఆధునిక కాలం వరకు గణనీయంగా మారుతూ వచ్చింది. మానవ జీవనం ప్రకృతితో నేరుగా అనుసంధానమై ఉన్న ప్రాచీన యుగాలలో జీవవైవిధ్యం అత్యంత విస్తృతంగా ఉండేది. వేట–సేకరణ దశలో క్రీస్తుపూర్వం 10,000 సంవత్సరాల ముందు వరకు భూభాగంలో సహజ అరణ్యాలు సుమారు 60–65 శాతం విస్తీర్ణాన్ని ఆక్రమించాయి అని పర్యావరణ చరిత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆ కాలంలో జంతు జాతుల నశనం శాతం 1 శాతం కన్నా తక్కువగా ఉండేది. మనిషి ప్రకృతిని వినియోగించుకున్నా దోపిడీ చేయలేదు కాబట్టి జీవవైవిధ్యం సహజంగా పెరుగుతూ సమతుల్యతను నిలుపుకుంది.

వ్యవసాయ నాగరికత ప్రారంభమైన క్రీస్తుపూర్వం 8000–3000 సంవత్సరాల మధ్య కాలంలో పర్యావరణంపై మానవ ప్రభావం కొంత పెరిగింది. అరణ్యాల తొలగింపు ప్రారంభమై ప్రపంచ అరణ్య విస్తీర్ణం 60 శాతం నుంచి 50–52 శాతానికి తగ్గింది. అయినప్పటికీ జీవవైవిధ్య నష్టం పరిమితంగానే ఉండి జాతుల నశనం సుమారు 2–3 శాతం స్థాయిలోనే నిలిచింది. నదీ లోయ నాగరికతలు ప్రకృతి వనరులను గౌరవంతో వినియోగించుకోవడం వల్ల పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతినలేదు. మధ్యయుగ కాలానికి వచ్చేసరికి క్రీస్తుశకం 500 నుంచి 1500 మధ్య జనాభా పెరుగుదల కారణంగా వ్యవసాయం విస్తరించింది. అరణ్యాల విస్తీర్ణం ప్రపంచ స్థాయిలో 45 శాతానికి తగ్గింది. ఈ దశలో జీవవైవిధ్య నష్టం 5 శాతం వరకు చేరింది. యూరప్ ఖండంలో అరణ్యాల నాశనం వేగంగా జరగగా ఆసియా ప్రాంతాలలో సహజ వ్యవస్థలు కొంతమేర నిలిచాయి. పర్యావరణ ప్రభావం ప్రాంతాలవారీగా భిన్నంగా ఉన్నా మొత్తం ప్రపంచంలో జీవవైవిధ్యంపై ఒత్తిడి పెరుగుతున్న దశ ఇదే.

ఆధునిక యుగానికి మార్గదర్శకమైన పరిశ్రమల విప్లవ కాలంలో అంటే క్రీస్తుశకం 1750 నుంచి 1900 మధ్య జీవవైవిధ్యంపై పర్యావరణ ప్రభావం తీవ్ర రూపం దాల్చింది. బొగ్గు ఆధారిత పరిశ్రమలు అరణ్యాల తొలగింపును వేగవంతం చేశాయి. ఈ కాలంలో ప్రపంచ అరణ్య విస్తీర్ణం 40 శాతం నుంచి 35 శాతానికి పడిపోయింది. జంతు జాతుల నశనం సుమారు 10 శాతం వరకు చేరింది. వాయు కాలుష్యం ప్రారంభమై జీవ వ్యవస్థలపై దీర్ఘకాలిక ప్రభావాలను కలిగించింది.

ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభం నుంచి 1950 వరకు పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. రవాణా విస్తరణ, నగరీకరణ, భారీ పరిశ్రమల స్థాపన వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింది. అరణ్య విస్తీర్ణం 30–32 శాతానికి తగ్గింది. జీవవైవిధ్య నష్టం సుమారు 15 శాతం వరకు నమోదైంది. అనేక పక్షి జాతులు అంతరించిపోవడం ప్రారంభమైంది.

1950 తరువాతి కాలాన్ని శాస్త్రవేత్తలు "గ్రేట్ యాక్సిలరేషన్" కాలంగా పేర్కొంటారు. ఈ దశలో జనాభా విపరీతంగా పెరిగింది. వ్యవసాయంలో రసాయనాల వినియోగం విస్తరించింది. 2000 నాటికి ప్రపంచ అరణ్య విస్తీర్ణం 28–29 శాతానికి పరిమితమైంది. జీవవైవిధ్య నష్టం సుమారు 30 శాతం వరకు చేరింది. తీపి నీటి జీవ జాతులు అత్యధికంగా ప్రభావితమయ్యాయి.

ఇరవై ఒకటవ శతాబ్దంలో వాతావరణ మార్పు ప్రధాన కారకంగా మారింది. 2020 నాటికి ప్రపంచవ్యాప్తంగా జాతుల అంతరించిపోవు ప్రమాదం 40 శాతం దాటింది అని ఐక్యరాజ్యసమితి నివేదికలు సూచిస్తున్నాయి. భూమిపై ఉష్ణోగ్రత సగటు పెరుగుదల 1.1 డిగ్రీల సెల్సియస్ స్థాయికి చేరడం వల్ల అనేక జీవ వ్యవస్థలు కూలిపోతున్నాయి. సముద్రాలలో కోరల్ రీఫ్ నష్టం సుమారు 50 శాతం వరకు నమోదైంది. అరణ్య విస్తీర్ణం ప్రస్తుతం 27 శాతం చుట్టూ ఉంది.

అయితే ఇటీవలి సంవత్సరాలలో పర్యావరణ చైతన్యం పెరగడం వల్ల కొంత ఆశాజనకమైన మార్పు కనిపిస్తోంది. 2010 తరువాత కొన్ని దేశాలలో అరణ్య పునరుద్ధరణ కార్యక్రమాల వల్ల అరణ్య విస్తీర్ణం 1–2 శాతం మేర పెరిగింది. జీవవైవిధ్య సంరక్షణ చర్యల వల్ల కొన్ని జాతుల పునరుజ్జీవనం 5 శాతం వరకు సాధ్యమైంది. ఇది మానవ చర్యలు సానుకూలంగా మారితే పర్యావరణం తిరిగి జీవవైవిధ్యాన్ని పెంపొందించగలదనే స్పష్టమైన సూచన. మొత్తంగా చూస్తే నాగరికత కాలం నాటి సహజ సహజీవనం నుంచి నేటి పారిశ్రామిక ఆధునిక సమాజం వరకు పర్యావరణ ప్రభావం జీవవైవిధ్యంపై తీవ్రతరం అయింది. సంవత్సరాలు గడిచేకొద్దీ నష్టం శాతం పెరిగినా ఇటీవలి కాలంలో అవగాహన పెరగడం వల్ల ఈ ధోరణిని మళ్లించగల అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో మానవ జీవనం ప్రకృతితో సమతుల్యత సాధించినపుడే జీవవైవిధ్యం నిలబడగలదనే సత్యం ఈ చారిత్రక విశ్లేషణ ద్వారా స్పష్టమవుతోంది.

ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే జీవవైవిధ్యం కేవలం ప్రకృతి సంపద మాత్రమే కాదు మానవ జీవనానికి ఆధారమైన మూలధనం. గత నాగరికతల అనుభవం ఒక విషయం స్పష్టంగా చెబుతోంది ప్రకృతితో సహజీవనం ఉన్నచోట జీవవైవిధ్యం వికసించింది దోపిడీ ఉన్నచోట అది నశించింది. శాస్త్రీయ పురోగతి మానవునికి అపార శక్తిని ఇచ్చింది కాని అదే శక్తి నియంత్రణలేకుండా వినియోగించబడితే భూమి భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. వాతావరణ మార్పు ప్రభావాలు జీవవ్యవస్థలపై చూపుతున్న తీవ్రత మనకు ఒక హెచ్చరికగా భావించాలి. జీవవైవిధ్య నష్టం అంటే కేవలం జంతు జాతుల అంతరించిపోవడం కాదు ఆహార భద్రత ఆరోగ్య భద్రత ఆర్థిక స్థిరత్వం అన్నింటిపైనా ప్రభావం చూపే సంక్షోభం. పర్యావరణ పరిరక్షణ చర్యలు ప్రభుత్వాల బాధ్యతగా మాత్రమే కాక ప్రతి పౌరుడి జీవన విధానంలో భాగంగా మారాలి. చిన్న స్థాయి చర్యలు కూడా సమష్టిగా పెద్ద మార్పుకు దారితీస్తాయి. అరణ్య సంరక్షణ నీటి వనరుల పరిరక్షణ సహజ వ్యవసాయం పర్యావరణ విద్య వంటి అంశాలు జీవవైవిధ్య పునరుద్ధరణకు కీలకం. భవిష్యత్ తరాలకు సురక్షితమైన భూమిని అందించాలంటే నేటి తరం తన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. ప్రకృతి మనపై ఆధారపడ లేదు మనమే ప్రకృతిపై ఆధారపడి ఉన్నామనే సత్యాన్ని అంగీకరించినపుడే జీవవైవిధ్యం నిలబడుతుంది. ఇదే స్థిరమైన అభివృద్ధికి సరైన దారి అవుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# సహజ తాత్వికుడు బి.ఎస్.

శతాధిక విభిన్న గ్రంథాలను రచించి స్వయంగా వెలువరించిన ఏకైక తెలంగాణ బహుజన ముద్దుబిడ్డ శ్రీ బి.ఎస్. రాములు. మూడు దశాబ్దాల పరిచయంలో నేను బి.ఎస్. గురించి ఓ పది పైసలంత అర్థం చేసుకుని ఉంటానేమో! ఆ మాత్రమైనా నేను అర్థం చేసుకున్నది దాంట్లో కొంత బి.ఎస్. విభేదించే అవకాశం కూడా లేకపోలేదు. బి.ఎస్. సహజ తత్వవేత్త అని నాకెందుకు అనిపించిందంటే తన ఒకే జీవిత కాలంలో ఆయన అనేక విభిన్నమైన జీవితాలు స్వయంగా గడపడమే గాక మరెందరి జీవితాల్లోని బాధలను కష్టాలను తనవిగా చేసుకొని తల్లడిల్లుతారు. లోతైన కళ్ళ వెనుకే ఆ వ్యథలను దాచుకుని అక్షరాల కన్నీళ్ళ జలపాతాలను ప్రవహింపచేస్తారు. ఆ అక్షరాల నీటిని దోసిళ్ళతో పట్టుకునే లోపే భారీ ప్రవాహాలు మనల్ని ముంచెత్తుతాయి. గ్రీకు తత్వవేత్తలతోబాటు మరెందరో ప్రాక్ పశ్చిమ దేశాల తత్త్వవేత్తల వాదాలు, భారతీయ వేదోపనిషత్తుల ఉపదేశాలు, చార్వాకుల, ఆదిశంకరాచార్యుల అస్పష్ట తార్కిక చర్చల పరిధులను దాటి జీవితానుభవాల లోతుల్లోంచి వెలువడ్డ సత్యాలనే పునాదిగా చేసుకుని అందరికీ అర్థమయ్యే భాషలో చేరుకోవలసిన గమ్యాలను, సాగిపోవలసిన గమనాలను, పదిలంగా దాచుకోవలసిన జ్ఞాపకాలను మనకందిస్తాడు బి.ఎస్.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అదే తత్వశాస్త్రంలో డిస్టింక్షన్ విద్యార్థినైన నాకు కూడా ఫిలాసఫర్ల కోటిక్స్ అర్థంకాని అనేక సంక్లిష్టతలను బిఎస్ సునాయాసంగా వివరిస్తాడు. జీవితం కన్న గొప్ప విశ్వవిద్యాలయం మరేదీ ఉండదని అధ్యయనానికి అనుభవాలకన్న గొప్ప గ్రంథాలు లేవని తన రచనల ద్వారా మనకు అర్థం చేయిస్తాడు.

రచయితల్లో తమకేది తోస్తే అది రాసేవారే ఎక్కువగా ఉంటారు. బి.ఎస్. ఆ గుంపులో లేడు. సమాజానికి ఏది ఎప్పుడు అవసరమో అదే రాస్తాడు. రాసిండు. అలాగే తన కేం చేయాలనిపిస్తే అది చేయడు. సమాజానికి ఎప్పుడు ఏది అత్యవసరమో అక్కడే అతనుంటాడు. నలుగురు కుమారులు దశాబ్దాల నుండి విదేశాల్లో ఉంటున్నా బి.ఎస్.కు ఆ దేశాలకు వెళ్ళి కొంతకాలం ఉండాలన్న కోరిక ఉండదు. విలువలతో కూడిన జీవితమంటే ఏమిటో బోధిస్తాడు. మనిషి ఎలా జీవించకూడదో చెప్తాడు. నిత్యం తన చుట్టూ ఉన్న సమాజం, దేశంలో ప్రపంచంలో జరిగే పరిణామాలు, ఉద్యమాలు లోతుగా పరిశీలించడం, వాటిపై వరుసగా వ్యాసాలు రాస్తూ తన అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకోవడం తెలంగాణలో శ్రామికుల ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే సూచనలు, అవసరమైన సందర్భంలో నిర్మాణాత్మక విమర్శలు చేయడం బి.ఎస్. నైజం.

చాలా సంవత్సరాల క్రితం నుండి పేరు వింటున్నా తొలిసారి బి.ఎస్.ను చూసింది ఆయన ప్రసంగాన్ని రాపోలు ఆనందభాస్కర్ 1996లో నిర్వహించిన తెలంగాణ ప్రగతి వేదిక సదస్సులోనే నా సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ మహాసభతొలి బులెటిన్లో బి.ఎస్. ప్రగతి వేదికలో చేసిన ప్రసంగాన్ని ప్రచురించాను. ఆనాటి సహచరులు రమణ (జర్నలిస్ట్), మాధవ కృష్ణారెడ్డి బి.ఎస్. ప్రసంగాన్ని టేప్ రికార్డర్ నుండి అక్షరీకరించారు. తెలంగాణలో బీసీ ఎస్సీ నాయకత్వం ఎదగాలని తీవ్ర కృషి చేశారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. భావజాల వ్యాప్తికి ఆచార్య జయశంకర్ వలె రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక తరఫున రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేశారు. 1996లో సికింద్రాబాద్ పద్మారావు నగర్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సదస్సులో పాల్గొన్నారు. ఆ రెండ్రోజుల సెమినార్ వ్యాసాలను నేను తెలంగాణ అనే పత్రికలలో ప్రత్యేక సంచికగా వెలువరించాను. అందులో బి.ఎస్. రాములు ఆనాడు మాట్లాడిన లక్ష్యాలు, తెలంగాణ భాష, సూటియైన, పదునైన పదజాలం ఆశ్చర్యం కలిగించింది. ఆనాటి నుండి మూడు దశాబ్దాలుగా మా స్నేహం కొనసాగుతున్నది. వందలా ది విషయాలమీద ఎప్పటికప్పుడు రాములన్నను సందేహం వచ్చినప్పుడల్లా అడుగుతుంటాను. తాను ఒక ఎన్సైక్లోపీడియా. అనేక విషయాలపట్ల స్పష్టత ఇచ్చి, నాతోపాటు ఎందరినో ముందుకు నడిపారు. సాహిత్యం, ఉద్యమం, తాత్వికత, బహుజన సిద్ధాంతాలు, బౌద్ధం, అంబేద్కరిజం, మానవతావాదం, భారత రాజ్యాంగం, విశిష్ఠత, తెలంగాణ పాఠ్యపుస్తకాల విశిష్ఠత మొదలైన ఎన్నో అంశాలపై అనేక సూచనలు చేస్తూ, తెలంగాణ వైతాళికులుగా, మార్గదర్శిగా నిలిచారు. ఇంకా నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు.

1997–2001 మధ్య కాలంలో వివిధ సంఘాలు తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన భావజాల వ్యాప్తి సభలలో అప్పుడప్పుడు బి.ఎస్. రాములు గారి ప్రసంగాలు వినే అవకాశం కలిగింది. ఆ సమయంలో ఆయన దళిత రచయితలు, కళాకారులు, మేధావుల (దరకమే) సంస్థ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండేవారు. తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్తో కలిసి కొంతమందిమి 2001లో ఏర్పాటు చేసిన తర్వాత తరచూ బి.ఎస్. కార్యక్రమాలలో పాల్గొనేవారు. అవకాశం వున్నప్పుడు కేసీఆర్తో వివిధ అంశాలపై చర్చించేవారు. 2004–06లలో తెలంగాణ కోసం కేసీఆర్, నరేంద్రలు కేంద్రమంత్రులుగా ఉండి చేసిన రాజకీయ లాబీయింగ్ ప్రక్రియ అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి కుతంత్రాల వలన ముందుకు సాగలేదు. వారిద్దరు మంత్రి పదవులకు రాజీనామా చేసి మరోసారిఉద్యమ నిర్మాణం పై దృష్టి పెట్టారు. తెలంగాణ సాధన కోసం ప్రజల్లో సెంటిమెంట్ను రగిలించాలంటే కొన్ని సాంస్కృతిక చిహ్నాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కేసీఆర్ సూచించారు. వీటిలో ముఖ్యమైనది బతుకమ్మ, తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన, అమరవీరుల స్థూపం.

అప్పటికే బి.ఎస్. రాములు తెలంగాణ తల్లికి ఒక రూపాన్నివ్వడానికి బీవీఆర్ చారి, ప్రొ. టి. గంగాధర్ (జె.ఎన్.టి.యు) లతో కలిసి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కిరీటం లేకుండా చేతుల్లో బతుకమ్మ, మక్క కంకులను పట్టుకున్న తెలంగాణ తల్లి రూపాన్ని 2007లో వార్త, ప్రజాతంత్ర దిన పత్రికల్లో ప్రచురించారు. బి.ఎస్. తెలంగాణ తల్లి తుది రూపాన్ని అందరికీ నచ్చే విధంగా ఎంతో పవిత్రతో కూడిన గౌరవ భావాన్ని స్ఫురించేలా రూపొందిస్తున్న క్రమంలోనే బి.ఎస్. కేసీఆర్ తో సుదీర్ఘంగా పలుమార్లు చర్చలు జరిపారు. బి.ఎస్. రాములు తెలంగాణ తల్లి విగ్రహం కోసం రూపొందిన పలు డిజైన్లను పరిశీలించిన తర్వాత మరిన్ని మెరుగులు దిద్దడానికి పలువురు రచయితలు, కవులు, కళాకారులను తెలంగాణ భవన్ కు ఆహ్వానించి పలుమార్లు చర్చించారు. అనేక సూచనలను స్వయంగా చేసారు. ఈ చర్చల్లో బి.ఎస్. తో పాటుగా తెలంగాణ అమరుల స్మృత చిహ్నమైన గన్పార్క్ స్థూపాన్ని నిర్మించిన ప్రముఖ శిల్పి ప్రొఫెసర్ ఎక్కా యాదగిరిరావు, ప్రముఖ తెలంగాణ చిత్రకారులు ఏలె లక్ష్మణ్, ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిస్ట్ సిద్దిపేటకు చెందిన కాపు రాజయ్య, ప్రొ. గంగాధర్, బీవీఆర్ చారి తదితరులు పాల్గొన్నారు. వారి సూచనలన్నీ బీ.ఎస్. ఒక క్రమపద్ధతిలో రాసి కేసీఆర్ తో చర్చించారు. కేసీఆర్ చేసిన సూచనమేరకు తెలంగాణ తల్లిని ఒక దేవతా స్వరూపంవలె తీర్చిదిద్దాలని, తలపై దేవతలు ధరించినట్లు బంగారు కిరీటం ఉండాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జరిగిన వాదోపవాదాల్లో "తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదని, అనేక సంపదలకు నెలవైన తెలంగాణ వనరుల దోపిడీ కారణంగా వెనక్కి నెట్టబడిందని కనుక, పేద తల్లిలా తెలంగాణ తల్లి ఉండరాద"ని కేసీఆర్ బి.ఎస్కు, ఇతరులకు నచ్చచెప్పారు. ఈ చర్చ తర్వాతే తెలంగాణ తల్లికి కోహినూర్ వజ్రం పొదిగిన కిరీటం, జాకోబ్ వజ్రంతో వున్న (ఈ రెండు వజ్రాలు తెలంగాణలోని గోల్కొండ గనుల్లో దొరికినవే) బంగారు వడ్డాణంలో పొందుపరిచారు. కొందరి సూచనల మేరకు పోచంపల్లి, గద్వాల పట్టు చీరలను పోలిన జరీ అంచు చేనేతచీర, బంగారు, వెండి ఆభరణాలతో తెలంగాణ తల్లికి తుది మెరుగులు దిద్దారు. బి.ఎస్. మరియు ఆయన సహచరులు.

ఈ తొలి విగ్రహాన్ని తెలంగాణ భవన్ కార్యాలయం ప్రధాన గేట్ (పశ్చిమ దిశలో) ప్రక్కన నవంబర్ 15, 2007న ప్రతిష్ఠించారు. ఉద్యమకారులతో కేసీఆర్ భారీ సభ నిర్వహించారు. "తెలంగాణ తల్లి రూపకల్పనలో బి.ఎస్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుంద"ని కేసీఆర్ ప్రశంసించారు. బి.ఎస్., కేసీఆర్ ఆశించినట్లే తెలంగాణ తల్లి విగ్రహాలు ఊరూరా స్థాపించబడి సెంటిమెంటును రగిలించాయి. ఈ విగ్రహాలను అధిక సంఖ్యలో రూపొందించిన శిల్పి పసునూరి దయాకర్ ఒక దళిత బిడ్డ. 2014లో జరిగిన ఉప ఎన్నికలలో దయాకర్ను లోక్సభ (హన్మకొండ) కు గెలిపించి గౌరవించారు కేసీఆర్. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అస్తిత్వాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా సాగుతున్న రేవంత్రెడ్డి పాలనలో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం ఒక విషాదం. ఇప్పుడు రేవంత్రెడ్డి నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహం కూడా బి. ఎస్. కిరీటం లేకుండా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే అని మరిచిపోరాదు. బీఎస్ తెలంగాణ ఉద్యమంలో అన్ని పార్టీలతో, సంఘాలతో కలిసి పనిచేసారు. 1969 మార్చి 28న తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీతో కలిసి అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కెసిఆర్ కలయిక, తెలంగాణ తల్లి రూపకల్పన, తెలంగాణ ఏర్పడేదాక ప్రతి నెలా ఒక పుస్తకం తెస్తానని ప్రకటించి 42 పుస్తకాలు వెలువరించారు. చలో డిలీ ప్రోగ్రాంను కొండా లక్ష్మణ్ బాపూజీ, గద్దర్, కెసిఆర్లకు సూచించి మార్గదర్శకం వహించారు.

భవిష్యత్ తెలంగాణ ఎలా వుండాలో అనేక వ్యాసాలు రాశారు. ప్రసంగాలు చేశారు. పేదలకు డబుల్ బెడ్ రూం, కెజి టు పీజి ఉచిత రెసిడెన్షియల్ విద్య ప్రతిపాదించారు. తెలంగాణ సంబురాలు జరపాలని ప్రతిపాదించిన వారిలో బి.ఎస్. రాములుగారు కూడా ఉన్నారు.


2009లో ఎం.ఎల్.సి. దిలీప్కుమార్, వి. ప్రకాష్, బెల్లయ్య నాయక్లు ఏర్పాటు చేసిన తెలంగాణ విమోచన సమితి (ఉద్యమ సంస్థ)లో గూడ అంజయ్య (ప్రముఖ తెలంగాణ కవి)తో కలిసి సంస్థ నిర్మాణంలో కూడా భాగమై ముఖ్యభూమిక నిర్వహించారు.

బి..ఎస్., గూడ అంజన్నతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో నేను పర్యటించిన జ్ఞాపకాలు ఇప్పటికీ నా మదిలో పదిలంగా ఉన్నాయి. సింగరేణి ఓపెన్కాస్ట్ గనులకు వ్యతిరేకంగా "ధర్తీ బచావో" ఉద్యమాన్ని తెలంగాణ విమోచన సమితి నిర్వహించింది. దీనిలో బి.ఎస్. చురుగ్గా పాల్గొన్నారు.

అవకాశం లభించినప్పుడల్లా బి.ఎస్. కేసీఆర్తో సమావేశమై తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులపై భవిష్యత్ తెలంగాణ ఎలా ఉండాలనే అంశాలపై చర్చిస్తూ పలు సూచనలు చేసేవారు. వయసులో తనకన్న పెద్ద అయిన బి.ఎస్.ను "అన్న" లా గౌరవించారు కేసీఆర్.

ప్రధానంగా బహుజనుల జీవితాలకు సంబంధించిన అనేక విషయాలపై వీరిద్దరు చర్చించేవారు. బి.ఎస్.కు అనేక అంశాలపై గల లోతైన అవగాహన, దూరదృష్టి కేసీఆర్ను ఆకర్షించాయి. తన వెంట పల్లెనిద్ర కార్యక్రమాల్లో బి.ఎస్.ను తీసుకుని గ్రామాల్లోని జీవన స్థితిగతులను అధ్యయనం చేసేవారు కేసీఆర్.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సి.ఎం. బాధ్యతలను చేపట్టిన కేసీఆర్ చట్టాన్ని సవరించి (ఒక హైకోర్టు రిటైర్డ్ జడ్జి స్థానంలో) బి.ఎస్.ను తొలి తెలంగాణ బీసీ కమీషన్ ఛైర్మన్ గా నియమించారు. వార్డెన్గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బి.ఎస్. బీసీ కమిషన్ తొలి ఛైర్మన్ గా నియమించబడడం ఆ హెరీదాకు, బీఎస్కు దక్కిన అరుదైన గౌరవం.



బి.ఎస్. అవిశ్రాంత కలం యోధుడు. తన జీవిత వత్రోత్సవానంతరం కూడా ప్రతినిత్యం సూర్యోదయంతో పోటీపడుతూ తెలంగాణ జీవితాల్లో వెలుగులను ప్రసరింపజేస్తూ మట్టి మనుషుల సౌభాగ్యానికి బాటలు వేస్తూ నిరంతరం ముందుకు సాగే తెలంగాణ బహుజన మార్గదర్శి మన బిఎస్. ఆయన జీవితం ధన్యం, సంపూర్ణ సార్థకం. కన్న తల్లిదండ్రులు చరితార్థులు.

బి.ఎస్. గురించి వ్యాసంలో ఏమి రాయాలన్నా నా వల్ల కావడం లేదు ఎందుకంటే బి.ఎస్. జీవిత ప్రస్థానం, రచనలు, అనుభవాలు, తాత్విక చింతన నాకు సైతం అందనంత ఎత్తులో నాకే పరిశోధన అంశాలుగా ఉన్నాయి. మనం పంచుకున్న ఆలోచనలు కలిసి పనిచేసిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. మీ తాత్విక కోణం చూస్తే "సహజ తత్వవేత్త" అని అనిపిస్తోంది. ఇజాల, భావజాలాల ఇరుకు చట్రంలో ఇమడలేని బి.ఎస్. జీవితం అనితర సాధ్యం అని అనిపిస్తున్నది. జీవితం అంటే ఏమిటి అనే మీ రచన చాలా గొప్పది. ఫ్రెంచ్ లో లేదా గ్రీకు భాషలో రాసి వుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొంది ఉండేది. మీరు ఏథెన్స్ నగరంలో జన్మించి ఉంటే మరో సోక్రటీస్ అయి ఉండే వారు. వలసాధిపత్యం క్రింద శతాబ్దాలుగా అణగదొక్కబడ్డ ప్రాంతపు నిరుపేద కుటుంబం లో పుట్టినందుకేమో మీ తాత్విక దృక్పథం ప్రపంచ వ్యాప్తం కాలేకపోయింది. బౌద్ధం, ఓషో, జిడ్డు కృష్ణమూర్తి వంటి వారి వలె మీకు మాత్రమే పరిమితమైన ఒక ప్రత్యేక తాత్విక భావన గురించి మాలాంటి వారికి అర్థం అయ్యేలా అనేక భాషల్లో తీసుకురావడం అవసరం. చాలామంది తత్వవేత్తలకు వున్నట్టుగా మీ తాత్విక దృక్పథాన్ని జనబాహుళ్యంలోకి తీసుకు వెళ్ళే శిష్య గణం మీకు ఉండాలి. మీకు ఉన్న జ్ఞానం సమయస్ఫూర్తి కంచ అయిలయ్యకు లేదు. కానీ బహుజన తత్వాన్ని కొంచం లోతుగా వివరించే ప్రయత్నం చేస్తాడు. ఎంతో సన్నిహితంగా మెలిగినా ఆకాశమంత విస్తృతి ఉన్న మీ గురించి నాకు ఎక్కువగా తెలియదని అర్థం అవుతున్నది మూడు దశాబ్దాల స్నేహం, పరస్పర భావ వినిమయంతో కలిసి ఉంటున్న, కలిసి జీవిస్తున్న, కలిసి సహజీవనం చేస్తున్న బి.ఎస్. రాములన్నకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ధన్యవాదాలు.

- వీరమల్ల ప్రకాశ్ రావు

# మున్నూరు కాపులను ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యం

- రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు పటేల్



**శామీర్‌పేట్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** కుల సంఘం బాధ్యతలు తీసుకోవాలంటే ఎంతో దైర్యం కావాలి అభిమానంతో సేవ చేసేవారికి పదవి ఇస్తే ఆ పదవికి వన్నె తెస్తారని పదవి అంటే హెూదా కాదు బాధ్యత అని రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, అఫెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్ అన్నారు.శుక్రవారం అలియాబాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం గౌరవ అధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, రాష్ట్ర అఫెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య పటేల్, బిజెపి జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ పటేల్ హాజరయ్యారు. మల్కా కొమురయ్య మాట్లాడు తూ.. మున్నూరుకాపు లందరూ ఏకాతాటిమీదకు వచ్చి అందరి ఆమోదం తో ఏకగ్రీవంగా అధ్యక్షుణ్ణి ఎన్నుకోవడం మున్నూరుకాపుల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ఇప్పుడు బిసి మూమెంట్ నడుస్తుంది అందరిని కలుపుకుని అవగాహనా కల్పిస్తూ రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలని అన్నారు. ఈ సందర్బంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షునిగా వేల్పుల శ్రీనివాస్ పటేల్ ను ప్రధాన కార్యదర్శి గా చాట్లపల్లి నర్సింగ్ రావును, ఉపాధ్యక్షులుగా పాదం వెంకటేశ్వర్లు పటేల్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ... నాపై నమ్మకంతో మేడ్చల్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కుల పెద్దలకు, సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.మామిండ్ల శ్రీనివాస్ పటేల్ ను వేదిక సాక్షిగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అదేవిదంగా రంగారెడ్డి జిల్లా ఎన్నికల ఇంచార్జిగా రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు బండి పద్మ పటేల్, కాంగ్రెస్ రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు తూము వినయ్ పటేల్, బిజెపి రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు దివాకర్ పటేల్, పోతం వెంకటేశ్వర్లు పటేల్, ఇంద్రజాలకుడు సామల వేణు పటేల్, పెద్దలు పర్వతం సతీష్ పటేల్, గౌనె శ్రీనివాస్ పటేల్, బుద్ది సత్తయ్య పటేల్, ముత్యాల రాజశేఖర్ పటేల్, ఆకుల సత్యనారాయణ పటేల్, బల్లెపుల చంద్రశేఖర్ పటేల్, ఆకుల సురేష్ పటేల్, ఇందూరి తిరుపతి పటేల్, కర్ర వెంకన్న పటేల్, యంజాల పద్మయ్య పటేల్, చాట్లపల్లి నర్సింగ్ రావు పటేల్, చిందం మహేందర్ పటేల్, తోట నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నగర్ పేరును యధావిధిగా కొనసాగించాలి



**మల్కాజిగిరి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** డివిజన్‌ల పునర్విభజనలో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ 137 డివిజన్ వినాయక నగర్ పేరును యధావిధిగా కొనసాగించాలని డివిజన్ కు చెందిన వివిధ పార్టీల నాయకులు సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసి డ్రాప్ బాక్స్ లో వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డివిజన్ పునర్విభజనలో భాగంగా సర్కిల్ లోనే అతిపెద్ద బస్తీగా ఉన్న వినాయక నగర్ తో పాటు కొన్ని కాలనీలను కలిపి సఫిల్ గూడ వార్డుగా ప్రకటించారు.వినాయక నగర్ బస్తి లేని ప్రాంతాన్ని వినాయక నగర్ వార్డుగా ఎలా ప్రకటిస్తారని మండిపడ్డారు.అధికారులు వెంటనే స్పందించి సఫిల్ గూడ పేరును తొలగించి అతిపెద్ద విస్తీర్ణం కలిగిన వినాయక నగర్ వార్డుగా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫరీద్, శేఖర్ గౌడ్, కృష్ణమూర్తి గౌడ్, అబ్దుల్ కరీం, సాంబరాజు, వెంకటేష్, స్వామి యాదవ్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే స్థితిలో లేరు

- మహేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ ముదిరాజ్



**మహేశ్వరం, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ ముదిరాజ్ అన్నారు.శుక్రవారం మహేశ్వరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్బంగా కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.మొదటి విడత సర్పంచ్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచులు అధిక సంఖ్యలో గెలిచారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్తనన్నారు.మహేశ్వరం గ్రామ ఓటర్లందరూ ఒక్కసారి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డు సభ్యుల అభ్యర్థులను అధిక మోజార్టీతో గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌కే పురం రైతు బజార్ లో మౌలిక వసతులు కల్పించాలని వినతి



**మల్కాజిగిరి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** నేరెడ్‌మెట్‌లోని రామకృష్ణాపురం రైతు బజార్ ను అభివృద్ధి చేసి వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని మాజీ కౌన్సిలర్ లు ఇందిరా చంద్రశేఖర్, ఎస్సార్ ప్రసాద్ శుక్రవారం బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి రైతు బజార్ లో వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రామకృష్ణాపురం రైతు బజార్ లో 50 కి పైగా షాపులు ఉన్నాయి అందులో ప్రస్తుతం 10 షాపులలో రైతులు కూరగాయలు అమ్ముతున్నారు, మౌలిక వసతులు, బస్సు సౌకర్యాలు లేక రైతులు వారి పండించిన కూరగాయలను రైతు బజార్ కు తీసుకురావడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు దీంతో గత పది సంవత్సరాలుగా రైతు బజార్ కు రైతులు రాకపోవడంతో మిగతా 40 కి పైగా షాపులు నిరుపయోగంగా పడి ఉన్నాయి, రైతు బజార్ లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి వినియోగదారులకు, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన వారు 15 రోజులలో సంబంధిత అధికారులతో కలిసి రైతు బజార్ ను సందర్శించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, ప్రవీణ్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

- బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లకు ఘనసన్మానం
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**తాండూరు, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులుగ్రామాల అబివృద్ధి లో కీలక పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు.మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన మరియు పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా పైలెట్ రోహిత్ రెడ్డి సర్పంచులుగా గెలుపొందిన వారందరికి శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు.

### మండలాల వారిగా కలిసిన సర్పంచుల వివరాలు....

బషీరాబాద్ మండలం పర్వతపల్లి, కుప్పనకోట్, కొర్విచేడ్, కొర్విచేడ్ గని, మల్కన్ గిరి, దామర్ చేడ్, కోత్లాపూర్, క్యాద్గిరా,



ఇందరచెడ్, గంగ్వార్, అల్లాపూర్, కమసానపల్లి(ఎం), నవల్గా, గొటిగాకలాన్, మంతటి, కుప్పనకోట్, నీళ్లపల్లి, జమ్లానాయక్ తాండా, నంద్యానాయక్ తాండా.

తాండూరు మండలం కోటబాసుపల్లి, మిట్టబాసుపల్లి, చింతామణిపట్నం, జిన్గుర్తి, కొత్లాపూర్, సంగెంకలాన్, సిరిగిరిపేట్, పర్వతాపూర్, బెల్కటూర్, అల్లాపూర్

**యాలాల...**

ఎన్కేపల్లి, పేర్కంపల్లి, దౌలాపూర్, రాఘవాపూర్, నాగసముందర్, దేవనూర్, గోరెపల్లి, పేర్కంపల్లి తాండా, ముకుందాపూర్.

**పెద్దేముల్.....**

రుక్మాపూర్, పాషాపూర్, ఊరెంటితాండా, ఎర్రగడ్డతాండా, బుద్ధారం, బాయిమీది తాండా, మంబాపూర్ సర్పంచ్ అభ్యర్థులు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అబివృద్ధి కి కృషి చేయాలని సూచించారు. గెలుపోందిన సర్పంచ్ అభ్యర్థులకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ముఖ్యంగా యాలాల మండలం దేవనూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి రెణుఖాదేవి కిషన్ రావును అబినందించారు.30 ఎల్ల కాంగ్రెస్ కంచుకోటలో బిఆర్ఎస్ అభ్యర్థి రెణుఖాదేవి గెలవడం గర్వకారణం అన్నారు. సర్పంచ్ ఎన్నికల స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తచాటాలని సూచించారు.

## వికలాంగులకు ఐబీఎం చేయూత

- హెలెన్ కెల్లర్స్ సంస్థలో ముగింపు వేడుకలు

**మల్కాజిగిరి, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నే రెడ్ మెట్ రామకృష్ణాపురం లోని హెలెన్ కెల్లర్స్ ఇన్స్ ట్యూషన్‌లో ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐబిఎం అసోసియేటెడ్ పార్ట్ నర్ అనిల్ శ్రీరామ్, ఐబీఎం ఇండియా అకౌంటెంట్ మేనేజర్ కృష్ణ వికాస్, హైదరాబాద్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ కబీర్, హెలెన్ కిల్లర్స్ ఇన్స్ ట్యూట్ ఫౌండర్ హటాన్ ఉమర్‌ఖాన్ హాజరై దివ్యాంగులైన విద్యార్థులకు వివిధ రకాల బహుమతులను, వారికి ఉపయోగకరమైన వస్తువులను అందజేశారు. ఐబీఎం సంస్థ విద్యార్థులకు హైజీన్ కిట్లు, పోషకాహారం మరియు వెచ్చని దుప్పట్లను అందజేశారు. అనిల్ శ్రీరామ్ మాట్లాడుతూ, 700 మంది వినికిడి లోపం ఉన్న పిల్లలకు మరియు 40 మంది మానసిక వికలాంగులకు విద్యను అందిస్తున్న హెలెన్ కిల్లర్ సేవలను అభినందించారు.



భవిష్యత్తులో కూడా సంస్థకు అవసరమైన సామాగ్రిని అందించడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ డా. మహమ్మద్ అబ్దుల్ కబీర్ మాట్లాడుతూ, వినికిడి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు అవసరమైన చికిత్సలు అందిస్తామని తెలిపారు.గత 40 ఏళ్లుగా సంస్థకు సేవలు అందిస్తున్న పటాన్ ఉమర్ ఖాన్ ను అతిథులు అభినందించారు. అనంతరం తమదైన శైలిలో ఆటపాటలలో సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు



**ఉప్పల్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గానికి మరో సారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి.అని మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని 10 డివిజన్లకు రూ.10 కోట్ల నిధులు వచ్చాయి.అని వాటికి సంబంధించిన పత్రాలు ప్రభుత్వం ద్వారా తీసుకున్నాం అని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్ బాబు కృషి ఫలితంగా , సూచనలతో ఏకకాలంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. సంతోషం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ను కలిసి రూ.10 కోట్ల నిధులకు ఆమోద ముద్ర వేయించారు.ఇందులో ముఖ్యంగా ఉప్పల్ సర్కిల్ లో చిలుకానగర్ డివిజన్‌లోని చిలుకానగర్ గుట్ట ప్రాంతంలో రూ.34.25 లక్షలతో వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం. కోసం అలాగే చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలో రూ.15.75 లక్షలతో రామాలయం కమ్యూనిటీహాల్ నిర్మాణం. చేపట్టడం కోసమని.చిలుకానగర్ డివిజన్ చిలుకానగర్ గుట్ట ప్రాంతంలో రూ.30 లక్షలతో కురుమ సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణం. హబ్సిగూడ డివిజన్‌లోని శ్రీనివాసపురంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. అలాగే హబ్సిగూడ డివిజన్‌లోని వెంకట్‌రెడ్డినగర్‌లో రూ.24.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం. రామంతాపూర్ డివిజన్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంతంలో రూ.60 లక్షలతో బాక్స్ డ్రైన్ నిర్మాణం.ఉప్పల్ డివిజన్‌లోని శేషసాయినగర్‌లో రూ.45 లక్షలతో అంతర్గగత రోడ్ల నిర్మాణం.కోసం అని ఈ విధంగా ఉప్పల్ డివిజన్ కి నిధుల వరద వచ్చిందని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ పరమేశ్వర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

## డివిజన్ల పునర్విభజనలో స్పష్టత లేదు

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** డివిజన్ల పునర్విభజన, మున్సిపాలిటీల విలీనము ప్రక్రియలో స్పష్టత లోపించిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శుక్రవారం జిహెచ్ఎంసి పరిధిలోని ఎనిమిది వార్డులు, మూడు మున్సిపాలిటీల విభజన సమస్యలపై బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ల విభజన, మున్సిపాలిటీల విలీనం తదితర అంశాలపై ప్రజలలో నెలకొన్న అనుమానాలను, డిమాండ్లను సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయవలసిన అవసరం ఉందని తెలిపారు. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ విధివిధానాలకు అనుగుణంగా జరగలేదని అభిప్రాయపడ్డారు. అవసరమైన డివిజన్ మ్యాపులు జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటివరకు అందించలేదన్నారు. డివిజన్ పరిధిని గుర్తించే ఇంటి నెంబర్లను సైతం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు.



ఈ సందర్భంగా టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కాలనీలా పేర్లు స్పష్టంగా లేకపోవడం వల్ల ప్రజలు తమ డివిజన్ సరిహద్దులను గుర్తించక పోతున్నారని తెలిపారు. డివిజన్ మ్యాపులు, కాలనీ జాబితాలు, ఇంటి నెంబర్ వివరాలు, పోలింగ్ బూత్ సమాచారం, ఎన్యుమరేషన్ బ్లాక్ డేటా తదితర అంశాలపై పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం మున్సిపాలిటీకి జీహెచ్ఎంసీలో తీవ్ర అన్యాయం

**కాప్రా, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** నాగారం మున్సిపాలిటీనీ రెండు డివిజన్‌లుగా విభజించాలని కోరుతూ నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యాంసుందర్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన ప్రక్రియ పూర్తిగా అసంబద్ధంగా, ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నాగారాన్ని ఒకే డివిజన్‌గా చేయడం చాలా దారుణమని మండిపడ్డారు. సుమారు 70,000 పైగా ఓట్లు ఉన్న నాగారం మున్సిపాలిటీని ఒకే డివిజన్‌గా చేయడం బాధాకరమైన నిర్ణయం అని పేర్కొన్నారు. నాగారం మున్సిపాలిటీకి ఆనుకుని ఉన్న గ్రామాలు పూర్తిగా గ్రామీణ వాతావరణంలో ఉండగా, అక్కడ సరైన డ్రైనేజీ, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏమాత్రం లేవని తెలిపారు.కావున నాగారం మున్సిపాలిటీని రెండు



డివిజన్లుగా విభజించి, రాంపల్లిని కేంద్రంగా తీసుకుని రాంపల్లి, కరీంగూడా, గోధుమకుంట, రాంపల్లి దాయారా, బోగారం గ్రామాలను కలుపుతూ ఒక డివిజన్‌గా చేస్తే పరిపాలన సౌలభ్యం కలుగుతుందని, ఆ గ్రామాల ప్రజలు రాంపల్లిని కేంద్రంగా చేసుకుని తమ కార్యకలాపాలు సులభంగా నిర్వహించగలరని తెలిపారు. ఈ ప్రాంతాన్ని రాంపల్లి డివిజన్‌గా నామకరణం చేయాలని, త్రేతాయుగంలో శ్రీరాములవారు ఈ ప్రాంతం మీదుగా కీసర గుట్టకు ప్రయాణించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని, అందుకే రాంపల్లి అనే పేరు చారిత్రకంగా కూడా ఎంతో ప్రముఖమైందని పేర్కొన్నారు. ఈ చారిత్రక పేరును కొనసాగించేందుకు కొత్త డివిజన్‌ను రాంపల్లి డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునిగంటి సురేష్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధవరం లక్ష్మి, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు రామారం బాలేష్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, మాజీ అధ్యక్షులు బుధవరం వేణుగోపాల్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కర్రా వెంకటేశ్వర్, కార్యవర్గ సభ్యులు తడిసినా సూర్యశేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్,ఏనుగు మహేందర్ రెడ్డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మకాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తప్పవు



**మోమిన్‌పేట, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని మోమిన్ పేట ఎక్సైజ్ సీఐ సహదేవుడు హెచ్చరించారు డిసెంబర్ 14న గ్రామపంచాయతీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని శుక్రవారం వైన్ షాపులను మూసివేసి సీట్ చేశారు ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ సహదేవుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని మద్యం అమ్మకాలను నిషేధించినందున మోమిన్ పేట సర్కిల్ పరిధిలో ప్రతి వైన్ షాపుకు సీట్ చేయడం జరిగిందని ఎక్కడైనా అమ్మకాలు జరిపినట్లు తమ దృష్టికి వస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల14న రెండో విడత ఎన్నికలు

- **జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** జిల్లాలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికలు మల్దకల్,అయిజ, రాజోలి, వడ్డేపల్లి మండలాల్లో ఈనెల 14న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. రెండో విడత ఎన్నికల నేపథ్యంలో 163 %దీచీూా% బి ఎన్ ఎస్ ఎస్ 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎన్నికల కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదనీ, పోలింగ్‌కు ముందు శుక్రవారం నుండి సాయంత్రం 5:00 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు, సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందనీ, ఈ సమయంలో ఎన్నికల సభలు,సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్ వినియోగం, ర్యాలీలు,బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం అని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల,ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో లేదా దానికి సంబంధించిన వీధుల్లో ఎలాంటి ప్రచారం, అడ్డంకులు, ఉద్రేకం లేదా ప్రలోభాలను సృష్టించకూడదనీ,పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల దూరం లోపల ఎలాంటి బూత్‌లను ఏర్పాటు చేయడానికి అనుమతి లేదనీ, అభ్యర్థికి లేదా వారి పక్షాన ఒక్క బూత్‌ను మాత్రమే 200 మీటర్ల పరిధికి వెలుపల ఏర్పాటు చేయాలనీ, ప్రతి బూత్‌కు ఒక టేబుల్, రెండు కుర్చీలు మాత్రమే అనుమతించబడతాయనీ, బూత్‌ను టెంట్లు లేదా ఇతర మార్గాల ద్వారా మూసివేయడానికి వీలులేదనీ, బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలనీ, స్థానిక అధికారుల నుండి లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా పొందాలనీ,ఓటు వేయడానికి బూత్ లోకి వచ్చే వారికి ఇచ్చే చీటీ లో వర్డ్ నెంబర్, ఓటరు క్రమ సంఖ్య ను రాసి ఇచ్చే చీటీలపై అభ్యర్థి పేరు లేదా గుర్తు లేదా రాజకీయ పార్టీ పేరు ఉండకూడదనీ, కేవలం తెల్ల కాగితంపై మాత్రమే రాసి ముద్రించాలనీ,పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో లేదా 100 మీటర్ల పరిధి లోపల ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్‌లు, వైర్‌లెస్ సెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడానికి లేదా తమ వద్ద ఉంచుకోవడానికి అనుమతి లేదనీ,ఎన్నికల భద్రత దృష్ట్యా,మద్యం దుకాణాలు డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం 05:00 గంటల నుండి 15వ తేదీ ఉదయం 10:00 వరకు పూర్తిగా మూసి ఉంచవలెనని, ఎవరైనా మద్యం అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా లేదా తమ వద్ద ఉంచుకున్నా, వారిపై కేసులు నమోదు చేయబడుతుందనీ, ఓటర్లు పోలింగ్ కేంద్రం లోపలికి గుర్తింపు కార్డ్ మాత్రమే అనుమతించబడుతుందనీ, పోలింగ్ కేంద్రంలోకి సిరా,వాటర్ బాటిళ్లు, కత్తులు లేదా భద్రతా సిబ్బంది అనుమానించే ఇతర ఎలాంటి వస్తువులను కూడా తమ వెంట తీసుకురావడానికి అనుమతి లేదనీ పోలింగ్ పూర్తయ్యే వరకు,పోలింగ్ కేంద్రాల పరిసరాలలో స్థానికేతరులు లేదా బయటి వ్యక్తులు ఎవరూ ఉండరాదనీ,ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే, ఎక్కడా గుమిగూడకుండా వెంటనే తమ నివాసాలకు తిరిగి వెళ్లాలని,పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి అనుమతి లేదనీ, నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా ర్యాలీలు నిర్వహించినట్లయితే, వారిపై ఎం సి సి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందనీ, ఎన్నికలు స్వచ్ఛంగా, ప్రశాంతంగా జరగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కోరారు.

## రెండో విడత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగం గా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రెండవ విడతలో ఎన్నికలు జరుగనున్న నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి సమక్షంలో నిర్వహించారు.ఎన్నికల సంఘం నిబంధన లను అనుసరిస్తూ నిర్వహిం చిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలిం చారు. ఒక్కో మండలం వారీ గా ఆయా గ్రామ పంచాయ తీల సర్పంచ్, వార్డు స్థానా లకు ఎన్నికల పోలింగ్ విధు లు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నుంచి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. రెండవ విడతలో 828 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 20 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమై జేషన్ జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి

- **గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ 2వ విడత ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు కొరకు మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ తో కలిసి రెండవ విడత పోలింగ్ సిబ్బందికి సంబంధించి మూడవ ర్యాండమైజేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని,ఈనెల 14వ తేదీన జిల్లాలోని ఐజ, మల్దకల్, వడ్డేపల్లి, రాజోలి (4) మండలాల్లో కలిపి మొత్తం 716 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఏకగ్రీవాల అనంతరం మిగిలిన 567 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. 2వ విడత ఎన్నికలలో 1,34,601 మంది ఓటర్ల తమ ఓటు హక్కు వినియోగించుకొనున్నారని, పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధుల నిర్వహణ విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది వివరాలను సంబంధిత మండలాల తహసీల్దార్ లకు వెంటనే అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, ఈ.డి.యం. శివ,ఎన్నికల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన ఎన్నికలే పోలీసుల లక్ష్యం

- **ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే పోలీసుల లక్ష్యం అని నారాయణపేట జిల్లా ఎస్పి. డాక్టర్ వినీత్ అన్నారు.ఎనికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో శుక్రవారం నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజాపూర్ గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కువినియోగించుకోవాలని అన్నారు.నిర్భయంగా ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం, ఓటు మన హక్కు అనే నినాదాలతో ఈ ఫ్లగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం




ప్రజలలో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూస్తే అసాంఘిక శక్తులకు, రౌడీషీటర్లకు బలమైన హెచ్చరిక పంపడమేనని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా సున్నితమైన అతి-సున్నితమైన గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పటిష్ట మైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు.ప్రజలకు కీలక సూచనలు చేస్తూ,ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఇతరులను భయపె ట్టేందుకు ప్రయత్నించినా, లేదా అనుమానాస్పద వ్యక్తు లు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచు తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడడంలో కేవలం పోలీ సుల పాత్రే కాక, ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని ఎస్పీ అన్నారు. పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, అండగా ఉంటుందని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయడానికి అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసు కుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐ లు రాముడు, వెంకటేశ్వర్లు, నరేష్, రాజు, శివ శంకర్ పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీనియస్ స్కూలుకు రాష్ట్రస్థాయి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు



**సదాశివపేట, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** బ్రెయిన్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ వారు శుక్రవారం నాడు హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహించిన ఎడ్యుకేషన్ మరియు ట్రైనింగ్ రిసోర్సెస్ అండ్ టెక్ ఎక్స్పో 2025 (ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసోర్స్ టెక్ ఎక్స్పో 2025) కార్యక్రమంలో బెస్ట్ అకాడమిక్ ఎక్సలెన్స్, బెస్ట్ ఎమర్జెంట్ స్కూల్ అండ్ బెస్ట్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ స్కూల్ గా 2025బి2026 విద్యా సంవత్సరానికి రాష్ట్రస్థాయి స్కూల్ ఎక్సలెన్స్ అవార్డును జీనియస్ స్కూల్ అఫ్ ఎక్సలెన్స్‌కు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని టాప్ 20 అత్యుత్తమ స్థాయి పాఠశాలలో జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ నిలబడి ఈ అవార్డును గెలుపొందింది. అవార్డును బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ బ్రహ్మం కాకాని నుండి జీనియస్ స్కూల్ కరస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రీతి అందుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**హన్వాడ, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మహబూబ్ నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ప్యాట అనంతరెడ్డి కి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాలలో అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, గ్రామాభివృద్ధి కేవలం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతుంది అని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతు పక్షాన నిలబడి రైతును నిలబెట్టిందని , మహిళలను కోటీశ్వరులు చేయాలన్న సంకల్పంతో పలు పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా విద్యా రంగం పటిష్టమవుతోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన ప్రయోజనాలను ఆయన ప్రజలకు తెలిపారు. వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీల్లో ఉచిత ప్రయాణాలు, ఇంటింటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మరియు వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఐఎన్టియుసి రాములు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, కొండారెడ్డి, గౌస్ మియా, జగన్ రెడ్డి, మున్నయ్య, కటికె బాలాజీ, కొండప్ప , కృష్ణ నాయక్, రాజేందర్, రామకృష్ణ రెడ్డి, కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలిదశ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** తొలిదశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు మద్దతు పలికారని, పెద్ద ఎత్తున పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించారని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అన్ని వర్గాల వారు కాంగ్రెస్ ను ఆదరించినట్లు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలనే ఆకాంక్షతో ప్రజలు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించినట్లు తెలిపారు. ప్రజలు మా పట్ల చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. రెండు అంతకంటే ఎక్కువ మా పార్టీ అభ్యర్థులు నిలబడడం వల్ల కొన్ని చోట్ల స్వల్పతేడాతో ఓడినట్లు తెలిపారు. కొన్ని లోటుపాట్లు జరిగాయని, రాబోయే రోజుల్లో వాటిని సరిచేసుకుంటామని అన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతామని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి గెలిచినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, రాజకీయాలు చూడకుండా అభివృద్ధి కోసం రెండో విడత ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు అధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, సీనియర్ నాయకులు చంద్రకుమార్ గౌడ్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్, నాయకులు బాలస్వామి, ప్రవీణ్ కుమార్, చందుయాదవ్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## పల్లెల్లో గెలుపే గెలుపే లక్ష్యంగా ప్రచార జోరు



**వెల్దుర్తి, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** వెల్దుర్తి మండలం హస్తాల్పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సెతేందర్ రెడ్డి ప్రచార హోరును జోరంంచాడు వాడ వాడల తిరుగుతూ తమ గుర్తు అయిన కత్తెరకు ఓటు వేసి భారీ మెజార్టీతో నన్ను గెలిపించాలని ఓటర్లను కొడుతున్నారు గ్రామంలో ఎక్కడ చూసిన సతేందర్ రెడ్డి గెలుపు కు బాటలు వేస్తున్నట్లు ప్రచార హోరు జరుగుతుంది గ్రామంలో సర్పంచ్ గా నన్ను గెలిపించినట్లయితే గ్రామ అభివృద్ధికి బాటలు వేసి జిల్లాలోని ఒక ఆదర్శ గ్రామంగా హస్తల్పూర్ గ్రామాన్ని నిలబెడతానని ఆయన తెలిపారు.

# ఎంజె4 కెనాల్ కోసం కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

- **హరిజనవాడ మీదుగా జమ్ముల తాండా రోడ్డు పూర్తి చేస్తా**
- **నియంతల పాలనకు ముగింపు పలకండి**
- **సవాయిగూడెం సర్పంచ్ అభ్యర్థి శ్రీలతను గెలిపించండి**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**

**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** ఎంజె4 కెనాల్ కోసం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, హరిజన వాడ మీదుగా జమ్ముల తాండా రోడ్డు పూర్తి చేస్తానని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం రెండవ విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సవాయి గూడెం, పెద్దగూడెం తాండా, పెద్దగూడెం, కడుకుంట్ల గ్రామాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సవాయి గూడెం గ్రామములో, నియంత పాలనకు చరమగీతం పాడాలని, రామాలయ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. రెండేళ్లుగా గ్రామములో ఎటువంటి అభివృద్ధి జాగలేదని,నాయకుల పెత్తనం కోసం గ్రామములో కలహాలు సృష్టించి, పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. శ్రీలతను గెలిపిస్తే గ్రామ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని అన్నారు.రేవంత్ రెడ్డి పాలనలో రైతాంగం ఎరువుల కోసం, రోడ్లు ఎక్కే పరిస్థితి వచ్చిందని సకాలం పంటలు చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయిరని అన్నారు. గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం చేసిందని, గ్రామాలు అభివృద్ధి పచ్చదనం పరిశుభ్రత ఉండాలంటే బి.ఆర్.ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.గ్రామాలలో ఓట్లు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను మహిళలకు 2500,వృద్ధులకు 4000,తులం బంగారం,కె.సి.ఆర్ కిట్టు, కంటివెలుగు, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్ గ్యాస్ సబ్సిడీ రైతులకు రైతు భరోసా రైతు రుణ మాఫీ రైతు బీమా,నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఏమైనాయని నిలదీయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల



అశోక్,కె.మాణిక్యం,వేణు రెడ్డి, విజయ్ కుమార్,ధర్మా నాయక్, గంధం.పరంజ్యోతి, శివన్న,చిట్యాల.రాము,మాజీ కౌన్సిలర్స్ బండారు కృష్ణ, ఉంగ్లం. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్.రహీమ్, డాక్టర్.డ్యానియల్, జోహెబ్ హుస్సేన్,మంద.రాము, తదితరులు పాల్గొన్నారు.



# నెన్నెలలో ఎద్దు హల్చల్

**బెల్లంపల్లి, డిసెంబర్ 12, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చి లేసిన ఎద్దు హల్చల్ చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కనబడ్డ వారిపై దాడికి ప్రయత్నించింది. రేషన్ షాపుకు బియ్యం కోసం వచ్చిన వ్యక్తి బైక్ ను కింద పడేసి ధ్వంసం చేసింది. వేరే గ్రామానికి చెందిన ఇద్దరు బైక్ పై వెళుతుండగా వారిపై దాడి చేయడంతో ఒకరి చేయి విరగగా, మరొకరి తీవ్ర గాయాలు అయ్యాయి. చివరకు గ్రామస్తులు అందరు కలిసి దానిని పట్టి బందించి తడి గుడ్డను ఎద్దుపై వేయడంతో ప్రాణాలు విడిచింది.

# బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆత్యాచార కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లింపు పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 12 (జనం సాక్షి) :** అత్యాచార కేసుల్లో బాధితులకు పరిహారాన్ని సకాలంలో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్ని అత్యాచార కేసులు నమోదయ్యాయి, ఛార్జీషీట్ చేయడానికి ఎన్నిరోజులు పడుతుంది, ఇప్పటి వరకు ఎన్ని కేసులు పెండింగ్ లో ఉన్నాయి, బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలను గురించి జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ప్రతి రెండు నెలలకోసారి కమిటీ సమావేశం కావాలని, ఆ సమావేశంలో చర్చించే అంశాలను ముందస్తుగా తెలియజేయాలన్నారు. అత్యాచార ఘటనలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ నిర్మల, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళా, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సీఎంవో సుదర్శన్ రెడ్డి,సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సంజీవ రావు, ఇంచార్జీ డిసీపివో ఎస్ ప్రవీణ్ కుమార్, ఈవో సింధురాణి, డివిఅక్ట్ కౌన్సిలర్ పావని, భరోసా ఎస్సై కే శ్రీలత, పీఎంహెచ్ఎన్ డాక్టర్ రూబీనా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందిర, శైలజ, మరియు మానస, స్వర్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు యుద్ధ ప్రతిపాదికన

# విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

- ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి మధుసూదన్
- మేడారం జాతర విద్యుత్ పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష



**ములుగు ప్రతినిధి- మేడారం, డిసెంబర్ 12(జనంసాక్షి) :** లక్షలాది భక్తులు తరలివచ్చే మేడారం కుంభమేళా జాతరకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి మధుసూదన్ స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు సర్కిల్ పరిధిలోని నార్లాపూర్ కొత్తగా నిర్మాణంలో ఉన్న 33/11 కెవి నార్లాపూర్ సబ్‌స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. అనంతరం డైరెక్టర్ ఆపరేషన్ టి మధుసూదన్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్ధేశం చేశారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యతలో ఎలాంటి రాజీపడవద్దని, భక్తులకు సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. లక్షలాది భక్తులు వచ్చే ఈ జాతరలో ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, జాతర విజయవంతం కావడానికి విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అందువల్ల ప్రతి పని నాణ్యతతో, సమయానికి పూర్తిగా సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఈ ఆపరేషన్ కెలోత్ రాజు చౌహన్, ములుగు ఎస్ఈ ఆనందం, డిఈ ఆపరేషన్ పి నాగేశ్వర రావు, డిఈ కన్స్ట్రక్షన్ సదానందం, పురుషోత్తం, ఏడీఈ లు వేణుగోపాల్, సందీప్ పాటిల్, రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శ హైస్కూల్‌కు అరుదైన గౌరవం

- అన్ని రంగాల్లో రాణిస్తున్న ఆదర్శ పాఠశాల
- తెలంగాణ టాప్-20 స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో స్థానం
- అవార్డు అందుకున్న కరస్పాండెంట్ కార్తీక్ రావు



**కాటారం డిసెంబర్ 12( జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ మరో అరుదైన ప్రతిష్టను సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో ఎంపికైన టాప్ 20 స్టేట్ బోర్డ్ స్కూల్స్ లో ఆదర్శ హై స్కూల్ స్థానం సాధించి స్కూల్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచింది. బెస్ట్ అకాడమిక్ ఎక్సలెన్స్ స్కూల్, ఎక్సలెన్స్ ఇన్ లైఫ్ స్కిల్ ఎడ్యుకేషన్, ఎక్సలెన్స్ ఇన్ ఇన్స్పిరేషనల్ లీడర్షిప్ వంటి మూడు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపినందుకు ఈ గుర్తింపు లభించింది. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈటి టెక్ ఎక్స్ కాన్ఫరెన్స్ లో ప్రముఖుల చేతుల మీదుగా ఆదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రావుమాట్లాడుతూగ్రామీణ ప్రాంతంలో చైర్మన్ జనగామ కరుణాకర్ రావు నాయకత్వంలో గత 36 ఏళ్లుగా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తు ఆధునిక బోధన విధానాలు, 21వ శతాబ్ద నైపుణ్యాలు, ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ పై దృష్టి పెట్టడం వల్ల ఈ గౌరవం లభించిందన్నారు. ఆదర్శ విద్యార్థులు దేశ, విదేశాల్లో అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండడమే దీనికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర స్థాయిలో టాప్ 20 స్కూల్స్‌లో ఆదర్శ హై స్కూల్ ఎంపిక కావడం ఈ ప్రాంతానికి గొప్ప గౌరవం అని తెలిపారు. ఈ విజయానికి తోడ్పడినఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులకు కార్తీక్ రావు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యతో ప్రతి విద్యార్థిని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దడం మా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఆదర్శ విద్య సంస్థకు లభించిన ఈ గౌరవంపై చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ప్రిన్సిపల్ జనగామ కృషిత, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో రెండవ విడతలో జరుగనున్న ఎన్నికల పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 12(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రెండవ విడతలో ఎన్నికలు జరుగనున్న ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నుండి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. రెండవ విడతలో 462 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగనుండగా, 20 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో విధులు నిర్వర్తించి వస్తూ మృతి చెందిన ఉపాధ్యాయునికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** మొదటి దశలో ఎన్నికల్లో విధులు నిర్వర్తించి, తిరిగి ఇంటికి చేరుకునే క్రమంలో గుండెపోటుతో మృతిచెందిన ఆదిలాబాద్ మండలం, ఖండాలకు చెందిన డి,శేషారావు ఎస్జీటీ ఎంపీపీస్ ఉపాధ్యాయునికి ప్రభుత్వం ఎక్సిగ్రేషన్ చెల్లించాలని పీ ఆర్ టి యు టీ ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణ కుమార్, నరసింహస్వామీ ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సర్పంచి ఎన్నికల్లో ఇప్పటి వరకు అసలుకే ఎన్నికల విధులు రాని వారికి మూడవ దశలో ఎన్నికల్లో విధులుకు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

## సారంగాపూర్‌లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా పరిశీలకురాలు



**సారంగాపూర్, డిసెంబర్12 (జనంసాక్షి) :** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సారంగాపూర్ మండలంలో జిల్లా పరిశీలకురాలు అయేషా అస్రత ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ధని , సారంగాపూర్ ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సులను పరిశీలించి, స్థానిక అధికారులకు పది సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి గంగాధర్, ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు, ఎంపీ ఓ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ జాం సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు

- స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్
- మహావీర్ పార్కింగ్ నుండి వెంగలాపూర్ వయా గోనెపల్లి, గోనెపల్లి నుండి కొండపర్తి
- కాల్వపల్లి నుండి కన్నెపల్లి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలన



**ములుగు ప్రతినిధి,డిసెంబర్ 12(జనంసాక్షి) :** మేడారం జాతర సమయంలో భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే నేపథ్యంలో, ఎలాంటి ట్రాఫిక్ జామ్ జరుగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇవాళ మేడారం మహావీర్ పార్కింగ్ నుండి గోనేపల్లి - వేంగలాపూర్ మార్గం, అలాగే గోనేపల్లి - కొండపర్తి మార్గం వరకు ట్రాఫిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలుగా ఉపయోగించే వీలును పరిశీలించారు. మహావీర్ పార్కింగ్ నుండి గోనేపల్లి - వెంగలాపూర్ రూట్ పై రహదారి వెడల్పు, మలుపులు, సేఫ్ జోన్‌లు, ట్రాఫిక్ డైవర్షన్‌కు అనుకూల ప్రాంతాలను పరిశీలించారు. అనుకూల పరిస్థితుల్లో గోనేపల్లి - కొండపర్తి రూట్ ను కూడా ఉపయోగించే అవకాశాన్ని పరిశీలించారు. రోడ్డులో ఉన్న చిన్న చిన్న అడ్డంకులు, చీకటి ప్రాంతాలు, ఎత్తు వంపులను వెంటనే తొలగించేందుకు సూచనలు చేశారు. మేడారం జాతర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భక్తుల రద్దీ అధికమయ్యే సమయాల్లో ఈ ప్రత్యామ్నాయ రూట్లను ఉపయోగించి ట్రాఫిక్‌ను సజావుగా నడపాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మార్గమధ్యంలో సైన్ బోర్డ్స్, రేడియం స్టిక్కర్స్, సిగ్నలింగ్ టీమ్స్, పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ములుగు సిఐ రవీందర్, పస్రా ఎస్ఐ దయాకర్ లు సిబ్బందిపాల్గొన్నారు.

# అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే అభివృద్ధి

- ఎమ్మెల్యే రేవూరితోనే పరకాల అభివృద్ధి
- పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్




**ఆత్మకూర్, డిసెంబర్ 12 (జనంసాక్షి):** గ్రామ పంచాయితీలు ఆదర్శంగా అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ సర్పంచులను గెలిపించుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్లో విలేకరుల సమావేశంలో యూత్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అధికార పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటేనే రాష్ట్ర నిధులు,ఎమ్మెల్యే కోట నిధులు పుష్కలంగా వస్తాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఏకకాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీ,ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు సన్న బియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొనియాడారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకువెళ్లి ఓట్లను అడగాలని పిలుపునిచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తోనే నియోజకవర్గంలోని గ్రామాలు ఆదర్శంగా అభివృద్ధి జరుగుతాయని అన్నారు.అలాగే చదువుకున్న యువతి యువకులకు ఉపాధి శిక్షణతో పాటు ఉద్యోగాలు కల్పించే విధంగా భరోసానిస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అని కొనియాడారు. బిఆర్ఎస్ గత పది సంవత్సరాల్లో జరిగిన దోపిడీని దౌర్జన్యాలను ప్రజలకు తెలియజేయాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు. బి ఆర్ ఎస్ అభ్యర్థులకు ఓట్లు వేస్తే బూడిదలో పోసిన పన్నీరుల మిగిలిపోతాయి అన్నారు.పరకాల నియోజకవర్గ ప్రజలు,యువకులు, మేధావులు,ఉద్యోగులు ఒకసారి ఆలోచించి అధికార పార్టీ కాంగ్రెస్ సర్పంచిని గెలిపించుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామాలు కళకళలాడుతాయన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తాం

- మాజీ ఎంపీ సీతారాం నాయక్



**కొత్తగూడ డిసెంబర్ 12 జనంసాక్షి:** గెలుపే లక్ష్యంగా ప్రతి బిజెపి కార్యకర్త పనిచేయాలని ఏజెన్సీ ప్రాంతమైన మహబుబాబాద్ జిల్లా కొత్తగూడ అభ్యర్థి గుగులోతు వినోద స్వామిగేలుపు కోసం మహబుబాబాద్ మాజీ ఎంపీ సితారాం నాయక్ మండల కేంద్రం లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.మండలం లో గతం కంటే బిజేపి పార్టీ గ్రామాల్లో విస్తరించిందని కేంద్రం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సన్న బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని గుర్తు చేశారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటికి రెండు సంవత్సరాల స్థానిక సంస్థల ఎన్నికలను కాలయాపన చేశారు.గ్రామాలు అభివృద్ధి చెందకుండా పోయాయని ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల సుమారు 900 కోట్లు నష్టం తెలంగాణ కు జరిగిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పలు వామిలు చేసిందిని ఇప్పటి వరకు అమలు చేయలేదని అదేవిధంగా బిసి రిజర్వేషన్ కూడా పూర్తి చేయలేదని కేవలం కాలయాపన చేస్తుందని తెలిపారు.అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీ అధికారం కోస్తేనే జరుగుతుందని బిజెపి పార్టీ బలపరిచిన గుగులోత్ వినోద స్వామి అదేవిధంగా దుర్గారాం జంగావని గూడెం సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.కొత్తగూడలో బిజెపి గెలిచిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా నిధులు వచ్చే విధంగా చేస్తానని ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# రెండో విడత పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 12(జనంసాక్షి):** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతలోగీసుకొండ, సంగెం, నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లో డిసెంబర్ 14 ఆదివారం జరుగనున్న పోలింగ్ ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం గీసుకొండ మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అలాగే హరిత పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సత్యశారద పలు కీలక సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సిబ్బంది రాకపోకలు సజావుగా సాగడానికి అవసరమైన క్యూలైన్లు, సహాయ కేంద్రాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ పూర్తిగా సమయానుసారంగా, జాగ్రత్త చర్యల తో పాటు పోలింగ్ విధానం పారదర్శకంగా జరుగుటకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలానికి రెండు పోలింగ్ హరిత పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో భాగంగా గీసుకొండ మండలంలో హరిత పోలింగ్ కేంద్ర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరిశీలించిన హరిత పోలింగ్ స్టేషన్ వద్ద పర్యావరణహిత చర్యల అమలు, శుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళలు-వృద్ధులు-వికలాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. బూత్ సమీపంలో చెట్లు, మొక్కలు, గ్రీన్ థీమ్ అమలు ప్రసంసనీయమైనప్పటికీ, ఓటర్ల సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పోలింగ్ కౌంటింగ్ ఒకే రోజు నిర్వహించుటకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్, ఇంటర్నెట్, భద్రత వంటి అంశాలను ముందుగానే ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.ఈ సందర్శనలు వరంగల్ ఆర్డీవో సుమ జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, గీసుకొండ తహసిల్దార్ రియాజ్ ఉద్దీన్, గీసుకొండ ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు



# నూతన సర్పంచులకు సన్మానం

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్12 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి సర్పంచ్ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన మామడ, లక్ష్మణ్ చాందా మండలంలోని సర్పంచులను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు. మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే విజయం సాధించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల ప్రజాపాలన సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని అన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయాగ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి కొనసాగుతున్న పాత ఓటరు జాబితాను 2025 జాబితాకు అనుగుణంగా మ్యాపింగ్ చేయడంలో అత్యంత జాగ్రత్త అవసరమని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మేడ్చల్%–%మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ప్రధాన ఎన్నికల అధికారిని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ పూలమొక్కతో సన్మానించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ సిఈఓ హుస్సేన్, ఐటి శాఖ అధికారి చిరంజీవులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ు మేడ్చల్%–%మల్కాజిగిరి జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ కేవలం 15 శాతం మాత్రమే పూర్తయి, ఎంతో వెనుకబడి ఉంది. రాబోయే రెండు వారాల్లో కనీసం 30 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి అని ఈఆర్ఓ, ఎఆర్ఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి బిఎల్ఓకు రోజువారీ లక్ష్యాలు నిర్ధారించి ఇంటింటికీ వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయడంతోపాటు అవసరమైన చోట ఫోటోలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన నిష్పక్షపాతంగా జరగాలని, మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా వేగవంతం చేయాలని ఆయన అన్నారు. హౌస్ నంబర్, పేరు, ఎపిక్ నంబర్ ఆధారంగా వెబ్‌సైట్‌లో సెర్చ్ చేయగలిగే కొత్త సౌకర్యం అందుబాటులో ఉండటంతో మ్యాపింగ్ కొంత సులభతరమైందని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బంది, కంప్యూటర్ ఉపకరణాలు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గం నుంచి మ్యాపింగ్ పురోగతి, ఎదురవుతున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్న ప్రధాన ఎన్నికల అధికారి ు ఎటువంటి వివరణ, సలహా అవసరమైనా రాష్ట్ర ఎన్నికల శాఖ కార్యాలయం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది అని ఈఆర్‌ఓలకు భరోసా ఇచ్చారు.

# 14న టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ

● తప్పుడు ప్రచారాలు, అక్రమ వసూళ్లపై అడ్-హాక్ కమిటీ హెచ్చరిక
● మామిడి సోమయ్యకు సంఘంతో సంబంధం లేదనడం అవివేకం
● జర్నలిస్టుల హక్కులు, సంఘ బలోపేతంపై కీలక నిర్ణయాలు



ఖమ్మం, డిసెంబర్ 12 (జనం సాక్షి) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మహాసభ ఈ నెల 14న జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు అడ్‌హక్ కమిటీ కన్వీనర్ టి.ఎస్. చక్రవర్తి, కో-కన్వీనర్లు అర్వపల్లి నగేష్, నానబాల రామకృష్ణ, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్ లు తెలిపారు. ఈ మహాసభను ఫెడరేషన్ వ్యవస్థాపకులు మరియు రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, వారికి సంఘంతో సంబంధం లేదని ప్రచారం చేయడం అవివేకమని వారు స్పష్టం చేశారు. జిల్లా మహాసభల పేరుతో కొందరు వ్యక్తులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం లభించిందని, టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో జరిగే ఏ వసూళ్లనైనా కఠినంగా ఖండిస్తున్నామని కమిటీ సభ్యులు హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా కమిటీల కాలపరిమితి ముగిసినా పదవుల్లో కొనసాగుతూ తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిని జర్నలిస్టులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ పునర్వ్యవస్థీకరణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్, అక్రిడేషన్ కార్డులు, మహిళా జర్నలిస్టుల పరిరక్షణ-హక్కులు వంటి ముఖ్య అంశాలపై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.జే.ఎఫ్ నాయకులు వంగా పుంగమ గౌడ్, కప్పల మధు, అమరబోయిన ఉపేందర్, కందరబోయిన కృష్ణ, కాసోజు శ్రీధర్, షకీల్, నజీర్, స్వర్ణ, అఖిల్, ప్రణయ్, హేమంత్, కాశి, శశి, శివకుమార్, అర్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్




**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలను భాద్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ సూచించారు. 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు. కలెక్టరేట్ లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శుక్రవారం ర్యాండమైజేషన్ జరిపించారు. రెండవ విడత ఎన్నికలు జరిగే పెన్ పహాడ్, చివ్వెంల, మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో రెండవ విడతలో మొత్తం 181 గ్రామ పంచాయతీల సర్పంచ్ లకు, 1628 వార్డ్ సభ్యుల స్థానాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వగా 23 సర్పంచ్ లు, 166 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో మిగిలిన 158 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1462 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1901, ఓపీఓలు 2429 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సిఈఓ వివి అప్పారావు, డీపీఓ యాదగిరి, డిఎల్ పిఓ నారాయణ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన మరియానికేతన్ విద్యార్థులు



**చండూరు, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** చండూరు మండల కేంద్రంలోని మరియానికేతన్ విద్యార్థులు డిస్పాచ్(11) లెవెన్ క్రికెట్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినారు. ఈ సందర్భంగా మరియానికేతన్ సంస్థ అధినేత సిస్టర్ లూసి రోజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఇలాంటి ఆటల పోటీల్లో పాల్గొని మున్ముందు ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని... క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనీయమని క్రీడల వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ పద్మ లత, ప్రిన్సిపల్ సిస్టర్ కల్పన, సిస్టర్ తెరిస్సా సిస్టర్ సింధు, సిస్టర్ ఆరోగ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు పాలకూరి గణేష్, ఉపాధ్యాయులు బోడ లింగస్వామి, సిద్ది నాగరాజు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఎస్‌టిపి ప్లాంట్ ఏర్పాటు

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ప్రతిపాదించిన ఎస్టిపి ప్లాంటును ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నెంబర్ పరిధిలో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్దేశించిన స్థలాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో రూ.1100 కోట్ల అంచనా వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నంబర్ పరిధిలోని 10 ఎకరాలలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి గతంలో ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. ఇదే సర్వే నెంబర్‌లో 5 ఎకరాలు స్టేడియానికి, పది ఎకరాలు నవోదయ విద్యాలయానికి సైతం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎస్‌టిపి ప్లాంట్‌ను స్టేడియానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారని.. దీని మూలంగా స్థానిక కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు తనకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. స్టేడియానికి కేటాయించిన స్థలంలో కాకుండా కాలనీలకు దూరంగా కేటాయించిన పది ఎకరాలలోనే ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆయన ఆదేశించారు. నూతన టెక్నాలజీతో ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దుర్వాసన తలెత్తకుండా ప్లాంటు పనులు కొనసాగుతాయని తెలిపారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షమేనని.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, తహసీల్దార్ వెంకటేష్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, ఉపేందర్ రెడ్డి, గోపాల్, యూనుస్, రాములు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు



**అశ్వారావుపేట, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండటంతో శుక్రవారం రాష్ట్ర సరిహద్దు ప్రాంతం అశ్వారావుపేట సరిహద్దు చెక్ పోస్ట్ నందు పోలీసులు భారీగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అనుమానాస్పదంగా వెళ్లే వాహనాలను ఒక్కొక్కటిగా ఆపి ధృవీకరణ పత్రాలు, ప్రయాణ వివరాలు, సరుకు రవాణా వినియోగాలను పూర్తిగా పరిశీలించారు. ఈ తనిఖీలను అశ్వారావుపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ నాగరాజు రెడ్డి, స్వయంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడిన ఆయన, ఎన్నికల నియమావళి అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అనుమానాస్పద వస్తువులు, నగదు, మద్యం తరలింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రొఫెషనల్‌గా, మర్యాదపూర్వకంగా తనిఖీలు నిర్వహించాలని సిబ్బంది కి ఆదేశాలు ఇచ్చారు. అధికారులు ప్రతీ వాహనాన్ని క్రమబద్ధంగా చెక్ చేస్తూ ఆ ప్రాంతంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి చెకింగ్‌లు కొనసాగుతాయని సీఐ నాగరాజు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ అఖిల, ఎన్నికల అధికారి లక్ష్మయ్య, హెడ్ కానిస్టేబుల్ రమేష్, స్పెషల్ పార్టీ పోలీసులు వెంకట్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్




**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. వరదలు, పరిశ్రమ ప్రమాదాలు, ఇతర ప్రమాదాల నియంత్రణపై జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మేజర్ జనరల్ సుధీర్ బాహల్ (రిటైర్డ్) వీడియో సమావేశం ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు. వరదలు వచ్చినప్పుడు, పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై జిల్లాలలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని, దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో లిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూలి జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరదలు, పరిశ్రమ ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలో భారీ వరదల సమయంలో నీటి విడుదల కోసం పైనున్న ప్రాంతాలు, దిగువ ప్రాంతాలతో సమన్వయం చేసుకుంటూ ఉండాలని అన్నారు. విపత్తుల సమయంలో వెంటనే ఎన్.డి.ఆర్.ఏఫ్., ఆర్మీ, ఎస్.డి.ఆర్.ఎఫ్. వంటి ఏజెన్సీలకు సమాచారం వెళ్లేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం.యాదయ్య, అగ్నిమాపక శాఖ అధికారి కిషోర్, పశువంవర్ధక శాఖ అధికారి డా.మధు సూదన్ గౌడ్, డి.ఎస్.ఓ గంప శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు




**మేళ్లచెరువు, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** ఎన్నికల మూడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన సదస్సులో ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఈరోజు మండల కేంద్రంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపం నందు సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్, సర్పంచ్ మరియు వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏ పార్టీ, ఏ అభ్యర్థి అయినా చట్టాన్ని అతిక్రమించే చర్యలు చేస్తే పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

**ఎస్పీ వివరించిన ప్రధాన సూచనలు మరియు హెచ్చరికలు :**

డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే వెంటనే కేసులు నమోదవుతాయని తెలిపారు. రాత్రి వేళల్లో అనవసరంగా గుంపులు తిరగడం, క్యాంపులు ఏర్పాటు చేయడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం చేసినవారిపై బైండోవర్ చర్యలు, నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం, ప్రతిష్ట దెబ్బతీయే పోస్టులు చేస్తే కింద కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేస్తే తక్షణమే అరెస్టులు చేపట్టనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి నిర్బంధ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరుగేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, అభ్యర్థులు, కార్యకర్తలు చట్టాలను గౌరవించాలని, లేకపోతే చట్టం ముందు ఎవరైనా సమానమే అని ఎస్పీ స్పష్టం చేశారు. వారి వెంట డి ఎస్ పి శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రతాప్ లింగం, ఎస్సై పరమేష్, ఎమ్మార్వో మరియు ఎంపీడీవోలు పాల్గొనడం జరిగింది.

## భద్రాచలంలో కాంగ్రెస్ హవా..

● సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణ విజయం



**భద్రాచలం, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన పూనెం కృష్ణ కు, వార్డు సభ్యులకు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు, మాజీ శాసనసభ్యులు, ప్రస్తుత రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య లు శుభాకాంక్షలు తెలియజేశారు. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు హెూరాహెూరీగా ప్రచారాలు నిర్వహించి ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల పోరులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణ గెలుపొంది తన సత్తా చాటారు. 48 వేల ఓటర్లు కలిగిన భద్రాచలం పట్టణంలో సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన పూనం కృష్ణకు 8416 ఓట్లు రాగా 1400 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు, కాగా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి మానే రామకృష్ణకు 6732, తెలుగుదేశం, భాజపా, జనసేన బలపరిచిన అభ్యర్థి హరిచంద్ర నాయక్ కు 2,756, నోటా కు 334, చల్లని ఓట్లు 921 ఓట్లు వచ్చాయి. ఇది ఇలా ఉండగా గెలుపొందిన వార్డు సభ్యుల వివరాలు:- 1 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి చెంచు సుబ్బారావు 3 ఓట్లతో విజయం, 2వ వార్డు కాంగ్రెస్ బొంబోతుల రాజీవ్, 3వ వార్డు కాంగ్రెస్ బొంత రమణ, 4 వ వార్డు సిపిఎం, టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కూటమి అభ్యర్థి బండారు శరత్, 5వ వార్డు కాంగ్రెస్ నర్రా వాణి, 6వ వార్డు టీడీపీ అబ్బినేని వినీల రాణి, 7వ వార్డు టిఆర్ఎస్ కూటమి కావూరి గోపి, 8వ వార్డు కాంగ్రెస్ పెద్దినేని లక్ష్మీ, 9వ వార్డు కాంగ్రెస్ కారం సుజాత, 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ నిట్ట రాజు, 11 వ వార్డు కాంగ్రెస్ భూభుక్య సుశీల, 12 వ వార్డ్ కాంగ్రెస్, కారం దుర్గారావు, 13వ వార్డు కాంగ్రెస్ తాటి ఉదయ్, 14వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఇలమల అశోక్ కుమార్ హెూరా హెూరీగా సాగిన లెక్కింపులో విజయం, 15వ వార్డు కాంగ్రెస్ సున్నం ఈశ్వరి, 16వ వార్డు కాంగ్రెస్ రత్నం కవిత, 17వ వార్డు కాంగ్రెస్ సున్నం భూ లక్ష్మీ, 18వ వార్డు కాంగ్రెస్ జాగ్గా కుమారి ఒక్క ఓటుతో విజయం, 19వ వార్డ్ (సిపిఐ 647, టిఆర్ఎస్ 207) 440 ఓట్ల భారీ మెజారిటీతో సీపీఐ పార్టీ అభ్యర్థి మహేష్, 20వ వార్డు టిఆర్ఎస్ బలపరిచిన సిపిఎం అభ్యర్థి ఇరుప అనసూయా 3 ఓట్ల తేడాతో విజయం సాధించారు.




# సత్య నాదెళ్లకు అదో సరదా..



**న్యూఢిల్లీ:**ప్రపంచ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. భారతీయ-అమెరికన్ అయిన ఆయన మైక్రోసాఫ్ట్‌లో అంచెలంచెలుగా ఎదిగి ఆ సంస్థకు ఈసీవో అయ్యారు. అపారమైన తన శక్తి సామర్థ్యాలతో కంపెనీని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. ప్రతి మనిషికీ వృత్తితోపాటు ఓ వ్యాపకమూ ఉంటుంది. 'మడిసన్నాక కాసింత కళా పోషణ ఉండాల' అంటాడు ఓ సినిమాలో విలన్ రావు గోపాలరావు. కానీ ఈ దిగ్గజ టెక్ సీఈవోది 'క్రీడా పోషణ'. క్రీడాకారుడు కాకపోయినా క్రికెట్ ఆటను విశ్లేషించే మొబైల్ యాప్ ఒకదానిని సత్య నాదెళ్ల రూపొందించారు. అంతేకాదు.. కాస్త సమయం దొరికినప్పుడల్లా కోడ్ రాస్తుంటారాయన. అది ఆయనకో సరదా...ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల స్వయంగా వెల్లడించారు. బెంగుళూరులో జరిగిన మైక్రోసాఫ్ట్ ఈవెంట్ లో మాట్లాడుతూ.. థాంక్స్ గివింగ్ సందర్భంగా తాను చిన్నప్పటి నుండి ఇష్టపడే క్రీడ క్రికెట్ ను విశ్లేషించడానికి ఇంటి వద్ద తాను స్వయంగా డీప్ రీసెర్చ్ ఏఐ యాప్‌ను తయారు చేసినట్లు చెప్పుకొచ్చారు.సత్య నాదెళ్ల ఈ వారం భారత్ వస్తున్నారు. ఇక్కడి వ్యాపార, రాజకీయ ప్రముఖులను కలుసుకోనున్నారు. మైక్రోసాఫ్ట్ ఇటీవలె భారత్‌లో రాబోయే నాలుగేళ్లలో ఏఐ, క్లౌడ్ రంగాల్లో 17.5 బిలియన్ డాలర్లు పెట్టుబడులుపెట్టనున్నట్లుప్రకటించింది.

# సౌలభ్యతకే ఓటు

- రుణానికి వడ్డీ రేటు ఎంతైనా పర్వలేదు
- కానీ ఎంత తొందరగా ఇచ్చామన్నదే ముఖ్యం
- మారుతున్న దక్షిణాది ప్రజల ఆలోచనా ధోరణి

**వడ్డీ ఎంత అన్నది. కరెక్టేనా? ఊహూ కాదంటోంది పైసాబజార్. పండుగ రుణాలు తీసుకునేటప్పుడు మనోళ్లు.. అంటే దక్షిణాది రాష్ట్రాల వాళ్లు వడ్డీ రేట్ల కంటే..ఎంత వేగంగా రుణం వస్తుంది? డిజిటల్ సౌకర్యం ఉందా? లేదా? అన్నదానికే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారట. ఇదేమీ ఒట్టి మాటేమీ కాదండోయ్. సర్వే చేసి మరీ నిర్ణయించామని చెబుతోంది ఆ సంస్థ. వివరాలు ఇలా ఉన్నాయి..**



**న్యూఢిల్లీ:**ఈ రోజుల్లో అప్పు చేయకుండా ఉండటం అన్నది చాలామందికి అసాధ్యం. పండగ షాపింగ్ కావచ్చు. ఇంట్లో చిన్న చిన్న మరమ్మతులు కావచ్చు.. అన్ని సందర్భాల్లోనూ మన సేవింగ్స్ మాత్రమే అక్కరకు రావు. చేబదులు లేదా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో రుణాలు తీసుకోక తప్పని పరిస్థితి. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో అప్పుకు ఈ మూడే ప్రధాన కారణాలని పైసాబజార్ సర్వే చెబుతోంది. సర్వే చేసిన వారిలో సుమారు 33 శాతం మంది రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ అప్పు చేశారని, వీరు వడ్డీ రేట్ల కంటే డిజిటల్ ఎక్స్‌పీరియన్స్, ప్రాసెస్ వేగాలను ఆధారంగా చేసుకుని ఏ సంస్థ నుంచి రుణం తీసుకోవాలో నిర్ణయించుకుంటున్నారని ఈ సర్వే ద్వారా తెలిసింది. దక్షిణాది రాష్ట్రాల్లోని సుమారు 18 పట్టణాల్లో 1700 మందిని ప్రశ్నించి సిద్ధం చేశారీ సర్వేను. అడక్కుండానే మన ఆర్థిక స్థితిగతులు, పరపతులకు తగ్గట్టుగా లభించే ప్రీఅప్రూవ్డ్, ఇన్‌స్టంట్ లోన్లు మేలని సర్వే చేసిన వారిలో 41 శాతం మంది అభిప్రాయపడ్డారు. లోన్ ప్రాసెస్ మొత్తం చిట్టీలు, అకౌంట్ పుస్తకాల్లో కాకుండా డిజిటల్ పద్ధతిలో ఉంటే ఇష్టమని 24 శాతం చెబితే.. కేవలం 20 శాతం మంది మాత్రమే వడ్డీ రేట్లు ఎక్కువ తక్కువ ఉంటే అక్కడ రుణాలు తీసుకునేందుకు ఇష్టపడతామని చెప్పడం గమనార్హం. ఇంకో విషయం సర్వే చేసిన వాళ్లలో ఏకంగా 80 శాతం మంది మొత్తం ప్రాసెస్‌ను పద్ధతిగా వివరించే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై రుణం తీసుకునేందుకు మక్కువ చూపారు.

**అవసరం ఏమిటి? మొత్తం ఎంత?**

ముందుగా చెప్పుకున్నట్లు అత్యధిక శాతం మంది.. స్పష్టంగా చెప్పాలంటే 39 శాతం మంది హోమ్ రెనవేషన్ కోసమే అప్పు చేస్తున్నట్లు ఈ సర్వే ద్వారా స్పష్టమైంది. రుణాల సర్దుబాటు కోసం కొత్త రుణం చేస్తున్న వారు 27 శాతం మంది ఉంటే.. పండుగ షాపింగ్, పెట్టుపోతల వంటి వాటి కోసం అప్పు చేస్తున్న వారు 14 శాతం మంది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, బంగారం కొనుగోళ్లకు అప్పులు చేస్తున్న వాళ్లు వరుసగా 12 శాతం, 10 శాతం ఉన్నట్లు స్పష్టమైంది.సుమారు 35 శాతం మంది మూడు నుంచి ఐదు లక్షల రూపాయల వరకూ అప్పు చేస్తుంటే.. 22 శాతం మంది తాలూకా మొత్తాలు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ మాత్రమే ఉన్నట్లు ఈ సర్వేలో తెలిసింది. కేవలం 14 శాతం మంది మాత్రమే పది లక్షల రూపాయల కంటే ఎక్కువ మొత్తం అప్పు చేసినట్లు తెలిసింది.

## మెటల్ షేర్ల మెరుపులు..

### లాభాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్..

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. మెటల్ స్టాక్స్ లో బలమైన కొనుగోళ్లు, గ్లోబల్ ర్యాలీతో వరుసగా రెండవ సెషన్ లోనూ లాభాలను విస్తరిం చాయి.మధ్యాహ్నం 3:30 సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 449.53 పాయింట్లు లేదా 0.53 శాతం పెరిగి 85,267.66 వద్ద ఉండగా, నిఫ్టీ 50 సూచీ 148.40 పాయింట్లు లేదా 0.57 శాతం లాభంతో 26,046.95 వద్ద ఉంది.టాటా స్టీల్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్ అండ్ టీ, మారుతి సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ ఈ రోజు నిఫ్టీ గెయినర్లుగా నిలిచాయి. హెచ్‌యూఎల్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్ గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు పతనమయ్యాయి.విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.94 శాతం పెరిగాయి. సెక్టార్లలో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.63 శాతం పెరిగి టాప్ పెర్ఫార్మింగ్ ఇండెక్స్ గా నిలిచింది. దీంతోపాటు నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ లాభపడ్డాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మీడియా సెక్టార్లకు నష్టాలు తప్పలేదు.

# ఊపందుకుంటున్న ఘోస్ట్‌మాల్స్



## భారత్‌లో పెరుగుతున్న ఆదరణ

**న్యూఢిల్లీ:**దేశంలో రీటెయిల్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. వీధికో షాపింగ్ మాల్ వెలుస్తోంది. అయితే.. అన్ని షాపింగ్ మాల్స్ నిండుగా ఉంటున్నాయా? ఊహూ లేదు.చాలా వాటిల్లో షాపులు పెట్టుకునే స్థలాలుంటున్నాయి కానీ.. ఎవరూ అద్దె/ లీజుకు తీసుకోవడం లేదు. ఫలితంగా దేశంలో ఏటికేడాదీ ఘోస్ట్‌మాల్స్ పెరిగిపోతున్నాయి! ఘోస్ట్‌మాల్స్ అంటే ఏమిటని ఆలోచిస్తున్నారా? చాలా సింపుల్ ఏ మాల్‌లోనైనా సగం కంటే ఎక్కువ స్పేస్ మూడేళ్లపాటు ఖాళీగా ఉందంటే దాన్ని ఘోస్ట్‌మాల్ అంటారు. ప్రస్తుతం భారత్‌లోని 32 నగరాల్లో మొత్తం 72 మాల్స్ ఈ స్థితికి చేరుకున్నాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా అనే సంస్థ లెక్కకట్టింది. మొత్తం 365 షాపింగ్ సెంటర్స్‌లో 13.4 కోట్ల చదరపు అడుగుల స్థలం అందుబాటులో ఉంటే.. కోటీ యాభైఐదు లక్షల చదరపు అడుగులు (15.4 శాతం) ఖాళీగా ఉన్నట్లు ఈ సంస్థ 'థింక్ ఇండియా, థింక్ రిటైల్ 2025 - వాల్యూ క్యాప్చర్: అన్‌లాకింగ్ పొటెన్షియల్' పేరుతో విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది.నైట్ ఫ్రాంక్ ఇండియా 'థింక్ ఇండియా, థింక్ రిటైల్ 2025 - వాల్యూ క్యాప్చర్: అన్‌లాకింగ్ పొటెన్షియల్' నివేదిక ప్రకారం భారతదేశంలోని రిటైల్ రంగంలో ఖాళీ స్థలాల సమస్య తీవ్రంగా ఉంది. దేశంలోని 32 ప్రధాన నగరాల్లో ఉన్న 365 షాపింగ్ సెంటర్లలో మొత్తం 134 మిలియన్ చదరపు అడుగుల స్థలంలో 15.4% అంటే 15.5 మిలియన్ చదరపు అడుగుల స్థలం ఖాళీగా ఉంది.మూడేళ్లుగా మాల్స్‌ల్లో 40% కంటే ఎక్కువ స్థలాలు ఖాళీగా ఉంటే వాటిని ఘోస్ట్ మాల్స్‌గా పరిగణిస్తారు. ఈ 74 ఘోస్ట్ మాల్స్‌లు మొత్తం రిటైల్ స్థలాల్లో 20% ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇవి ప్రధానంగా టైర్-2 నగరాల్లో (ఉదా: నాగ్‌పూర్, అమృత్‌సర్, జలంధర్) ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి విరుద్ధంగా మైసూరు, వదోదర వంటి నగరాల్లో 2-6% మాత్రమే ఖాళీగా ఉన్నాయి.

**ఘోస్ట్ మాల్స్‌కు దారి తీస్తున్న కొన్ని కారణాలు..**

మాల్స్‌ల్లో ప్రధానంగా టెనెంట్ మిక్స్, మాల్స్ నాణ్యత ఖాళీ స్థలాలకు కారణంగా ఉంది. చాలా మాల్స్ బలమైన ఆంకర్ టెనెంట్స్ (హైపర్‌మార్కెట్స్, మల్టీప్లెక్స్‌లు వంటివి) లేకుండా ప్రారంభమవుతున్నాయి. ఆంకర్ టెనెంట్స్ కస్టమర్లను ఆకర్షించి చిన్న షాపులకు మద్దతు ఇస్తాయి. వీటి లేమి కారణంగా కస్టమర్ ఫుట్‌ఫాల్ తగ్గుతుంది.గ్రేడ్-సీ మాల్స్‌లో ఖాళీ 36% వరకు ఉంది. వీటిలో చాలా వరకు డిజైన్, లేఅవుట్‌ల్లో ఆధునిక అవసరాలకు దూరంగా ఉన్నాయి (ఉదాహరణకు, మురికిపడిన కారిడార్లు, బ్యాడ్ లైటింగ్, అన్‌ఫ్రెండ్లీ లేఅవుట్‌లు). కొన్ని నగరాల్లో (ముఖ్యంగా టైర్-2) డిమాండ్‌కు మించి అధిక స్థలాలు అందుబాటులో ఉండటం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.సైట్ లొకేషన్ సెలక్షన్ వంటి దీర్ఘకాలిక సమస్యలున్నాయి.

**ఆన్‌లైన్ షాపింగ్**

ఆధునిక కస్టమర్ షాపింగ్ అలవాట్లలో వచ్చిన మార్పు, ప్రత్యేకించి ఈ-కామర్స్ పెరుగుదల, మాల్స్‌కు తీవ్రమైన

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.51 | ₹ 6.53 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
**హైదరాబాద్**

| | |
|---|---|
| ₹ 1,22,100 (22 క్యారెట్లు) | ₹ 1,33,200 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
**హైదరాబాద్**
₹ 2,15,000

# సఖ్యత చెదిరి.. హద్దులు దాటి



- దేశాధినేతల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధం
- ప్రపంచ యుద్ధాలకు ఉసిగొల్పుతున్న వైనం

**వాషింగ్టన్:**ఇటీవల కాలంలో పలు దేశాల మధ్య ఉద్రికత్తలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా నాయకుల మధ్య మాటల దాడి హెచ్చుమీరుతోంది. ఈ పరిణామాలను చూస్తే గతంలోనే వరల్డ్ వార్-3 వచ్చే అవకాశం ఉందని చాలా మంది భావించారు.దేశాల మధ్య సఖ్యత చెదిరి, యుద్ధాలకు దారి తీస్తున్న పరిస్థితులే వీటన్నంటికీ కారణం. అటు రష్యా-ఉక్రెయిన్ వార్ మొదలుకొని నేటి పాకిస్తాన్-ఆఫ్ఘాన్ దేశాల మధ్య చోటు చేసుకున్న పరిస్థితుల్ని చూస్తే ఏదో ఉపద్రవం రాబోతుందా? అని పగటు ప్రజానీకం ఉలిక్కిపడిన సందర్భాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

**ట్రంప్‌లో అసహనం..**

మరొకవైపు 'శాంతి-శాంతి' అని చెప్పుకునే అగ్రదేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సందర్భాల్లో వరల్డ్ వార్-3 అంటూ వ్యాఖ్యానించారు కూడా. మళ్లీ తాజాగా ట్రంప్ అదే హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా రష్యా-ఉక్రెయన్‌ల మధ్య యుద్ధాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఆ యుద్ధం కారణంగా గత నెలలోనే సుమారు 25 వేల మంది వరకూ మృత్యువాత పడ్డారని, అందులో ప్రజలు, సైనికులు కూడా ఉన్నారన్నారు.ఆ యుద్ధాన్ని తక్షణమే ఆపకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి కూడా అది కారణం కావొచ్చని హెచ్చరించారు.ఆ ఇర దేశాల నేతాలకు ఎన్నిసార్లు చెప్పినా యుద్ధాన్ని ఏదొక రూపంలో.ఆ ఇర దేశాల నేతాలకు ఎన్నిసార్లు చెప్పినా యుద్ధాన్ని ఏదొక రూపంలో ముందుకు తీసుకెళుతున్నారే కానీ దాన్ని ముగించాలనే ఆలోచన చేయడం లేదంటూ వైట్‌హౌస్ వేదికగా మీడియా సమక్షంలో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'ఏం జరుగుతుందో చూద్దాం' అని వ్యాఖ్యానించారు ట్రంప్.

**ఇక మాటల్లేవ్.. అంతా యాక్షనే..!**

అంతకుముందు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ.. రష్యా-ఉక్రెయిన్‌ల యుద్ధంపై ట్రంప్ చాలా ఆందోళనగా ఉన్నారన్నారు. అది ట్రంప్‌కు విపరీతమైన చిరాకు తెప్పిస్తుందన్నారు. ఇరుదేశాలు ఒక సఖ్యతకు వచ్చి యుద్ధం ఆపకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు చూడాల్సి వస్తుందన్నారు. ఇక రష్యా- ఉక్రెయిన్‌లతో మాట్లాడాలని ట్రంప్ అనుకోవడం లేదని, ఇక కేవలం చర్యలతోనే ఇరు దేశాలకు సరైన సమాధానం చెప్పాలని ట్రంప్ భావిస్తున్నారన్నారు.




# మధుమేహులకు గుడ్ న్యూస్

- నోవో నార్డిస్క్ మందు వచ్చేసింది

**న్యూఢిల్లీ:**డానిష్ ఔషధ తయారీ సంస్థ నోవో నార్డిస్క్ తన బ్లాక్‌బస్టర్ యాంటీ-టైప్-2 డయాబెటిస్ డ్రగ్ ఓజెంపిక్ (సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్)ను ఇండియాలో లాంచ్ చేసింది.దీన్ని అధిక బరువు నియంత్రలో కూడా వాడుతున్నారు. 0.25 మిల్లీగ్రాముల డోసేజ్ వెర్షన్‌కు వారానికి రూ. 2,200 ప్రారంభ ధరకు భారతదేశంలో విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది.ఈ ఔషధం 0.25మి.గ్రా., 0.5 మి.గ్రా, 1 మి.గ్రా మూడు మోతాదు రూపాల్లో లభిస్తుంది నొప్పి లేకుండా సబ్కటానియస్ నోవోఫైన్ నీడిల్స్ ఇంజెక్షన్. ఇది సింగిల్-యూజ్ ప్రీ-ఫిల్డ్ పెన్. 'ఓజెంపిక్'ను మొదటి 4 వారాల పాటు వారానికి ఒకసారి చొప్పున 0.25 మి.గ్రాతో ప్రారంభిస్తారు, ఆ తర్వాత కనీసం 4 వారాల పాటు వారానికి ఒకసారి 0.5 మి.గ్రా స్టెప్ అప్ డోసేజ్ ఇస్తారు. లాంగ్ డోసేజ్ కింద వారానికి ఒకసారి 1 మి.గ్రీ వరకు తీసుకోవచ్చు. మూడు మోతాదుల ఇంజెక్షన్‌గా ప్రీ-ఫిల్డ్ పెన్ను వస్తుంది. దీని ఖరీదు నెలకు రూ.8800 (వారానికి రూ.2200), మరొక డోస్ ధర రూ.10,170 (వారానికి రూ.2542.5), నెలకు రూ.11,175 (వారానికి రూ.2793.75) అవుతుందని కంపెనీ చెప్పింది.భారతదేశంలో ఇన్సులిన్ ధరల జోన్‌లోనే ఇది అందుబాటులో ఉందన్నారు. ఇదొక కీలకమైన అభివృద్ధిగా అభివర్ణించారు. వైద్య చరిత్రను మార్చిన పెన్సిలిన్ , యాంటీ బయాటిక్స్ ఆవిష్కరణలకు ఇది సమానమని నోవో నార్డిస్క్ ఇండియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ శ్రోత్రియ పేర్కొన్నారు. నిజంగా ఓజెంపిక్‌ను ఈ ధర జోన్‌లోకి తీసుకురావడం చాలా కష్టతర మైందన్నారు. ఇండియాలో వైద్యులు సూచన మేరకు ఎక్కువ మంది తమ మందును వాడాలని ఆశిస్తున్నామన్నారు.

**దీని వాడకంపై ఆందోళనలు**

మానసిక-ఆరోగ్య సవాళ్లు, ఆత్మహత్య ధోరణుల ఆందోళనలపై బరువు తగ్గించే మందులపై ఆస్ట్రేలియా కొత్త భద్రతా హెచ్చరిక మధ్య, విస్తృతమైన ప్రపంచ భారతీయ నియంత్రణ సంస్థ పరిశీలన నేపథ్యంలో ఇండియాలో అలాంటి ప్రతిసవాళ్లేవీ లేవని విక్రాంత్ శ్రోత్రియ ప్రకటించారు.

### రూ.1,404 కోట్ల అవినీతి..

# మాజీ బ్యాంకు అధికారిని ఉరి తీసిన చైనా

బీజింగ్ : రూ.1,404 కోట్ల అవినీతి , లంచం తీసుకున్న నేరాలకు సంబంధించిన కేసు చైనా సంచలన నిర్ణయం తీసుకుంది. దోషిగా తేలిని సీనియర్ బ్యాంకర్‌ను ఉరి శిక్షను అమలు చేసింది.సుప్రీం పీపుల్స్ కోర్టు మునుపటి తీర్పును సమర్థించిన తర్వాత టియాంజిన్‌లో మరణశిక్ష అమలు చేసినట్లు అధికారులు ధృవీకరించారు.బాయి టియాన్‌హుయ్ వేలకోట్ల అక్రమాలు, దేశంలోని ప్రధాన బ్యాంకుల్లో ఒకటి పాపులర్ ఈ కేసు చైనాలో , అంతర్జాతీయంగా దృష్టిని ఆకర్షించింది.చైనా హువారోంగ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్‌లో మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ బాయి టియాన్‌హుయ్ 1.1 బిలియన్ యువాన్లకు(దాదాపు రూ.1,404 కోట్లు) పైగా చట్టవిరుద్ధమైన చెల్లింపులు పొందారని కోర్టులు తేల్చిన తర్వాత చైనా అతణ్ని ఉరితీసింది . ఆర్థిక సంస్థలు మరియు రాష్ట్ర-సంబంధిత సంస్థలలో అవినీతికి వ్యతిరేకంగా బీజింగ్ కొనసాగుతున్న ప్రచారంలో భాగంగా ఈ శిక్షను అమలు చేసింది.చైనా గతంలో ప్రధాన కేసుల్లో శిక్షను అమలు చేసినప్పటికీ, అవినీతి కేసుల్లో మరణశిక్షలు అరుదనే చెప్పాలి.చైనా హువారోంగ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్‌గా పనిచేసిన లై షియోమిన్ 1.79 బిలియన్ యువాన్ల లంచం తీసుకున్నందుకు దోషిగా తేలిన తర్వాత 2021లో ఉరితీశారు.సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ రిపోర్ట్ ప్రకారం సుప్రీం పీపుల్స్ కోర్టు మునుపటి తీర్పును సమర్థించిన నేపథ్యంలో టియాంజిన్‌లో బాయి టియాన్‌హుయ్ మరణశిక్ష అమలు చేసినట్టు అధికారులు నిర్ధారించారు. అక్రమ డబ్బు పరిమాణం , దేశంలోని ప్రధాన ఆర్థిక సమూహాలలో ఒకదానిలో బాయి ఒకప్పుడు కలిగి ఉన్న స్థానం కారణంగా ఈ కేసు చైనాలో మరియు అంతర్జాతీయంగా దృష్టిని ఆకర్షించింది. టియాంజిన్ సెకండ్ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు తొలుత బాయికి 2024 మేలో మరణశిక్ష విధించింది. అతని వ్యక్తిగత ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. బాయి టియాన్హుయ్ అందుకున్న లంచాల మొత్తం , నేరాల స్థాయి చాలా తీవ్రమైనవిగా కోర్టు పరిగణించింది.

# పుష్కరకాలానికి నిద్రలేచిన అన్నా హాజరే..

చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే 2022లో తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేశారు. లోకాయుక్తను అమలు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో నిరసనను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత ఓ కమిటీ చట్టాన్ని రూపొందించింది. ఈ బిల్లును మహారాష్ట్ర శాసనసభలోని ఉభయ సభలు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాయి. అయితే.. ఈ చట్టం ఇంకా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని అన్నాహజారే పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఫడణవీస్‌కు తాను ఏడు లేఖలు రాసినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తాను నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఇన్నేళ్లవుతున్నా మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు చేయట్లేదో తెలియట్లేదని విమర్శించారు.

# శివరాజ్ పాటిల్ కన్నుమూత

### వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో మరణించిన కేంద్ర మాజీ మంత్రి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ (90) అనారోగ్యంతో కన్నుమూశారు. మహారాష్ట్ర లాతూర్‌లోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ మరణం తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన సంతాపం వ్యక్తం చేశారు. 'శివరాజ్ పాటిల్‌జీ మరణం విచారకరం. ఆయన అనుభవజ్ఞుడైన నాయకుడు. ప్రజా జీవితంలో సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రితో సహా అనేక హోదాల్లో సేవలందించారు. సమాజ సంక్షేమానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. కొన్ని నెలల క్రితమే ఆయన నా నివాసానికి వచ్చారు. ఇంతలోనే ఇలా జరగడం విచారకరం. ఓం శాంతి' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా శివరాజ్ పాటిల్ మరణానికి సంతాపం తెలిపారు.

# ఔరా.. డైనోసార్

### శాస్త్రవేత్తలే విస్తుపోయేలా 92 అడుగుల భారీ డైనోసార్



బీజింగ్:దక్షిణ చైనాలో భారీ ఎముకలతో, కనీవినీ ఎరుగని పెద్ద డైనోసార్ శిలాజాల ను గుర్తించారు. ఈ భారీ శిలాజం శాస్త్రవేత్తలను కూడా ఆశ్చర్యపరిచింది. ఇది దాదాపు 92 అడుగుల (సుమారు 28 మీటర్లు) పొడవు ఉంటుందని అంచనా. టోంగ్నాన్‌లాంగ్ జిమింగి అనే పేరుపెట్టారు. ఈ భారీ 92 అడుగుల సౌరోపాడ్ జాతి డైనోసార్ ఇపుడు భూమిపై అతిపెద్ద భూ జంతువులలో ఒకటిగా నిలుస్తోంది.టోంగ్నాన్ జిల్లా తవ్వకాలలో శాస్త్రవేత్తలు దీన్ని కనుగొన్నారు. డైనోసార్ శిలాజాలకు భౌగోళిక హాట్‌స్పాట్ అయిన సిచువాన్ బేసిన్‌లోని ప్రాంతమైన చాంగ్‌కింగ్‌లోని టోంగ్నాన్ జిల్లాలో నిర్మాణ పనుల సమయంలో ఈ అవశేషాలను మొదటిసారిగా 1998లో తవ్వారు. కానీ ఇటీవలే శాస్త్రవేత్తలు పీర్-రివ్యూడ్ జర్నల్ సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో పూర్తి విశ్లేషణను ప్రచురించారు.పొడవాటి మెడ, తోక, చిన్న తల ఉండే శాకాహారి డైనోసార్ ఇది. అవశేషాలలో అవయవాలు, వెన్నుపూసలు ,భుజం ఎముకలు కూడా ఉన్నాయి. ఈ భాగాలు ఇది సౌరోపాడ్ సమూహం అయిన మామెన్చిసౌరిడేకు చెందినదని నిర్ధారించారు. గతంలో నమోదు చేయబడిన వాటి కంటే పొడవైన భుజం బ్లేడ్ పొడవు 1.8 మీటర్ల కంటే ఎక్కువ. ఇది డైనోసార్ల పరిమాణ పరిమితులను ప్రశ్నిస్తోందనీ, ఎందుకంటే ఇంత పెద్దవిగా పెరగడం చాలా కష్టమని భావిస్తున్నారు. అస్థిపంజరం సుయినింగ్ ఫార్మేషన్ రాక్ బెడ్ లోపల ఉంది. ఇది సుమారు 147 మిలియన్ సంవత్సరాల క్రితం నాటిది. అక్కడ వరదలు సంభవించిన సంఘటనలు అక్కడ చాలా త్వరగా మృతదేహాలను పాతిపెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు.మూడు డోర్సల్ వెన్నుపూస, ఆరు కాడల్ వెన్నుపూస పూర్తి స్కాపులా , కోరాకోయిడ్ టిబియా, ఫైబులా, మెటాటార్సల్స్ మరియు గోళ్ల భాగాలు తదితరాలు ఈ తవ్వకాల్లో గుర్తించినవాటిల్లో ఉన్నాయి.

డైనోసార్ ఇంత భారీ పరిణామంలో ఎలా?

ఈ జంతువులు విపరీతమైన పరిమాణం ఇంత భారీ స్థాయిలో ఉండటానికి కారణం ఏంటి? వాటి చిన్న పుర్రెలు, చాలా పొడవైన, సరళమైన మెడకు సపోర్ట్‌గా నిలవడంతోపాటు, కారగాలితో నిండిన ఎముకలు భారీ శరీరాన్ని చాలా తేలికగా ఉంచుతాయి. సమర్థవంతమైన శ్వాస వ్యవస్థలు వాటి లోపల ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరిచాయి. ఈ లక్షణాలు కాలక్రమేణా పరిమాణానికి బాటలు వేశాయి. నేడు కనిపించే ఆధునిక పక్షులలో కూడా ఇటువంటి లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనవేత్తలు అంటున్నారు. ఈ పరిణామ మిశ్రమం స్థిరమైన పెరుగుదలను ప్రోత్సహించిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ జెయింట్స్ ఎలా వృద్ధి చెందాయో వివరించడానికి కొత్త శిలాజం సహాయపడుతుందట. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అసలు అధ్యయన ప్రచురణలో పొందుపర్చారు.

# అభ్యర్థులూ డబ్బు ధారపోసి ఆగం కావద్దు

- కేంద్రం నిధులతోనే పల్లెల్లో ప్రగతి
- బిజెపి మద్దతు దారులను గెలిపించండి 10 లక్షల నిధులు ఇస్తా
- బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలుఎంపీ డీకే అరుణ




నారాయణపేట జిల్లా బ్యూరో డిసెంబర్ 12(జనం సాక్షి):పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు అప్పులు చేసి డబ్బులు ధారపోసి ఆగం కావద్దు అని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు పాలమూరు ఎంపి డి కే అరుణ కోరారు.శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బిజెపి రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండు రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాను రానూ ఎన్నికల్లో డబ్బు ప్రభావం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.మొదటి విడత పంచాయితీ ఎన్నికల్లో ఒక్కో పంచాయి తీలో ఓటుకు వెయ్యి నుంచి 6 వేల రూపాయలు దారపోధారని అలాగే ఏకగ్రివ ఎన్నికలకోసం లక్షలు దారపోశారని అన్నారు. అభ్యర్థులు అప్పులు చేసి డబ్బులు ధారపోసి ఆగం కావద్దు అని సూచించారు.రెండవ విడత 14వ తేదీన జరగబోతున్నాయనీ ఇప్పుడైనా అభ్యర్థులు జాగ్రత్త పడాలని కోరారు

.ప్రజలు కోరుకునేది గ్రామ అభివృద్ధి, అందుబాటులో ఉండే వ్యక్తిని సర్పంచ్ లుగా ఎన్నుకోండనీ సూచించారు.ప్రస్తుతం డబ్బు ప్రభావం పంచాయతీ ఎన్నిక ల్లో కనిపిస్తుండటం విచార కరమని అన్నారు.డబ్బులు పెట్టీ గెలిచిన నేతలకు, పను లు చేయాలనే ఆలోచన ఉండదనీ అన్నారు.గ్రామ పంచాయతీ లకు కాంగ్రెస్,బి ఆర్ ఎస్ ప్రభుత్వాలు ఇచ్చిన నిధులు శూన్యం అన్నారు.చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించలేదన్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పిసిసి చీఫ్ హోదాలో సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారనీ ఇంతవరకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదనీ విమర్శించారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తుంది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రమే నని అన్నారు.గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతోనే సిసి రోడ్లు మొదలు కొని అనేక పనులు కేంద్రం నిధులతో జరుగుతున్నా యన్నారు.గ్రామ పంచాయ తీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా డైవర్షన్ చేస్తున్నారనిఅందుకే నేరుగా సర్పంచ్ ల ఖాతాలలో కేంద్రం నిధులు వేస్తుందని తెలిపారు.అనేక గ్రామాలకు ఇప్పటికి రోడ్లు లేవనీనారాయణపేట జిల్లా లో అనేక గ్రామాల్లో రోడ్లకు ప్రతిపాదనలు పెట్టడం జరిగిందనీ చెప్పారు.పలు రోడ్లకు శాంక్షన్ వచ్చిందని తెలిపారు.మిగతా రోడ్లకు మంజూరు తీసుకుంటానని చెప్పారు.అలాగే పి ఎం శ్రీ కింద పాఠశాలల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయి.వాటి నిర్మాణాలలో కూడా ఆలస్యం వహిస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో అమలు చేసే ప్రతి పథకంలో 60శాతం కేంద్రం నిధులు ఉన్నాయనీ అన్నారు.సర్పంచ్, వార్డు మెంబర్లుగా బీజేపీ మద్దతుదా రులను ప్రజలు గెలిపించుకోవాలని కోరారు.ఎంపీ నిధుల నుంచి ఆయా గ్రామాలకు 10లక్షల నిధులు అభివృద్ధికి అందజేస్తానని హామీ ఇచ్చారు.కాంగ్రెస్కు ఓటు వేస్తేనే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని మభ్య పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రం నిధులతోనే ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని అన్నారు.హ్యామ్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మా ణంకు టెండర్లు పిలుస్తున్న కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనీ అన్నారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం ఎవరికి లేదనీ అన్నారు.భూములు అమ్మి ప్రభుత్వం నడుపుతున్నారనీ విమర్శించారు.పెన్షన్లు, జీతా లు భూములు అమ్మి చెల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు.ప్రతి మహిళకు 2500వందల ఆర్థిక సాయం అని రెండేళ్లలో ఒక్కో మహిళకు 60వేల రూపాయలు బాకీ పడిందన్నారు.ప్రభుత్వం ప్రతి మహిళల కు బాకీ పడిన 60 వేలు ఇవ్వకుండా చీరలు ఇచ్చి మభ్య పెడుతున్నారని విమర్శించారు.

గ్రామాల అభివృద్ధి కృషి చేసే కేంద్ర మోదీ సర్కార్కు అండగా నిలబడాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావు నామాజీ,మాజీ జిల్లా అధ్యక్షులు పడకుల శ్రీనివాసులు,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ,ప్రధాన కార్యదర్శులు లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్, బలరాం రెడ్డి,జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్,మాజీ కౌన్సిలర్లు సుజాత, గోపాల్,సత్య రఘుపాల్, వెంకటయ్య, నారాయణపేట పట్టణ అధ్యక్షులు వినోద్,జిల్లా నాయ కులు కృష్ణ, మీడియా కన్వీనర్ కిరణ్ ప్రెస్మీట్లో పాల్గొన్నారు.

# పోలింగ్కు 44 గంటల ముందు ప్రచార నిషేధం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య**



**సంగారెడ్డి, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లాలో రెండవ విడత ఎన్నికలు జరగనున్న మండలాల్లో శుక్రవారం సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచారం నిషేధం అమల్లోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. రెండవ విడత ఎన్నికలు జరుగనున్న ఆందోల్, చౌటకూర్, ఝరాసంగం, కొహిర్, మొగుడంపల్లి, మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్పల్లి, జహీరాబాద్ మండలాల్లో 12వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలవుతుందని పేర్కొన్నారు. మూడవ విడత ఎన్నికలు జరగనున్న కల్హేర్, కంగ్టి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల్లో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలు పై నిషేధాజ్ఞలు ఉంటాయని తెలిపారు.

ప్రతి విడతకు సంబంధించి 44 గంటల సైలెన్స్ పీరియడ్ తప్పనిసరిగా అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, శబ్ద ప్రచారం, ఎలక్ట్రానిక్, ఇతర మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధించ బడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా సహకరించాలని ఆమె కోరారు.

## మౌలాలి డివిజన్ విభజనపై
# రాజకీయ పార్టీల ఉమ్మడి డిమాండ్




- 50 వేల ఓటర్లకు ఒక్కటే డివిజనా?
- వార్డుల పునర్విభజనపై అసంతృప్తి.
- రెండు డివిజన్లు చేయాలని వినతి

**మల్కాజిగిరి డిసెంబర్ 12 (జనంసాక్షి):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని డివిజన్ల పునర్వి భజన ప్రక్రియపై స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, బహుజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మౌలాలి 138 డివిజన్ను విభజించకుండా యథాతథంగా ఉంచడంపై వారు అభ్యంతరం తెలిపారు. మౌలాలి డివిజన్లో ప్రస్తుతం 50 వేలకు పైగా ఓటర్లు ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ప్రజలకు పరిపాలనా సౌలభ్యం,ప్రజా సేవలు సమర్థవంతంగా అందించడం ఒక్క డివిజన్ ద్వారా సాధ్యం కాదని నాయకులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో, మౌలాలి డివిజన్ను తక్షణమే రెండు డివిజన్ లు గా విభజించాలని కోరుతూ, శుక్రవారం వివిధ పార్టీల నాయకులు ఉమ్మడిగా సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.అధికారులు ఈ అంశాన్ని లోతుగా పునరాలోచించి, ప్రజాస్వామ్య స్ఫూర్తితో న్యాయం చేయాలని, మౌలాలి డివిజన్ ప్రజల సౌకర్యార్థం విభజన ప్రతిపాదనను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వగ్గు చంద్రశేఖర్ రావు,పూలపల్లి సుందర్ యాదవ్, గౌతమ్ రాజ్,జోగు శ్రీనివాస్, బుర్ర రాజు గౌడ్,కరణం గోపి,జినికుంట్ల రమేష్ గౌడ్,జీడి నవీన్ గౌడ్,కాసర్ల నాగరాజు,తుపాకుల జనార్దన్,కావలి ఈశ్వర్ యాదవ్,అశోక్,రమేష్, భాస్కరా చారి తదితరులు పాల్గొన్నారు.



# సాఫ్ట్వేర్ ఉద్యోగం వదిలి సర్పంచ్ బరిలో..

**పుల్కల్, డిసెంబర్ 12 (జనం సాక్షి):** సాఫ్ట్వేర్ ఉద్యోగంను వదిలిపెట్టి వచ్చిన యువకుడు సర్పంచ్ బరిలో దూసుకుపోతున్నాడు. మండల ంలోని పోచారం గ్రామానికి చెందిన సాయి కృష్ణ సాఫ్ట్వేర్ ఉద్యోగం కాదని 75 వేల జీతాన్ని వదిలిపెట్టుకొని ప్రజాసేవ చేసేందుకు ముందు కు వచ్చాడు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా సాయికృష్ణ ప్రచారంలో అధికార పార్టీ కాంగ్రెసుకు దీటుగా ప్రచారంలో ముందంజలో ఉన్నారు. గ్రామ ప్రజల కోసం తన వంతుగా ఉడత భక్తిగా సేవ చేసేందుకు ముందుకు వచ్చానని సాయి కృష్ణ తెలిపారు.యువత ప్రజాస్వామ్యం వైపు నడిచినప్పుడు అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

## బీఆర్ఎస్ సర్పంచుల ఘన విజయంపై
# పైలట్ రోహిత్రెడ్డి ఆనందం

- మనోహర్ రెడ్డికి తోక ముడిచి తిరుమలపూర్కు వెళ్లిపోవాలి
- కాంగ్రెస్ నీచ రాజకీయాలు మానుకోవాలి
- 70 స్థానాల్లో బీఆర్ఎస్ ఘనవిజయం
- రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీల్లోనూ బీఆర్ఎస్ కైవసం



**తాండూరు, డిసెంబర్ 12 (జనం సాక్షి):** తాండూరు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ నేతలకు భూములు పుట్టుకొచ్చాయని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి భయపడుతోందని, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి పట్టిన గతే మనోహర్ రెడ్డికి తప్పదని ఎద్దేవా చేశారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవడంతో కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కుక్కతోక వంకరలు తిరుగుతున్నారని, ప్రతిరోజూ ప్రజల్లోకి వెళ్తే సమస్యలు తెలుస్తాయని సూచించారు. నియోజకవర్గంలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయో కూడా మనోహర్ రెడ్డికి తెలియదని ప్రశ్నించారు. కార్యకర్తలను అదుపులో పెట్టుకోలేని స్థోమత లేని ఎమ్మెల్యే అని విమర్శించారు.అధికారులను అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో ఆటంకాలు సృష్టించారని, బీఆర్ఎస్ నుంచి గెలిచిన సర్పంచులను బలవంతంగా కాంగ్రెస్ కండువా కప్పి నీచ రాజకీయాలు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. లేనిపోని ఆశలు చూపి మబ్బె పెట్టి కాంగ్రెస్లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో 70 స్థానాల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించిందని, ఈ గెలుపుతో మనోహర్ రెడ్డి తోక ముడిచి స్వగ్రామం తిరుమలపూర్కు వెళ్లిపోవాలని ఎద్దేవా చేశారు.రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు నాలుగు జడ్పీ స్థానాలు, జడ్పీ చైర్మన్ పీఠం కూడా బీఆర్ఎస్ కైవసమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ను నమ్మి ఓటు వేసిన ప్రజలకు మోసం చేశారని, మూడేళ్లలోనే మనోహర్ రెడ్డి తోక ముడిచి వెళ్లిపోతారని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గెలిచిన సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. గెలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులపై ప్రజలకు విశ్వాసం పోయిందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని చెప్పారు. దౌర్జన్యాల రాజకీయం ఎన్నడూ చూడలేదని, బలవంతపు ఏకగ్రీవాల మర్మం తెలపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్పంచ అభ్యర్థులు 100 సీట్లు గెలిచామంటే సిగ్గుండాలని విమర్శించారు. తాండూరు ప్రజలు మనోహర్ రెడ్డికి అవకాశమిచ్చారు, ఏదో ఒక మంచి పని చేసి వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, బషీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల రాంలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల స్ఫూర్తితో
# ఎంపిటిసి, జడ్పిటి స్థానాలు బిజెపి గెలవాలి

**బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్.**



**తాండూరు డిసెంబర్ 12(జనంసాక్షి) :** సర్పంచ్ ఎన్నికల స్ఫూర్తితో బిజేపీ అభ్యర్థులు ఎంపిటిసి జడ్పిటి స్థానాలు గెలవాలని బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలిచిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ పంచాయతీ ఎన్నికల్లో వివిధ మండలాల నుండి భారీ ఎత్తున భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలుపొందిన నేపథ్యంలో వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఎటువంటి భయభ్రాంతులకు లోనవ్వకుండా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ధైర్యంగా పార్టీ బలోపేతం దిశగా పోటీ చేసి విజయం సాధించిన ప్రతి అభ్యర్థిని అభినందించారు.గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేటాయించే నిధులను సమర్థవంతంగా వినియోగించు కోవాలని సూచించారు.రాబోయే ఎంపీటీసీ–జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా పార్టీ గుర్తుపై పోటీ చేయడానికి అభ్యర్థులు సిద్ధం కావాలని, ఇదే స్ఫూర్తితో ఘన విజయాలు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, సాహూ శ్రీలత, జిల్లా కార్యదర్శి వంటారం భద్రేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్ బాలప్ప, శ్రీకాంత్, మిత్తి శ్రీను, వెంకటేష్ ముదిరాజ్, సందీప్, వీరేశం ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ట్రైనీ టాట్స్ విద్యార్థి జాతీయస్థాయి
# స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని వాటి ద్వారా విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనీ టాట్స్ ప్రాంగణంలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు వివిధ క్రీడల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహంతో పాటు వనరులు కల్పించాలని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని ఆ ప్రణాళికలో భాగంగా ఇటీవల కాలంలో ఆదిలాబాద్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి కె.స్వరన్, 10వ తరగతి అత్యుత్తమ ప్రదర్శన కనబరచడమే కాకుండా రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలను గెలుచుకొని త్వరలో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం గొప్ప విషయం అని తెలుపుతూ విజేతకు పుష్పగుచ్ఛంతో పాటు అర్హత పత్రాన్ని అందజేసి జాతీయస్థాయిలోనూ విజయఢంక మ్రోగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేసోనన్స్ విద్యాసంస్థలకు ప్రభుత్వ అనుమతి లేదు




**శేరిలింగంపల్లి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** విద్యను వ్యాపారంగా మార్చి సామాజిక విలువల పతనానికి, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణభూతంగా మారిన ప్రైవేటు యాజమాన్య వ్యవస్థను తెలంగాణ రాష్ట్రం పొలిమేరల నుండి తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని శేర్లింగంపల్లి యువనేత రాగిరి సాయిరాం గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యావ్యవస్థలు మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తుందని, ఇందులో భాగంగా దిక్కుమొక్కులేని చిన్నాచితక ప్రైవేట్ విద్యాసంస్థల విషయంలో చూసి చూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్ కేంద్రంగా స్థాపితమైన రెసోనెన్స్ బడులకు ఎటువంటి అనుమతులు లేవని, ఆ సంస్థ ఈనెల 14న నిర్వహిస్తున్న రెసోఫాస్ట్ పరీక్షలకుసైతం ఎలాంటి శాస్త్రీయ పద్ధతులు, అనుమతులు లేవని సాయిరాం గౌడ్ స్పష్టం చేశారు. ప్రైవేట్ పై మోజు ఉన్న కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు కనీస అవగాహన లేకుండా ఇలాంటి ప్రభుత్వ అనుమతి లేని, గుర్తింపు లేని విద్యాసంస్థల విషయంలో వల్లులకు పోతుండడంతో సమస్య మరింత జటిలంగా మారుతుంది పేర్కొన్నారు. తనకు వ్యక్తిగతంగా రెసోనెన్స్ విద్యాసంస్థలపై వ్యతిరేకత లేదని, కానీ కనీస గుర్తింపు లేని ఈ సంస్థ నిర్వహించే పరీక్షకు విద్యార్థులు హాజరు కావొద్దని బిజెపి యువనేత రాగిరి సాయిరాం గౌడ్ విజ్ఞప్తి చేశారు. వనస్థలిపురం, మాదాపూర్, శేరిలింగంపల్లి, మణికొండ, గచ్చిబౌలి బ్రాంచులలో అడ్డగోలుగా బ్రాంచ్లను ఏర్పాటుచేసి విద్యాశాఖా అనుమతులు లేకుండా ఈ పరీక్షలు నిర్వహిస్తున్న రెసోనెన్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని ఆయన డిమాండ్ చేశారు.

# సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ వైస్ ప్రెసిడెంట్గా నిమ్స్ ఉద్యోగి

**ఖైరతాబాద్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో పనిచేస్తు న్న ఎం.ఎ.వారిస్ 2026–2028 కాలానికి సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్(ఎస్ఐఆర్) వైస్ ప్రెసిడెంట్గా నియమితులయ్యారు. రేడియోగ్రఫీ రంగంలో ఆయనకు ఉన్న విశేష అనుభవం, అంకితభావం, నాయకత్వ నైపుణ్యాలను గుర్తించి సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగరి బీరప్ప చేతుల మీదుగా వారిస్ నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వారిస్ ను అభినందిస్తూ బీరప్పను అభినందిస్తూ ఇది నిమ్స్కు గర్వకారణం అన్నారు. ఆయన నాయకత్వం ద్వారా రేడియోగ్ర ఫీ రంగంలో నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అలాగే, రేడి యాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ రామ్మూర్తి, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, సీనియర్ ప్రొఫెసర్లు ఆయనకు అభినందనలు తెలిపారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అధ్యక్షుడు శంకర్ కె.భగత్ లు వారిస్ నియామకాన్ని స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## మొదటి విడతలో గెలిచిన సర్పంచులను
# సన్మానించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 12(జనంసాక్షి):** కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలం లోని గ్రామాలలో గెలిచిన సర్పంచ్ ల వద్దకే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్వయంగా వెళ్లి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గత పది రోజులుగా ఎప్పటికప్పుడు వారి గెలుపుకోసం పాటుపడడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేసే విధంగా కృషి చేసి సుడా నిధుల ద్వారా చేస్తున్న అభివృద్ధితో పాటు రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి వారి గెలుపుకు సహకరించిన సుడా చైర్మన్ కు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచులతో పాటు ఇతర సర్పంచులను సైతం కలిసి వారిని శాలువాతో సత్కరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సుడా చైర్మన్ సన్మానం చేసిన వారిలో బోగొండ అయిలయ్య చామన్ పల్లి, కూర నరేష్ రెడ్డి చర్లభూత్కూర్, మోతె ప్రశాంత్ రెడ్డి దుబ్బపల్లి, గుర్రం సంధ్య తిరుపతి బహదూర్ ఖాన్ పేట్, బొద్దుల విజయలక్ష్మి ఫకీర్ పేట్, భాషవేని సరోజన మల్లేశం చేగుర్తి, వడ్లూరి అంజయ్య నల్లగుంట పల్లి, ఆకుల యాదగిరి తహర్ కొండా పూర్ పాల్గొన్నారు.



# మోడల్ స్కూల్లో విద్యార్థులకు గణిత ఒలంపియాడ్ పరీక్ష

**కరీంనగర్, డిసెంబర్ 12 (జనంసాక్షి):** శుక్రవారం రోజున హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు గణితంలో ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన మొదటి పదిమంది విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలను ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, మోడల్ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ బాలాజీ, అధ్యాపక బృందం చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం మాట్లాడుతూ... మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ప్రతి సంవత్సరము ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఇవ్వడము, గణితంలో ఒలంపియాడ్ టెస్టులు నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమని, విద్యార్థులు ఈ డిక్షనరీలను ప్రతిరోజు వాడుతూ మీ ఇంగ్లీష్ పదజాలాన్ని డెవలప్ చేసుకోగలరని సూచించారు. అనంతరము ప్రతిభ కనబరిచిన శ్రీవాలి, సహస్రి, సృజన, వైష్ణవి, మనితేజ, శ్రీఅంజన, అక్షయ్ కుమార్, శరణ్య, అజయ్, నవ్యశ్రీ లను అధ్యాపక బృందము అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం మురళి, కవిత, శ్రీనివాస్, సోఫియా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# మామను హత్య చేసిన అల్లుడు




**అమీన్పూర్, డిసెంబర్ 12 (జనం సాక్షి) :**

పుట్టింటికి వెళ్ళిన భార్యను తిరిగి పంపించడం లేదన్న కోపంతో అల్లుడు మామను హత్య చేసిన ఘటన బీరంగూడలో చోటు చేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాలు నిందితుడు కడమంచి రామకృష్ణ (40) మంజీరా నగర్ కాలనీ బీరంగూడలో చెత్త కలెక్షన్ పని చేస్తుంటాడు. 2005లో బీరంగుడకు చెందిన చిత్తారి చంద్రయ్య (57) కూతురు చిత్తరి లక్ష్మితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు ఆడపిల్లలు ఒక కుమారుడు ఉన్నారు. కానీ రామకృష్ణ నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. దాంతో మూడు నెలల క్రితం గొడవ జరగగా ఆమె తన తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉన్నది. భర్త నిత్యం గొడవ పడుతూ చిత్రా హింసలకు గురిచేస్తునందున అతని బాధలు భరించలేక ఆమె సంసారానికి వెళ్లలేదు. గురువారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో కడమంచి రామకృష్ణ తన మామగారి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడినాడు. భార్యను కొట్టడానికి వెళ్ళగా ఆమె తండ్రి చిత్తారి చంద్రయ్య అడ్డు వెళ్లి అల్లుడు రామకృష్ణ ని బయటికి పంపించినాడు. దాంతో రామకృష్ణ తీవ్రకోపంతో నీ అంతు చూస్తా అని హెచ్చరిస్తూ వెళ్ళినాడు. మరో అరగంట తర్వాత ఒక కూరగాయలు కోసే కత్తిని తీసుకొని వచ్చి చిత్తారి చంద్రయ్య పై దాడి చేసి విచక్షణ రహితంగా కత్తిపోట్లు పొడిచినాడు. చాతిలో, కడుపు భాగంలో పక్కటెముకలపై తీవ్రమైన రక్త గాయాలు కావడంతో చంద్రయ్యను దగ్గర లోని బీరంగుడ పనేషియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 9.30 గంటల సమయంలో మరణించినాడు. మృతుని కూతురు కడమంచి లక్ష్మి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సర్కారు ఇంటర్ విద్యకు మహర్దశ

- రూ. 56 కోట్లతో కాలేజీల్లో మౌలిక వసతులు
- చరిత్రలో తొలిసారిగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్
- ఒత్తిడి తగ్గించేలా 'టెలి మానస్' సేవలు
- విద్యార్థులకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూధన్ రెడ్డి




హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ఇంటర్ విద్య బలోపేత మవుతోందని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందుతు న్నాయని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ పి. మధుసూధన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వ కాలేజీల్లో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. సర్కారు కాలేజీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 326 కాలేజీల్లో రిపేర్లు, వసతుల కోసం రూ. 56.16 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. గతంలో నిధుల కొరతతో ఇబ్బంది పడ్డ కాలేజీలకు ఇప్పుడు ప్రతినెలా 'కాలేజీ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంట్' అందుతోందని, దీని ద్వారా రూ. 20 వేల వరకు నిధులు వస్తున్నాయని చెప్పారు.

**తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం..**

విద్యార్థుల భవిష్యత్తుపై భరోసా కల్పించేలా ఇంటర్ విద్యా చరిత్రలోనే తొలిసారిగా 2025 సెప్టెంబర్ 26న రాష్ట్రవ్యాప్తంగా 'మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్' నిర్వహించడం గొప్ప పరిణామమని మధుసూధన్ రెడ్డి అన్నారు. దీనివల్ల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువుపై, కాలేజీలో సౌకర్యాలపై పూర్తి అవగాహన వచ్చిందన్నారు. అలాగే విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, వారిని మానసికంగా దృఢంగా మార్చేందుకు 'యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్', 'టెలి మానస్', 'హెల్ప్' వంటి కార్యక్రమాలను అమలు చేయడం శుభపరిణామమని కొనియాడారు. 1, 2 మార్కులతో ఫెయిలయ్యే విద్యార్థుల కోసం ప్రభుత్వమే ఉచితంగా రీవాల్యువేషన్ చేయించడం పేద విద్యార్థులకు వరమన్నారు.

**డిజిటల్ హంగులతో..**

ప్రభుత్వ కాలేజీల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు రూ. 34 కోట్లతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతీ కాలేజీకి రెండు చొప్పున ఈ డిజిటల్ బోర్డులు రావడం వల్ల బోధన మరింత సులభతరమైందన్నారు. విద్యార్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం, పరీక్షల నిర్వహణలో క్యూఆర్ కోడ్ విధానం వంటి సాంకేతికతను వాడుతున్నట్లు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని ఆయన పేర్కొన్నారు. ఇంటర్ విద్యాజేఏసీ, ప్రిన్సిపల్స్ సంఘం, జీజేఎల్ఏ నాయకులు బలరామ్ జాదవ్, రవీందర్ రెడ్డి, కవిత, ఆంజనేయులు, లక్ష్మణ్ రావు, శ్రీనివాస్, కే.రజిత పాల్గొన్నారు.

# రెండు సార్లు యావజ్జీవ కారాగార శిక్ష

- ఒక్కొక్కరికి 30 వేల జరిమానా : జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 12 (జనం సాక్షి): ఒక ఎస్సీ/ఎస్టీ. హత్య కేసులోని ఇద్దరు నేరస్థులకు రెండు సార్లు యావజ్జీవ కారాగార శిక్ష పడినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. నవాబ్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2014సంవత్సరంలో గంగ్యాడ నాగమణి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. తన భర్త ప్రభాకర్ ను పాత కక్షలు మనసులో పెట్టుకొని కొట్టి చంపినారు అనే ఆరోపణపై నమోదైన హత్య . ఎస్సీ/ఎస్టీ యాక్ట్ కేసులో తుది తీర్పు వెలు బడిందని తెలియజేశారు. ఈ కేసులో నేరస్తులుగా తేలిన ఇద్దరు నిందితులు కొత్తపల్లి లక్ష్మి,. కొత్తపల్లి సత్యనారాయణ నవాబుపేటలకు ఎల్బి నగర్ లోని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక న్యాయ మూర్తి భవాని కీలక తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులోని హత్య నేరంలో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు తోపాటు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు జరిమానా, ఎస్సీ/ఎస్టీ చట్టం సెక్షన్ లో కూడా ఇద్దరికీ జీవిత ఖైదు తోపాటు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ విధంగా ఇద్దరు నిందితులకు రెండు సార్లు యావజ్జీవ కారాగార శిక్ష (జీవిత ఖైదు), ఒక్కొక్కరికి మొత్తం 30,000 రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. ఈ కేసు యొక్క విచారణ తోపాటు న్యాయస్థానంలో వాదనల కోసం కృషి చేసిన పిపి ప్రతాప్ రెడ్డి, అదనపు పిపిభద్రాద్రి, ఈ కేసు దర్యాప్తులోని అనేక మంది విచారణధికారులు (ఐఓ లు) వివిధ సమయాల్లో పాలుపంచుకున్నారు. మొదట ఎఫ్ఐఆర్ జారీ చేసిన 1వ విచారణాధికారి, అప్పటి నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీనివాస్, 2వ విచారణాధికారి, అప్పటి వికారాబాద్ ఇంచార్జ్ డీఎస్పీ ఏ.వి.రంగా రెడ్డి, 3వ విచారణాధికారి, అప్పటి వికారాబాద్ డీఎస్పీ టి.స్వామి, ఈ కేసు యొక్క ప్రస్తుత సూపర్వైసింగ్ అధికారి, ప్రస్తుత వికారాబాద్ డీఎస్పీ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, ప్రస్తుత మోమిన్ పేట్ సిఐ వెంకట్, ప్రస్తుత నవాబుపేట్ పోలీస్ స్టేషన్ అధికారి పుండ్లిక్, కేసు వివరాలను నిర్వహించడంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్లు (సీడీఓ లు) కె.నాగేశ్, ఎండి. షబ్బీర్ పాషా, బ్రీఫింగ్ అండ్ లైజనింగ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్ గౌడ్ లను ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శామీర్ పేట, (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. పోలీస్ లు తెలిపిన విరాల ప్రకారం శామీర్ పేట వల్లపు శ్రీనివాస్ (52) రాయి పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 6.15 గంటల సమయంలో శామీర్ పేట వైపు నుంచి పెద్దమ్మ కాలనీ వైపు తన గ్లామర్ బైక్ నంబర్ టి ఎస్ 08 ఎఫ్ ఎస్ 5739 పై వెళ్తుండగా మార్గ మధ్యంలోని అరణ్య రిసార్ట్ సమీపంలోకి రాగానే అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం నంబర్ టి ఎస్ 07 యు ఎల్ 2176 పెద్దమ్మ కాలనీ నుంచి శామీర్ పేట వైపు అతి వేగంగా, నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ రోడ్డుపై పడి తలకు తీవ్ర రక్తస్రావ గాయాలు, శరీరంలోని ఇతర భాగాలకు గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్ మృతదేహానికి పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# ప్రజల అవసరాలకే ప్రాధాన్యం



**అల్వాల్, డిసెంబర్ 12(జనంసాక్షి):** అల్వాల్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. సాయి నగర్ కాలనీలో 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు, ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్‌లో 22 లక్షలతో ఏర్పాటు చేయనున్న త్రాగునీటి పైపులైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. సాయి నగర్ కాలనీలో ఇన్నాళ్ళుగా రోడ్డు సమస్యలతో బాధపడుతున్న ప్రజలు కొత్త పనులు ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "ప్రజల అవసరాలకే ప్రాధాన్యం.. మౌలిక వసతుల విషయంలో రాజీ లేదు" అని కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే, కాలనీలకు మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో సాయి నగర్‌లో అనిల్ కుమార్, వేదనాద్ గేమ్స్, శంకర్ కుమార్, సురేంద్రనాథ్, ప్రేమ్ కుమార్, చరణ్, గిరి, రాజేందర్, లింగారెడ్డి, వీణ తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్‌లో మేనేజర్ రమేష్ గౌడ్, సతీష్, అనిల్ యాదిరెడ్డి, మహేంద్ర, ఓంకార్, శివ, భాస్కర్ రెడ్డి, దామోదర్, రజిని, నవనీత తదితరులు హాజరయ్యారు.

# మా పాఠశాలను జర చూడండి



**ఉప్పల్ డిసెంబర్ 12 (జనంసాక్షి) :** మండల ప్రాథమిక పాఠశాల రామాంతపూర్ నందు గల పాఠశాలలో 255 మంది విద్యార్థులకుగాను టీచర్స్ 8 మంది కావల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు టీచర్స్ మాత్రమే ఉన్నారు అని విద్యార్థులు చెప్పారు .ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులకు సరైన పద్ధతిలో భోధన చేయలేక పోతున్నాం. కావున విద్యావాలంటరు టీచర్ను మీ ద్వారా పంపగలరు. పాఠశాల ప్రైమిసన్ నందు హైస్కూల్ విద్యార్థులు సుమారు 700, మొత్తం ప్రైమరి, హైస్కూల్ కలిపి 1000 మంది విద్యార్థులు ఉండడంతో మంచినీరు సరిపోవడం లేదు.అని మాకు అదనపు కనెక్షన్ ఇప్పించగలరు, అని ఎమ్మెల్యే ను కోరారు. యూరినల్స్, డ్రైలేజ్ బయటకు వెళ్ళే దారి బాగోలేక దుర్గంధపు వాసనతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.అని మరియు యం డి యం పథకము క్రింద విద్యారులందరికి ఇక్కడే వంట చేసి పెట్టే అవకాశం ఉన్నప్పటికి దానికి షేడ్డు లే లేకపోవడంతో వర్షం పడినప్పుడు చాలా ఇబ్బంది కలుగుతుంది. కావున పాఠశాల నందు తరగతి గదులు సరిపోక పోవడంతో విద్యార్థులకు భోదన బయట చేయల్సి వస్తుంది మాకు బిల్డింగ్ పైన మూడు రూమ్లు ఏర్పాటు చేయాలని కోరారు.విద్యార్థులు ఎమ్మెల్యే నీ కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి, వెంకట్ రావు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మలి విడత ఎన్నికల ప్రచారానికి తెర

- 44 గంటలు ముందు నిషేధ ఆజ్ఞలు అమలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రేపు పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లాబ్యూరో డిసెంబర్ 12 (జనం సాక్షి):** జిల్లాలో మలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఓటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసామని వికారా బాద్ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఎన్నికల నిబంధన ప్రకారం ఓటింగ్ 44 గంటల ముందు ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించరాదని ఆదేశించారు. జిల్లా లో రెండవ విడత పోలింగ్ జరిగే మండలాలో అధికారులు నిబంధనలు పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని, రేపు ఉదయం 8 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లకు చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ సూచించారు.

శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి రెండవ విడత ఎన్నికలు జరిగే 7 మండలాల ఏం పి డి ఓ లు, తహసిల్దార్లు, స్పెషల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బంది సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు.రెండవ విడత పోలింగ్ ఈ నెల 14 న ఎన్నికలు జరుగనున్న7 మండలాలు బంట్వారం, మోమిన్‌పెట్, మర్పల్లి, వికారాబాద్, ధరూర్, కోట్‌పల్లి, నవాబ్‌పెట్, మండలాల ఎనికల అధికారులు, సిబ్బంది అందరు 13 వ తేదీ ఉదయం 8గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, బ్యాలట్ బాక్స్ లు తీసుకొని ,మధ్యాహ్న భోజనం అనంతరం పోలింగ్ మెటీరియల్ ను తీసుకోని పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాలని సూచించారు.. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించు కోవాలని, అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్ల చేయాలనీ కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాలలో లైట్స్, సీటింగ్ అరేంజ్ మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్మెంట్ వంటి వాటిని నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఓటింగ్ విషయంలో గోప్యత నూటికి నూరు శాతం అమలు జరిగేలా చూడాలన్నారు. గుర్తింపు లేని వ్యక్తులు ఎవ్వరిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరాదని, ఎన్నికల పోలింగ్ అనంతరం ఎన్నికల నియమ నిభందనల మేరకు 2 గంటలకే కౌంటింగ్ మొదలు పెట్టాలని, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా పూర్తయ్యేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

మండలం వారీగా ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు, మండలం వారిగాసంబంధిత అధికారులతో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 14 వ తేదీన...పోలింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 1 గంటల వరకు నిశ్శబ్ద కాలం అమలు జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో... ఈ నెల 14 వ తేదీన పోలింగ్ సందర్భంగా... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు...పోలింగ్ ముగిం పు సమయం మధ్యాహ్నం 1గంటల వరకు నిశ్శబ్ద కాలం అమలు అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణం గా జిల్లాలో రెండవ విడత బంట్వా రం,మోమిన్ పేట్, మార్పల్లి, వికారాబాద్, ధరూర్, కోట్ పల్లి, నవాబ్ పేట్ మండలాలలో జరిగే ఎన్నికల సందర్భంగా... ఈ నెల 14 వ తేదీన పోలింగ్ జరగనున్న ప్రాంతాలలో, పోలింగ్ ముగింపు సమయానికి 44 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 12 వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి 14 మధ్యాహ్నం 1 గంటల వరకు.... సంబంధిత పోలింగ్ ప్రాంతాలలో కింది తెలిపిన కార్యక్రమాలు పూర్తిగా నిషేధించిన్నట్లుతెలిపారు.

ఎటువంటి బహిరంగ సమావేశాలు, సభలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా,సంగీత, నాటక, వినోద కార్యక్రమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 - సెక్షన్ 214(2) ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

## ప్రజల సమస్యలు నావి.. ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

- కూన మహాలక్ష్మీ నగర్‌లో కార్పొరేటర్ కొలుకుల జగన్ పాదయాత్ర
- పెండింగ్ సీసీ రోడ్లు, యూజీడీల పనులు త్వరలోనే పూర్తి
- ఎల్లప్పుడూ ప్రజల కోసమే తానున్నానని హామీ

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12 : జగద్గిరిగుట్ట డివిజన్ జన్ ప్రజల సమస్యలు తన సొంత సమస్యలుగా భావిస్తానని, వాటి పరిష్కారం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ హామీ ఇచ్చారు. శుక్రవారం కూన మహాలక్ష్మీ నగర్ పరిధిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో భాగంగా ఇంటింటా తిరిగి ప్రజలతో మమేకమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. పలువురు నివాసితులు సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన జగన్.. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులను త్వరలోనే చేపట్టి పూర్తి చేస్తామని హామీ నిచ్చారు. "ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా ముఖ్య బాధ్యత. ఎవరైనా ఎప్పుడైనా నన్ను సంప్రదించవచ్చు. ఎల్లవేళలా మీ కోసమే ఉంటాను" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేష్, మహంకాళి, దుర్గయ్య, సిద్దయ్య, ఆంజనేయులు, తిరుపతయ్య, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉప్పల్‌లో ట్రాఫిక్ మళ్లింపు

**ఉప్పల్ డిసెంబర్ 12 ( జనం సాక్షి ):** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో 13.12.2025న జరగను న్న మెస్సీ టూర్ మరియు లైవ్ ఈవెంట్ దృష్ట్యా, ఒక మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది.అని ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ కదలికలపై ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. ఉద్దేశ్యంతో మళ్లింపులు చేయబడే భారీ వాహనాల వర్గాలు లారీ, డంపర్, ఎర్త్ మూవర్స్, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసి ట్రక్ మరియు అన్ని ఇతర రకాల ట్రక్కులు. డిసెంబర్ 13, 2025న మధ్యాహ్నం 12.00 గంటల నుండి రాత్రి 11.50 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించబడుతుంది. ట్రాఫిక్ పోలీసులు ప్రకటనలో తెలిపారు. 13-12-2025న మధ్యాహ్నం 4 గంటల నుండి 11 గంటల వరకు ఫలక్‌నుమా నుండి సంతోష్‌నగర్ మీదుగా ఉప్పల్ వరకు మరియు సికింద్రాబాద్ నుండి హబ్సిగూడ మీదుగా ఉప్పల్ వరకు మధ్యస్థమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుందని అంచనా. కాబట్టి పౌరులు ఈ మార్గాలను నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అభ్యర్థించారు. పోలీసు వారు వాహనదారుల కు విజ్ఞప్తి చేశారు. పౌరులు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులు మరియు మెట్రో రైలు వంటి ప్రజా రవాణాను ఉపయోగించు కోవాలని అభ్యర్థించారు.మళ్లింపుల మార్గాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.ఘట్కేసర్ నుండి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను మెహ్ఫిల్ హెూటల్ వద్ద ఉన్న హెచ్ఎండిఏ ఉప్పల్ భగాయత్ ప్రవేశ ద్వారం వద్ద నాగోల్ ఎల్ బి నగర్ వైపు మళ్లిస్తారు.

# వార్డుల విభజన ప్రజల కోసమా... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసమా?

- వార్డుల మ్యాపులకు దిక్కేలేదు... ఏమని అభిప్రాయాలు చెప్పాలి!?
- శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నేతల మండిపాటు




**శేరిలింగంపల్లి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డివిజన్లను ఇష్టానుసారంగా మార్చివేసి రాష్ట్ర ప్రభుత్వం ఏం సాధించబోతుందని, ఎవరి మేలు కోసం, ఇంకెవరి మెప్పుకోసం ఈ దుందుడుకు చర్యలకు దిగుతున్నారని శేరిలింగంపల్లి నియోజక వర్గ భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) ఆరోపించింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను, మున్సిపల్ కార్పొరేషన్ లను (20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ లు) జిహెచ్ఎంసి లో విలీనం చేస్తూ రాష్ట్ర గవర్నర్ ద్వారా ఆమోదం పొంది గెజిట్ ను విడుదల చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ వరకే ఖచ్చితమైన గడువును వేధించి సదరు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల రికార్డులను స్వాధీనం చేసుకోవడం విపక్షాలతో సహా నగర ప్రజల నుండి కూడా తీవ్రమైన నిరసనలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతు న్నాయి. భారీ నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి రెండుసార్లు సమీక్షలు నిర్వహించి తదనంతరం ప్రజాభిప్రాయాలు సేకరించిన పిదప సంబంధిత చర్యలకు పూనుకుంటే బాగుండేదని, గుడ్డెద్దు చేనులో పడి వేసిన చందంగా రేవంత్ సర్కారు జిహెచ్ఎంసి పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కబ్జాచేసి జేబులు నింపుకోవడానికి పరోక్షంగా దౌర్జన్యాలకు పాల్పడుతుందని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ పునరావాసంకోసం, కార్యకర్తల కోసం మాత్రమే శివారు మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను జిహెచ్ఎంసి లో విలీనం చేయడం జరిగిందని వారు దుమ్మెత్తి పోస్తున్నారు.

**రాత్రికి రాత్రే నిర్ణయం...**

**ఇప్పుడు ప్రజల అభిప్రాయాలు ఎందుకు...!?**

ప్రభుత్వం తమ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ శివారు మున్సిపాలిటీల విలీనాన్ని చేపట్టడం జరిగిందని, ఎవరి ఆలోచన మేరకు, ఎవరికి మూటలు మోయటానికి ఈ పన్నాగం పన్నారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు ప్రశ్నిస్తున్నారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకున్న చందంగా ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసి శివారు మున్సిపాలిటీల ఉసురు తీశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 150 డివిజన్లను 300 గా మార్చి కనీస ప్రమాణాలు, విధివిధానాలు లేకుండా ఇష్టానుసారంగా వార్డులను డివిజన్లను పనిచేసుకొని నేడు రాష్ట్ర ప్రభుత్వం నగర ప్రజల ముందు దోషిగా నిలబడిందని వారు ఆరోపించారు. మాకు కావాల్సింది మేము చేసుకున్నాం మీరు మీరు తన్నుక చావండి అన్న చందంగా మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేసి ఇప్పుడు తాపీగా అభిప్రాయ సేకరణ అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం దిక్కుమాలిన చర్యగా వారు అభిమానించారు. అటు ప్రజలకు గాని, ఇటు బిఆర్ఎస్ సహా విపక్షాలకు గాని స్పష్టమైన సమాచారం లేదని, కనీసం నూతనంగా ఏర్పాటైన వార్డుల విభజనకు సంబంధించిన వివరాలు, మ్యాపులు అధికారులు అందించలేని దుస్థితిలో ఉన్నారని, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాలుగు పేపర్లు అందించి దానినే ప్రజాభిప్రాయ సేకరణగా ప్రభుత్వం చూపించే ప్రయత్నం చేస్తుందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యగా వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం పరమ దరిద్రంగా ఉందని తెలియజేయడానికి శేర్లింగంపల్లి పరిధిలోని జాతీయ రహదారులను పక్కనపెట్టి చిన్న చిన్న మురికి కాలువలను వార్డుల విభజన హద్దులుగా చూపించడం ఇందుకు నిదర్శనం అని వారు స్పష్టం చేశారు. మరోవైపు ఒక కాలిని రెండు వార్డులకు పనిచేస్తూ ప్రాంతాలను విడదీయడం, ప్రజలను విడదీయడం పిచ్చి తుగ్లక్ పరిపాలనకు సరిపోలుతుందని వారి ఎద్దేవా చేశారు. అనంతరం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోరడే ను కలిసిన బిఆర్ఎస్ నేతలు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ వార్డుల విభజన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, వాలా హరీష్, రోజా, శ్రీనివాసరావు, రామకృష్ణ గౌడ్, కిరణ్ యాదవ్, అల్లావుద్దీన్, గౌస్, బాలరాజు, సంతోష్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అల్విన్ చౌరస్తావద్ద ట్రాఫిక్ జామ్‌కు ఇక తెర




**శేరిలింగంపల్లి, డిసెంబర్ 12 (జనంసాక్షి) :** మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికై తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, మియాపూర్ ట్రాఫిక్ సిఐ ప్రశాంత్, చందానగర్ సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి శుక్రవారం రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ సమీక్షను నిర్వహించి అనంతరం క్షేత్ర పర్యటనకు వెళ్లి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ రహిత సమాజంకోసం నిర్మాణాత్మక అడుగులను చేపడుతున్నామని, ఇందులో భాగంగానే నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న మియాపూర్ పరిధి ఆల్విన్ కాలనీ చౌరస్తాలో క్షేత్ర పర్యటన చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మియాపూర్ చౌరస్తా నుండి ఆల్విన్ చౌరస్తా మీదుగా నూతనంగా నిర్మించబోయే ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడానికి ఏర్పాట్లను చేపడుతున్నామన్నారు. ఎంతో కీలకంగా పరిణమించే ఆల్విన్ కాలనీ చౌరస్తా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పక్కా ప్రణాళికతో చేపట్టి పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. అధికారులు సైతం అంతే నిబద్ధతతో ఫ్లై ఓవర్ నిర్మాణం విషయంలో ఎలాంటి రాజీలేని ధోరణితో వ్యవహరించి అత్యంత పటిష్టమైన, నాణ్యమైన నిర్మాణాన్ని చేపట్టి త్వరితగతిన పూర్తిచేసి అనుకున్న సమయానికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మియాపూర్ అల్విన్ చౌరస్తా సమీపంలో భారీగా ట్రాఫిక్ ఏర్పడుతుండడంతో కొండాపూర్ వైపునుండి వచ్చే ట్రాఫిక్‌ను తాత్కాలికంగా మదీనగూడ యూ-టర్న్ వద్ద(అల్విన్ సమీపంలో) ట్రాఫిక్ పోలీసు అధికారులు దారి మళ్లించడం జరిగిన విషయం విధితమే. సుమారు 300 మీటర్ల దూరం వరకు ట్రాఫిక్‌ను ముందుకు మార్చడం జరిగింది. ఇందులో భాగంగా మియాపూర్ వైపు ఉండే రైట్ టర్న్‌ను మూసివేశారు. దీంతో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఫ్రీ లెఫ్ట్ టర్న్‌ను అందుబాటులో తీసుకొచ్చి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందుకలు లేకుండా సాఫీగా సాగుతుందని, ఫ్రీ లెఫ్ట్ తీసుకోవడం వలన ప్రజలకు ,వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని చైర్మన్ అరికపూడి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు శ్రీదేవి, ప్రతాప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇండిగో వ్యవహారంపై సీసీఐ దృష్టి

- సుమోటోగా విచారణకు సిద్ధం



న్యూఢిల్లీ, డిసెంబర్12 (జనంసాక్షి) : విమానాల రద్దుతో దేశీయ విమాన రంగంలో కలకలం రేపిన ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దృష్టి సారించింది. మార్కెట్‌లో న్యాయబద్ధమైన పోటీకి సంబంధించి ఇండిగో ఏవైనా నిబంధనలు ఉల్లంఘించిందా? లేదా? అనే విషయాన్ని తేల్చేందుకు ప్రాథమిక పరిశీలన ప్రారంభించింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇండిగో విషయంలో సీసీఐ సుమోటోగా దృష్టి సారించింది. మార్కెట్‌లో అతిపెద్ద ఎయిర్‌లైన్స్‌గా ఉన్న ఇండిగో తన స్థాయిని దుర్వినియోగ పరిచిందా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. అయితే, ఈ అంశంలో ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు దాఖలు కాలేదు. స్థూలంగా మార్కెట్‌లో ఇండిగోకు ఉన్న ఆధిపత్యంతో పాటు వివిధ మార్గాల్లో సంస్థ స్థితిని కూడా పరిశీలిస్తున్నామని అధికారి ఒకరు తెలిపారు. అధిక ధరలు, ఇతరులకు మార్కెట్‌లో స్థానం దక్కకుండా చేయడం వంటి ఉల్లంఘనలు జరిగాయో లేదో తేల్చేందుకు రంగంలోకి దిగారు. మార్కెట్‌లో ఆధిపత్య సంస్థగా ఉండటంలో తప్పు లేదని, ఈ స్థానాన్ని దుర్వినియోగ పరిస్తేనే తప్పు అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం, సీసీఐ తొలుత ప్రాథమిక సమాచారం ఆధారంగా పరిశీలన నిర్వహిస్తుంది. ఉల్లంఘన జరిగినట్టు ప్రాథమికంగా తేలితే పూర్తి స్థాయి దర్యాప్తు మొదలవుతుంది. ఇప్పటికే ఇండిగోపై డీజీసీఏ దృష్టి పెట్టింది. ఫ్లైట్‌ల రద్దుకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. పైలట్ డ్యూటీ, విశ్రాంతికి సంబంధించిన కొత్త నిబంధనలకు అనుగుణంగా ప్లానింగ్ లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రధాన కారణం ఇదే అయి ఉండొచ్చన్న అంచనాకు అధికార వర్గాలు వచ్చాయి. ఇక డీజీసీఏ ఇప్పటికే ఇండిగో ప్రధాన కార్యాలయంలో కార్యకలాపాల పర్యవేక్షణకు ఇద్దరు ప్యానల్ సభ్యులను పంపించింది. ఫ్లైట్ ఆపరేషన్స్, చెల్లింపులు, ప్యాసెంజర్‌లకు సహాయం అందించడం తదితర అంశాలను పర్యవేక్షిస్తోంది. ఇక ఇండిగో వ్యవహారాలను పర్యవేక్షించేందుకు డిప్యుటేషన్‌పై వెళ్లిన నలుగురు ఫ్లైట్ ఆపరేషన్ ఇన్‌స్పెక్టర్‌లపై కూడా వేటు పడింది. దీంతో పాటు సంస్థలోని సిబ్బంది నిర్వహణ, విధుల కేటాయింపు, డ్యూటీలకు సంబంధించిన కొత్త నిబంధనల కోసం సంస్థ ఏమేరకు సంసిద్ధంగా ఉందో తేల్చేందుకు నలుగురు సభ్యులతో ఓ కమిటీని కూడా ఏర్పాటయ్యింది.

# భారత పౌరసత్వం వదులుకున్న 9లక్షల మంది

- పార్లమెంటుకు వెల్లడించిన విదేశీ వ్యవహారాల మంత్రి కీర్తివర్ధన్ సింగ్



న్యూఢిల్లీ, డిసెంబర్ 12 (జనంసాక్షి) : ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంటులో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విదేశీ పౌరసత్వాన్ని పొందుతున్న భారతీయుల సంఖ్య మరింత పెరిగిందని.. గడిచిన ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు.భారత పౌరసత్వం విషయంలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వాన్ని వదులుకొనే వ్యక్తుల వార్షిక రికార్డులను ప్రభుత్వం భద్రపరుస్తోందని తెలిపారు. ఆ రికార్డుల ప్రకారం.. 2011-2019 మధ్య 11,89,194 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని తెలిపారు. గత 14 సంవత్సరాల్లో భారత్‌లోని 20 లక్షలకు పైగా ప్రజలు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నట్లు డేటా సూచిస్తోంది. దీంతో విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల కోసం భారత్ యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులై అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల బారిన పడుతున్నారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇటీవల ఇటువంటి కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటిలో చాలావరకు సోషల్ మీడియాలో ఉద్యోగ ఆఫర్లను నమ్మడంతోనే మొదలవుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటివి నివారించడానికి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా విదేశాంగ శాఖ యువతకు అవగాహన కల్పిస్తోందన్నారు. నమోదు కాని ఏజెంట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2025 నాటికి 3,505 నమోదుకాని ఏజెంట్ల వివరాలను ఇ-మైగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు.

## మంత్రి సీతక్క 'మినిస్టర్-ఇన్-వైటింగ్'గా నియామకం

- భారత రాష్ట్రపతి తెలంగాణ పర్యటన నేపథ్యంలో నియామకం



హైదరాబాద్ (జనంసాక్షి) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 17 నుండి 22 వరకు తెలంగాణలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ను రాష్ట్రపతి గారి పర్యటనకు సంబంధించి మినిస్టర్-ఇన్-వైటింగ్ గా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఈ నెల 13, 14 వ తేదీల్లోనూ జీహెచ్‌ఎంసీ వార్డుల డిలిమిటేషన్ ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 12 (జనంసాక్షి) : జీహెచ్‌ఎంసీ వార్డుల డిలిమిటేషన్‌పై వచ్చే ఫిర్యాదులను సెలవుదినాలైన ఈ నెల 13, 14 వ తేదీన కూడా స్వీకరించనున్నట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ఈ నెల 13, 14 తేదీలలో కూడా ఫిర్యాదులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తమ అభ్యంతరాలు, సూచనలు సమర్పించుకునే వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది.

## పౌరసత్వానికి ముందే ఓటరుగా సోనియా దరఖాస్తు

- కేసులో బలమైన ఆధారాలను సమర్పిస్తారా?



న్యూఢిల్లీ, డిసెంబర్12 (జనంసాక్షి) : ఓటర్ల జాబితాలో పేరు చేర్పుపై సీనియర్ కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి మంగళవారం ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే దీనికి సంబంధించి ఆధారాలు బయటపడాల్సి ఉంది. అప్పుడే ఆమెపై వచ్చిన ఆరోపణలు రుజువు కాగలవు. బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు మాత్రం సరికాదు. 1983లో భారత పౌరసత్వం రావడానికి మూడేళ్లముందుగానే ఓటర్ల జాబితాలో సోనియా పేరును చేర్చారన్న ఆరోపణపై దర్యాప్తునకు తిరస్కరిస్తూ మెజిస్ట్రేట్ గతంలో ఆదేశాలు ఇచ్చారు. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది.సెప్టెంబరు 11న మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన రివిజన్ పిటిషన్‌ను ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగె విచారించారు. ఇది చట్టబద్ధంగా సమర్థనీయం కాదని, సారాంశ లోపంతో కూడిన ఆరోపణలున్నాయని కోర్టు అభిప్రాయపడింది. మేజిస్టీరియల్ కోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అయితే సోనియాకు, పోలీసులకు నోటీసులు జారీ చేసిన తర్వాత, తదుపరి విచారణ నిమిత్తం జనవరి 6వ తేదీకి ఈ అంశాన్ని వాయిదా వేశారు. సెంట్రల్ ఢిల్లీ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది వికాస్ త్రిపాఠి ఈ రివిజన్ పిటిషన్ వేశారు. 1980 జనవరిలోనే సోనియా పేరును న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఓటరుగా చేర్చారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పటికి ఆమె భారత పౌరురాలు కాదని తెలిపారు. ఈ విషయమై ఫోర్జరీ జరిగిందని, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని మోసం చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను ప్రియాంకా గాంధి ఖండించారు. దీనిక ఏమైనా ఆధారాలున్నాయా అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా అబద్ధమని, ఆమె పౌరసత్వం పొందిన తరువాతే ఓటు హక్కు పొందారని తెలిపారు. 80 ఏళ్ల వయసులో ఆమెపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు.. రాజకీయ దురుద్దేశంతోనే సోనియాను లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు..అయితే పిటిషన్ దారుడు తనవద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టినప్పుడే దీనికి విశ్వసనీయత ఉంటుంది.

# పర్సనల్ రైట్స్ కాపాడండి




- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పవన్ కళ్యాణ్

న్యూఢిల్లీ, డిసెంబర్12 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పర్సనల్ రైట్స్ కాపాడు కోవడానికి న్యాయస్థానంలో పవన్ తరపు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపింది హైకోర్టు. ఈ సందర్భంగా సోషల్ మీడియా సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘించే విధంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో ప్రచారం జరుగుతోందని పిటిషన్‌లో పేర్కొనడంతో, ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. వ్యక్తిత్వ హక్కులను కాపాడటం అత్యంత అవసరం, హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన సోషల్ మీడియా అకౌంట్లపై వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, పవన్ తరపు న్యాయవాది రెండు రోజుల్లోగా ఈ ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలు, లింక్‌లు, స్క్రీన్‌షాట్లు తదితర సమాచారాన్ని సోషల్ మీడియా సంస్థలకు అందజేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వివరాలు అందిన వెంటనే ఆ కంపెనీలు తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణను డిసెంబర్ 22కి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ నేతల ఇలాఖాల్లో బిఆర్ఎస్ గెలుపు

- పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిన అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 12 (జనంసాక్షి) : వేలం పాటల ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా కనిపించినా.. ప్రజాక్షేత్రంలో మాత్రం గులాబీ పార్టీ పలుస్థానాల్లో సత్తా చూపింది. హోరాహోరీగా సాగిన తొలి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధికార కాంగ్రెస్ పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. గులాబీ సైన్యం పోటీచేసిన ప్రతి పంచాయతీలో పోటీ నువ్వా-నేనా అన్నట్టు సాగింది. సంఖ్యాపరంగా కాంగ్రెస్ పార్టీకి పంచాయితీల సంఖ్య కొద్దిగా మెరుగ్గా ఉన్నట్టు కనిపించినా.. ఆ పార్టీకి గ్రామాల్లో 56శాతం వ్యతిరేక ఓట్లు పడ్డట్టు ఎన్నికల ఫలితాలను బట్టి తెలుస్తున్నది. సూర్యాపేట జిల్లా లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించారు. మేజర్ గ్రామ పంచాయతీకి బీఆర్ఎస్ బలపరిచిన 95 ఏండ్ల రామచంద్రారెడ్డి తిరుగులేని ఆధిక్యం కనబరిచారు. భద్రాచలం కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సొంత గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నేత మడకం జోగయ్య 84 ఓట్ల తేడాతో గెలిచారు. మంత్రి సీతక్క సొంత జిల్లా ములుగు మేజర్ గ్రామ పంచాయతీ ఏటూరునాగారంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకులమర్రి శ్రీలత 3,230 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 60 శాతంకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. జడ్చర్ల, భద్రాచలం, షాద్‌నగర్, మహబూబాబాద్, ఇంకా అనేక నియోజవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ సొంత గ్రామాల్లో సర్పంచ్‌లను గెలిపించుకోలేకపోయారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4,236 గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 396 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 3,834 గ్రామ పంచాయతీలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ ఏకగ్రీవం చేసుకున్న మేజర్ పంచాయతీలను వేలం పాటల ద్వారానే కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. గులాబీ పార్టీ 1,345 చోట్ల విజయం సాధించినట్టు వార్తలు అందాయి. బీఆర్ఎస్ అభ్యర్థులు కేవలం 10ఓట్ల లోపు తేడాతో 50కి పైగా గ్రామాల్లో ఓటమి చవిచూసినట్టు తెలిసింది. 20 ఓట్ల తేడాతో ఓడిన గ్రామాలు 150కిపైగానే ఉన్నట్టు తెలుస్తున్నది. వచ్చే సాధారణ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తామని కలలు కంటున్న బీజేపీ కేవలం 186 గ్రామ పంచాయతీలకే పరిమితమైంది. ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండానే పోటీ చేసిన అభ్యర్థులు 524 పంచాయతీల్లో విజయం సాధించారు.

## గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ అత్యాచారం

- ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్

హైదరాబాద్, డిసెంబర్12 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలోని జేఎన్టీయూలో దారుణం చోటు చేసుకుంది. గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకే సామాజిక వర్గం అంటూ నమ్మించి మరీ బాధితురాలిని ప్రొఫెసర్ వంచించాడు. ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతూ.. భయపెడుతూ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చివరకు బాధితురాలి కాపురాన్ని కూడా కూల్చేశాడు కీచక ప్రొఫెసర్. వర్క్ ఉందంటూ బాధితురాలిని అర్ధరాత్రి వరకు తనతోనే ఉంచుకున్నాడు ప్రొఫెసర్. దీంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో బాధితురాలు ఒంటరిగా ఉంటోంది. అంతేకాకుండా ఆమె ఒంటరితనాన్ని అవకాశంగా మలుచుకుని శారీరకంగా, మానసికంగా ప్రొఫెసర్ మరింతగా వేధింపులకు గురిచేశాడు. తన ఛాంబర్‌లో కూడా బాధితురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. రోజు రోజుకు ప్రొఫెసర్ వేధింపులు అధికమవడంతో బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ప్రొఫెసర్ వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించింది. దీంతో నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రముఖ విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## 75లోకి అడుగిడిన తలైవా రజనీకాంత్

- ప్రధాని మోడీ ప్రత్యేక అభినందనలు

చెన్నై, డిసెంబర్12 (జనంసాక్షి) : సూపర్ స్టార్ రజనీకాంత్ శుక్రవారం 75వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తలైవాకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా బర్త్‌డే విషెస్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం రజనీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. '75వ పుట్టినరోజు సందర్భంగా తిరు రజనీకాంత్‌జీకి శుభాకాంక్షలు. ఆయన నటన ఎన్నోతరాలుగా ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. తన స్టైల్‌తో ఎన్నో ప్రశంసలు పొందారు. విభిన్న పాత్రలు చేస్తూ సినిమా ఇండస్ట్రీలో శాశ్వత స్థానాన్ని సొంతం చేసుకున్నారు. 75వ పుట్టినరోజు చేసుకుంటోన్న సంవత్సరంలోనే ఆయన ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తికావడం విశేషం. ఆయన ఇలానే మంచి ఆరోగ్యంగా ఉంటూ ప్రేక్షకులను అలరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## దువ్వాడ మాధురి శ్రీనివాస్‌కు బిగ్ షాక్

- అనుమతి లేకుండా బర్త్‌డే పార్టీ
- మద్యం బాటిళ్లు, హుక్కాలు స్వాధీనం



హైదరాబాద్, డిసెంబర్12 (జనంసాక్షి) : దువ్వాడ మాధురి శ్రీనివాస్‌కి బిగ్ షాక్ తగిలింది. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీద పెండెంట్ ఫామ్‌హౌస్‌లో ఆయన పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. ఈ క్రమంలో బర్త్ డే పార్టీని రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు నిలిపివేశారు. జన్మదిన వేడుక జరుపుకోవడానికి పోలీసుల నుంచి దువ్వాడ మాధురి శ్రీనివాస్ ఎలాంటి పర్మిషన్ తీసుకోకపోవడంతోనే భగ్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పార్టీలో అక్రమ మద్యాన్ని కూడా పోలీసులు పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బర్త్ డే పార్టీలో 10 స్కాచ్ బాటిళ్లు, ఐదు హుక్క బాటిళ్లను ఎస్‌ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దువ్వాడ మాధురి శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

## కాంగ్రెస్ హామీలే తప్ప అమలు లేదు

- పాతబస్తీ జనంబాటలో కవిత విమర్శలు



హైదరాబాద్, డిసెంబర్ 12 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాల్లో గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమెల్సీ కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సైదాబాద్‌లో స్టీల్‌బ్రిడ్జి పనులను పరిశీలించి ఐదేళ్లుగా నిర్మాణం జరుగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చిందేమీ లేదని విమర్శించారు. పాతబస్తీలో పర్యటిస్తే గోతులమయంగా మారిన రోడ్లు, 30ఏళ్ల క్రితం వేసిన మ్యాన్‌హోళ్లు తప్ప నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు కనిపించడం లేదన్నారు. పురాణ షహర్ కాదు.. హమారా షహర్ అని, అందరితో సమానంగా అభివృద్ధి జరగాలని కోరారు. గౌలిపురా ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించాలన్నారు. పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం తక్కువ బ్జడెట్ ఇచ్చి చిన్నచూపు చూస్తున్నదని ఆరోపించారు. ముసారాంబాగ్ చౌరస్తాలో ఎ?సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో దానిపై ఆధారపడిన చాలా మంది విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదముందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. హామీ ప్రకారం విద్యార్థులకు స్కూటీలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులు, హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు, పారిశుధ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. యాకుత్‌పుర నియోజకవర్గం సింగరేణి కాలనీ, ఖాజాబాగ్, చింతల బస్తీల్లో కవిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు వచ్చినా బస్తీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు శైలజా గౌడ్, రాధాకృష్ణ, ఆశిశ్ దూబె, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు

- తొలి విడతలో 8వేలమందికి అవకాశం
- కాగ్నిజెంట్ సిఇవో రవికుమార్ వెల్లడి

విశాఖపట్నం, డిసెంబర్12 (జనంసాక్షి) : విశాఖపట్నం రావడం తన సొంతింటికి వచ్చినట్లుగా ఉందని కాగ్నిజెంట్ సంస్థ సీఈవో రవికుమార్ వెల్లడించారు. విశాఖపట్నం నగరం భవిష్యత్తులో ఎ.ఐ హబ్‌గా మారుతుందన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సంస్థ సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలోని కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. ముందుగా 8 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. తాము జీసీసీ సెంటర్ సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్, సత్వా సంస్థతోపాటు మరో ఏడు ఐటీ సంస్థలకు సీఎం చంద్ర బాబు, మంత్రి నారా లోకేశ్‌తోపాటు కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు కలిసి భూమి పూజ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖపట్నం కేంద్రంగా మారబోతోందన్నారు. ఎకనమిక్ రీజియన్ కింద నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. కాగ్నిజెంట్ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఐటీ సంస్థల పెట్టుబడులతో విశాఖకు మరింత వెలుగు వచ్చిందని చెప్పారు. పెట్టుబడులు పెట్టేవారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370